












fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 11 | విజయవాడ, గురువారం 11 జనవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

ఆధార్‌కు 'వర్చువల్ ఐడి'



యుఐడిఎఐ నష్ట నివారణ చర్యలు

ఆధార్ డేటాకు భద్రత లేదని పరోక్ష అంగీకారం

వర్చువల్ ఐడి పనితీరుపైనా అనుమానాలు

నిరాక్షరాస్యులు ఐడిని సృష్టించుకోగలరా?

న్యూఢిల్లీ: ఆధార్ కార్డులు జారీచేయటానికి ప్రభుత్వం సేకరించిన పౌరుల సమాచారానికి ఏ మాత్రం భద్రత లేదని రుజువు చేసిన ట్రిబ్యూన్ పత్రిక విలేకరిపై కేసు నమోదు చేసిన ప్రభుత్వం నలుమూలల నుండి వెల్లువెత్తుతున్న నిరసనలతో నష్టనివారణ చర్యలకు దిగింది. పౌరుల సమాచారానికి భద్రతలేదని స్పష్టం కావటంతో పలు చర్యలకు పూనుకున్నది. ఆధార్ డేటా గోప్యతపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆధార్ గుర్తింపుసంస్థ (యుఐడిఎఐ) బుధవారం 'వర్చువల్ ఐడి'పేరిట ఆధార్ కార్డ్ హోల్డర్లకు ప్రత్యేక సదుపాయాన్ని ప్రకటించింది. ఇప్పుడు గుర్తింపు కోసం ఆధార్ నెంబర్‌ను చెప్పటానికి బదులుగా వెబ్‌సైట్ నుండి ఈ వర్చువల్ ఐడిని సృష్టించుకుని మొబైల్ సిమ్ వెరిఫికేషన్, తదితర గుర్తింపు ప్రయోజనాలకు ఉపయోగించుకోవచ్చని యుఐడిఎఐ ఒక ప్రకటనలో వివరించింది. అయితే నిరక్షరాస్యులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోగలిగిన వారు తక్కువగా ఉన్న మనదేశంలో యుఐడిఎఐ వెబ్‌సైట్‌ను ఉపయోగించుకుని వర్చువల్ ఐడిని సృష్టించుకోవటం సాధ్యమౌతుందా? 16 అంకెలతో కూడిన ఈ వర్చువల్ ఐడి ద్వారా సాధారణ గుర్తింపునకు అవసరమైన పేరు, చిరునామా, ఫొటో వంటి వివరాలను మాత్రమే వెల్లడించవచ్చునని ప్రభుత్వం చెబుతున్నది నమ్మశక్యంగా లేదు. యుఐడిఎఐ, ప్రభుత్వం అనేక రక్షణలు కల్పించామని చెప్పిన తర్వాత సులభంగా ఆధార్ సమాచారాన్ని తస్కరించే అవకాశం ఉన్నపుడు ఇపుడు యుఐడిఎఐ చెబుతున్న రక్షణలు మాత్రం చౌర్యాన్ని అరికడతాయా? వేలి ముద్రలు, లేదా కంటిపాప చిత్రాలు, ఇతర బయోమెట్రిక్ గుర్తింపును ఇవ్వాల్సిన అవసరం వుండదని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. ఒక వినియోగదారుడి వివరాలను పరిమిత స్థాయిలో మాత్రమే వెల్లడించేందుకు వీలుగా 'పరిమిత కెవైసి' పద్ధతిని కూడా యుఐడిఎఐ ప్రవేశపెట్టింది. ఈ పరిమిత కెవైసి ద్వారా వెల్లడయిన వివరాలు ఆయా అవసరాలకు మాత్రమే ఉపయోగపడతాయని ఈ ప్రకటనలో వివరించారు. ఈ వర్చువల్ ఐడి సదుపాయం ఈ ఏడాది మార్చి 1 నుండి అందుబాటులోకి వస్తుందని యుఐడిఎఐ తన ప్రకటనలో పేర్కొంది.



విజయవాడలోని మహాత్మాగాంధీ రోడ్డులో మూసి ఉంచిన జోయాలుక్కాస్ షోరూం

జోయాలుక్కాస్ దుకాణాలపై ఐటి దాడులు

రాష్ట్రంలోనూ అన్ని ప్రాంతాల్లో తనిఖీలు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా గల జోయాలుక్కాస్ ఆభరణాల దుకాణాల్లో బుధవారం ఆదాయపన్ను శాఖ దాడులు నిర్వహించింది. పెద్ద నోట్ల రద్దు అనంతరం పన్నులు ఎగ్గొట్టినట్లు ఆరోపణలు తలెత్తిన నేపథ్యంలో ఈ సోదాలు జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు. కేరళకు చెందిన జోయాలుక్కాస్, మంజలి జ్యూయలర్స్ గ్రూపులకు చెందిన 130 దుకాణాలు, సముదాయాలపై ఈ దాడులు జరిగాయి. చెన్నై, హైదరాబాద్, త్రిస్సూర్ స్టోర్లలోనూ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్,

మిగతా 9లో



రుద్రకుమార్ ఇంట్లో తనిఖీ చేస్తున్న ఎసిబి అధికారులు

ఎస్‌వియూలో అవినీతి తిమింగలం

- అసిస్టెంట్ ఇంజినీర్ ఇంట్లో ఎసిబి సోదాలు
- రూ.100 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు!

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో/ క్యాంపస్(తిరుపతి)

అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) వలలో మరో అవినీతి తిమింగలం చిక్కుకుంది. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ (ఎస్‌వియు)లో అసిస్టెంట్ ఇంజినీర్ రుద్రకుమార్ (డ్రాఫ్ట్‌మ్యాన్) ఇంట్లో బుధవారం ఎసిబి జరిపిన దాడుల్లో రూ. 100 కోట్లకు పైగా ఆదాయానికి మించిన ఆస్తులు బయటపడ్డాయి. ఎసిబి డిజి ఆర్పీ ఠాకూర్

మిగతా 9లో

రోడ్డు ప్రమాదాల్లో సగటున

రోజుకు 400 మంది బలి



- గత ఏడాది లక్షన్నర మంది మృతి
- అంతకు ముందుతో పోల్చితే 40 వేల మరణాలు అధికం

న్యూఢిల్లీ: భారత్‌లో సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాలలో సగటున రోజుకు కనీసం 400 మందికి పైగా ప్రాణాలు కోల్పోతున్నారని తాజా అధ్యయనంలో వెల్లడయింది. ఏటా దాదాపు 1.5 లక్షల మందిని పైగా బలిగొంటున్న రోడ్డు ప్రమాదాలకు భారత్‌లో పెరుగుతున్న వాహనాల వినియోగం, మరమ్మతులకు నోచుకోని రహదారి పరిస్థితులే కారణమని ఈ అధ్యయన నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు. గత ఏడాదికాలంలో వివిధ రోడ్డు ప్రమాదాలలో మరణించిన వారి సంఖ్య 1.5 లక్షలుగా నమోదయింది. ఇది అంతకు ముందు ఏడాది కన్నా దాదాపు 40 వేలు ఎక్కువ. రోడ్డు ప్రమాదాలకు ముఖ్యంగా శరవేగంతో దూసుకెళ్తున్న ద్విచక్ర వాహనాలు, ఎయిర్ బ్యాగ్‌ల వంటి రక్షణ వ్యవస్థలు అమర్చని కార్లే కారణమని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఈ పరిస్థితులకు చెక్‌పెట్టే అంశాన్ని తీవ్రంగా పరిశీలిస్తోంది. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వాహనదారులకు భారీ జరిమానాలను ప్రతిపాదించటంతో పాటు కార్లలో భద్రతా వ్యవస్థలను మెరుగుపర్చాలని కారు తయారీ సంస్థలను ఆదేశిస్తూ 2016ఆగస్టులో ప్రవేశపెట్టిన బిల్లుకు ఇప్పటికే లోక్‌సభ ఆమోదం లభించింది. ఈ ఏడాది దీనికి ఎగువ సభ ఆమోదముద్ర లభిస్తుదని ప్రభుత్వం భావిస్తోంది. భారత్‌లో కార్ల తయారీ పరిశ్రమను ప్రోత్సహించే లక్ష్యంతో దేశ, విదేశీ కార్ల తయారీ సంస్థలకు విస్తృత అవకాశాలు కల్పిస్తూ ఈ బిల్లులో అనేక మార్పులు ప్రతిపాదించారు. 2020 నాటికి చైనా, అమెరికా తరువాత కార్ల తయారీలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో నిలిచే అవకాశం వుందని ఐహెచ్‌ఎస్ పరిశోధనా సంస్థ అంచనా వేస్తోంది. ఆయా దేశాల జాతీయ స్థూల ఉత్పాదకత (జిడిపి)లో కనీసం 3 శాతం మేర రోడ్డు ప్రమాదాల ద్వారా ప్రభుత్వాలపై భారం పడుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలో వాహన తయారీ నాణ్యతపై అధ్యయనం నిర్వహించే ఎన్‌కాప్ సంస్థ గత కొన్నేళ్లుగా భారత్‌లో చిన్నతరహా వాహనాల నాణ్యతకు జీరో స్టార్ రేటింగ్ ఇస్తోంది. ఈ వాహనాల వేగం గంటకు 40 కి.మీ మించితే ప్రాణాంతకమైన రోడ్డు ప్రమాదాలకు దారి

మిగతా 9లో

చైనా మాదిరి అభివృద్ధి

ఆర్థిక సంస్కరణలతో అగ్రదేశంగా ఎదిగిన చైనా

పాలేకర్‌తో వ్యవసాయాధికారులు విభేదించొద్దు

తూర్పుగోదావరి జిల్లా జన్మభూమి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



జన్మభూమి సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం/కాకినాడ ప్రతినిధులు

చైనా ఆర్థిక సంస్కరణల ద్వారా ప్రపంచంలో ఏకైక అగ్రదేశంగా ఎదిగిందని, ఆ దేశం మాదిరిగానే రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నానమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో అందరూ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం మండలం చెయ్యేరు, గున్నేపల్లిలో బుధవారం జరిగిన జన్మభూమి- మాఊరు సభలో చంద్రబాబు మాట్లాడారు. తక్కువ ఖర్చుతో చేపట్టే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. దీన్ని ప్రోత్సహిస్తున్న పాలేకర్‌తో వ్యవసాయాధికారులు విభేదించొద్దని సూచించారు. నిరుద్యోగులకు నిరుద్యోగభృతి ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని అన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామే తప్ప పెంచబోమని స్పష్టం చేశారు. ప్రజలకు విజన్ ఉండాలన్నారు. తాను రాష్ట్రానికి, జిల్లాలకు విజన్ ఇచ్చానని చెప్పారు. జన్మభూమి- మాఊరు ముగింపు సందర్భంగా గురువారం రాష్ట్రంలో రెండు లక్షల మందికి లబ్ధి కలిగే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. రాష్ట్రాన్ని దేశంలో ఉత్తమంగా తీర్చిదిద్దుతామన్నారు. శారీరక శ్రమ అవసరం లేకుండా టెక్నాలజీ ఉపయోగించి మేధస్సుతో అభివృద్ధి సాధించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. గతంలో దెయ్యాలు పింఛన్లు తీసుకున్నాయని, పింఛన్లు తీసుకుని శ్మశానానికి వెళ్లిపోయాయని అన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఇప్పుడు దెయ్యాలు, దొంగలు పింఛన్లు తీసుకుంటున్నారా? అని ప్రజలను ప్రశ్నించగా లేదు.. లేదంటూ ప్రజలు స్పందించారు. వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేసినట్లు చెప్పిన చంద్రబాబునాయుడు పోలవరం ప్రాజెక్టు పూర్తయితే రెండు పంటలకు నీరు ఢోకా ఉండదన్నారు. ఫైబర్‌గ్రిడ్ ద్వారా 500 ఛానళ్లు, వీడియో, ఇంటర్నెట్, మూడు టెలిఫోన్లు, వైఫై ఇస్తామని

మిగతా 9లో



కర్నూలు జిల్లా ఆలూరులో సిపిఎం జిల్లా మహాసభల సందర్భంగా నిర్వహించిన భారీ ప్రదర్శన

7

పైసా వసూల్..!

- పండగలకు ప్రత్యేక బాదుడు
- ఆర్టీసిలో అదనపు ఛార్జీలు
- బెంబేలెత్తుతున్న సామాన్యులు

2

ప్రయివేటు మెడికల్ కాలేజీలకు పండగ

- సామాన్యులకు వైద్య విద్య దూరం
- ఎన్‌ఎంసి బిల్లుతో ఇష్టారాజ్యంగా సీట్లు, ఫీజుల పెంపు
- బ్రిడ్జి కోర్సుతో సంప్రదాయ వైద్యానికి లైసెన్సులు
- ఐఎంసి నిబంధనలకు విరుద్ధమంటున్న నిపుణులు
- బిల్లును వ్యతిరేకిస్తున్న వైద్యులు

9

ఆన్‌లైన్‌లో ఇంటర్ ప్రాక్టికల్ ప్రశ్నాపత్రాలు

కార్యదర్శి ఉదయలక్ష్మి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షల ప్రశ్నాపత్రాల్ని సంబంధిత పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌కు ఆన్‌లైన్‌లో పంపుతామని ఇంటర్మీడియేట్ విద్యామండలి బోర్డు కార్యదర్శి బి ఉదయలక్ష్మి వెల్లడించారు. ప్రతి రోజూ జంబ్లింగ్ పద్ధతిలో వేరువేరు పరీక్షా కేంద్రాలకు ప్రాక్టికల్ ఎగ్జామినర్లను పంపుతామన్నారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు జరుగనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లపై ఆ శాఖాధికారులతో ఆమె బుధవారం విజయవాడలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1,423 పరీక్షా కేంద్రాల్ని ఏర్పాటు చేశామన్నారు. ఎథిక్స్, మానవీయ విలువలు, పర్యావరణ విద్యకు సంబంధించిన ప్రశ్నాపత్రం ఇంటర్ బోర్డు నుంచి సంబంధిత కళాశాలలకు ఆన్‌లైన్ ద్వారా పంపుతామన్నారు. ఈ పరీక్షల సమాధాన పత్రాల్ని పక్క కళాశాలల లెక్చరర్లు మూల్యాంకనం చేస్తారన్నారు. ఇంటర్ విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 21 వరకు నాలుగు విడతలుగా రెండు సెషన్స్‌లో ప్రాక్టికల్స్ జరుగుతాయని పేర్కొన్నారు.

భారీ డాల్ఫిన్



విజయనగరం జిల్లా భోగాపురం మండలం పెదకోండుడాజుపాలెం సముద్రతీరానికి బుధవారం కొట్టుకు వచ్చిన సుమారు 150 కేజీల డాల్ఫిన్

సివిల్స్‌కు 1099 మంది ఎంపిక

మెయిన్స్ ఫలితాల్ని విడుదల చేసిన యూపీఎస్సీ

ఫిబ్రవరి 19 నుంచి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సివిల్ సర్వీసెస్-2017 మెయిన్స్ ఫలితాల్ని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) బుధవారం విడుదల చేసింది. సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూలకు దేశవ్యాప్తంగా 1,099 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఇందులో జనరల్ కేటగిరీ నుంచి 500 మంది, ఒబిసి నుంచి 347 మంది, ఎస్సీల నుంచి 163 మంది, ఎస్టీల నుంచి 89 మంది చొప్పున మొత్తం 1,099 మంది అభ్యర్థులున్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను యూపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్), ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్), ఇండియన్ పోలీసు సర్వీస్ (ఐపీఎస్), కేంద్ర ప్రభుత్వ సర్వీసులు (గ్రూప్-ఏ, గ్రూప్-బీ) ఉద్యోగుల ఎంపిక కోసం 2017, అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3 వరకు సివిల్స్ మెయిన్స్ రాతపరీక్షల్ని యూపీఎస్సీ నిర్వహించింది. ఫిబ్రవరి 19 నుంచి సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని యూపీఎస్సీ ప్రకటించింది. ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులు సంబంధిత పత్రాలతో హాజరుకావాలని కోరింది. ఈనెల 18 నుంచి ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు ఈ సమ్మాన్ లెటర్లు వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకునేందుకు అందుబాటులో ఉంచినట్లు ప్రకటించింది. ఏమైనా సందేహాలుంటే 011-23385271, 23381125, 23098543 లేదా ఫ్యాక్స్ ద్వారా 011-23387310, 23384472 నెంబర్లకు పంపాలని కోరింది.



సాధారణ ఉష్ణోగ్రతలే..

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

కోస్తా, రాయలసీమల్లో మూడు నాలుగు రోజులపాటు సాధారణ ఉష్ణోగ్రతలే కొనసాగుతాయని హైదరాబాదు వాతావరణ శాఖ పేర్కొంది. పగలు సాధారణ ఉష్ణోగ్రతలు, రాత్రి పూట చలి ప్రభావం చూపిస్తుందని తెలిపింది. రాష్ట్రంపైకి ఉత్తర, ఈశాన్య దిశ నుంచి చలిగాలులు వీస్తాయని పేర్కొంది. ప్రస్తుతం భూమధ్య రేఖ నుంచి గల్ఫ్ ఆఫ్ మానర్ వరకు అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని తెలిపింది.

ప్రజ్ఞ

1. 2018లో భారత జిడిపి ఏంత శాతంగా ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది?
2. ఏ రైల్వే స్టేషన్‌లో మొత్తం మహిళా సిబ్బందిని నియమించారు?
3. సిక్కిం అధికారిక ప్రచారకర్తగా ఏవరిని నియమించారు?
4. ప్రపంచ హిందీ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు?
5. బస్సులకు, మెట్రోలకు కామన్ కార్డులను ప్రవేశపెట్టిన రాష్ట్రం?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

నాబార్డే నిధులివ్వాలి

- జైట్లీకి సిఎం చంద్రబాబు లేఖ
- రూ.16,447 కోట్లు రావాల్సి ఉంది

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీకి ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీలో పేర్కొన్నట్లుగా ఏపీకి చేసే ఆర్థిక సాయాన్ని విదేశీ ఆర్థిక సంస్థల నుంచి కాకుండా నాబార్డు నుంచి గ్రాంట్ రూపంలో అందించాలని కోరారు. ప్రత్యేక ప్యాకేజీ ప్రకారం కేంద్ర పథకాల కింద 2015 నుంచి 2020 వరకు ఏపీకి రూ.16,447 కోట్లు రావాల్సి ఉందని ఆయన గుర్తు చేశారు. నిబంధనల దృష్ట్యా ఈ మొత్తాన్ని ఏపీ ప్రాజెక్టుల కోసం వాడుకోవడం సాధ్యంకాదని, నాబార్డు నుంచి ఇప్పిస్తేనే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొత్త రాష్ట్రాలకు కొంత వెసులుబాటు కలుగుతుందని లేఖలో సిఎం పేర్కొన్నారు. కేంద్ర పథకాల కింద ఇచ్చే సాయాన్ని 90:10నిష్పత్తిలో ఇస్తే ఎంతయితే తేడా వస్తుందో ఆ మొత్తాన్ని విదేశీ ఆర్థిక సంస్థ నుంచి చేపట్టే ప్రాజెక్టులకు 2015-2020 మధ్యకాలంలో అందిస్తామనే ప్రకటనను ఆయన ప్రస్తావించారు. ఈ కాలంలో తీసుకున్న విదేశీ రుణాలు, వడ్డీలను తిరిగి



చెల్లిస్తామని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేంద్ర పథకాల వాటాను 90:10 నిష్పత్తిలో ఇస్తే ఏపీకి 2015-16 సంవత్సరానికి గాను రూ. 2,951 కోట్లు అధికంగా నిధులు రావాల్సి ఉందన్నారు. కానీ కేంద్రం మాత్రం దాన్ని రూ. 2516 కోట్లకు మాత్రమే అంచనా వేసిందన్నారు. అదే సూత్రం ప్రకారం 2016-17 ఆర్థిక సంవత్సరానికి రూ.2854 కోట్లు రావాల్సి ఉందని పేర్కొన్నారు. 2015-16తో పోలిస్తే అది 13.43 శాతం అధికమని, అదే వృద్ధి రేటు ప్రకారం చూస్తే 2017-18కి రూ. 3238 కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. కేంద్రం వేసిన తాత్కాలిక లెక్కల ప్రకారం ఐదేళ్ల కాలానికి రూ. 16,447 కోట్లు ఈ పద్దు కింద ఇవ్వాల్సి ఉందని సిఎం పేర్కొన్నారు. దీనికి తోడు ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాలకు కేంద్ర పథకాలు, విదేశీ ఆర్థిక సాయంతో చేపట్టే ప్రాజెక్టులకు 90:10 నిష్పత్తిలో గ్రాంటు పొందే అర్హత ఉందని, అందువల్ల ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాల తరహాల్లోనే విదేశీ ఆర్థిక ప్రాజెక్టుల్లో ఏపీకి 90:10 నిష్పత్తిలో ప్రత్యేక ఆర్థిక సాయం చేయాలన్నారు. ఇప్పటికే అమలులో ఉన్న 2019-20 వరకు ఒప్పందం ఉన్న ప్రాజెక్టులకు దీన్ని వర్తింపజేయాలన్నారు. కేంద్రం ప్రకటించిన ప్రత్యేక ప్రకటన నేపథ్యంలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించి ఏపీ ప్రతిపాదనల్ని ఆర్థిక వ్యవహారాల విభాగానికి పంపిందన్నారు. ఏపీ చేపట్టే ప్రాజెక్టులు మొదలు కావడానికి, పూర్తికావడానికి చాలా సమయం తీసుకుంటుందని, వీటికి విదేశీ ఆర్థిక సంస్థ నుంచి అనుమతులు పొందడానికి సుదీర్ఘ నిబంధనల ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియకు ఆర్థిక సాయాన్ని 2020 లోపు పూర్తిగా ఖర్చు చేసే సామర్థ్యం ఏపీకి లేదని లేఖలో సిఎం వివరించారు. ప్రత్యేక ఆర్థిక సాయాన్ని విదేశీ ఆర్థిక సంస్థకు బదులుగా నాబార్డు నుంచి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. నాబార్డు ద్వారా ఏయే ప్రాజెక్టులకు నిధులు కావాలో ఆ జాబితాను కూడా జైట్లీ దృష్టికి తీసుకెళ్లారు. ఆ మొత్తాన్ని గ్రాంటు రూపంలో ఇవ్వాలని కోరారు.

ఏపీకి 60, తెలంగాణకు 50 టిఎంసిలు

- కృష్ణా బోర్డు వర్కింగ్ గ్రూప్ నిర్ణయం
- ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు తేల్చాలన్న ఇరు రాష్ట్రాల అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కృష్ణా బేసిన్‌లోని నీటి వినియోగానికి సంబంధించి రెండు రాష్ట్రాల మధ్య సర్దుబాటు చేస్తూ కృష్ణా బోర్డు నీటి పంపకాలు చేపట్టింది. వచ్చే ఆగస్టు వరకు ప్రస్తుతం ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని ఇరు రాష్ట్రాలకూ సూచించింది. అందుబాటులో ఉన్న నీటిలో ఆంధ్రప్రదేశ్‌కు 60, తెలంగాణకు 50 టిఎంసిలను అనుమతిస్తూ బోర్డు నిర్ణయించింది. బుధవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన బోర్డు వర్కింగ్ గ్రూప్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు, తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ మురళీధర్‌రావులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇప్పటి వరకు వినియోగించుకున్న నీటితో పాటు భవిష్యత్ వినియోగంపైనా ఈ సమావేశంలో చర్చించారు. అందుబాటులో ఉన్న 139 టిఎంసిల నీటిని వచ్చే ఆగస్టు నెల వరకు జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని రెండు రాష్ట్రాలకూ కృష్ణా బోర్డు సూచించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిలో 20 టిఎంసిల నీటిని పక్కకు పెట్టి 110 టిఎంసిల నీటిని మాత్రమే రెండు రాష్ట్రాలూ వినియోగించుకునేలా సర్దుబాటు చేశారు. శ్రీశైలం ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం 868.8 అడుగులుండగా, 136.93 టిఎంసిల నీటి నిల్వ ఉందని, ఈ ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీ స్థాయి (ఎండీఎల్) కంటే ఎగువనున్న 83.079 టిఎంసిల నీటిని వినియోగించుకునే వీలుందని బోర్డు స్పష్టం చేసింది. ఇక నాగార్జునసాగర్‌లో ప్రస్తుత నీటి నిల్వ 182.34 టిఎంసిలు కాగా, క్యారీ ఓవర్, డెడ్ స్టోరేజీ పోనూ 50.67 టిఎంసిలు వినియోగించుకునేందుకు అవకాశముందని తేల్చింది. ఈ రెండు ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న 133.75 టిఎంసిల్లో ఆంధ్రప్రదేశ్‌కు 73.42, తెలంగాణకు 60.33 టిఎంసిలు వినియోగించుకునే అవకాశముందని బోర్డు సభ్యులు నిర్ణయించారు. అయితే ప్రస్తుత నీటి అవసరాల దృష్ట్యా ఏపీకి 60, తెలంగాణకు 50 టిఎంసిలు కేటాయించాలని బోర్డు వర్కింగ్ గ్రూప్ నిర్ణయించింది. కాగా ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు, వినియోగం తదితర అంశాల్ని తేల్చాలని ఇరు రాష్ట్రాల అధికారులు కోరారు. దీంతో వాటిపై వచ్చే సమావేశంలో చర్చిద్దామని బోర్డు సభ్యులు సూచించారు.

కృష్ణా బేసిన్‌లో లభ్యమయ్యే నీటిలో ఇప్పటి వరకూ ఏపీ 252.79 టిఎంసిలు, తెలంగాణ 101.72 టిఎంసిలు వినియోగించుకున్నట్టు బోర్డు అధికారులు వెల్లడించారు. కృష్ణా నదిలో ప్రవాహాలు ఆగస్టు నెల వరకూ రావడం లేదని, వరుసగా 2016-17, 2017-18 సంవత్సరాల్లో ఇదే జరిగిందని వారు వివరించారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రెండు రాష్ట్రాలూ జాగ్రత్తగా తాగు, సాగునీటి ప్రణాళికలు రూపొందించుకోవాలని బోర్డు కార్యదర్శి పరమేశం సూచించారు. టెలిమెట్రీ, చిన్న నీటివనరుల వినియోగం సహా ఇతర అంశాలపై ఏర్పాటు చేసిన కమిటీలిచ్చే నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు.

సిపిఎస్‌పై ప్రభుత్వం స్పందించాలి

- యుటియఫ్ డిమాండ్
- ఫిబ్రవరి 10న ఆందోళనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం(సిపిఎస్)పై రాష్ట్రప్రభుత్వం స్పందించాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జీ, పి.బాబురెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ అమలు చేయాలని మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని తాలూకా కేంద్రా ల్లో 30వేలమందికి పైగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ధర్నాల్లో పాల్గొన్నారని వివరించారు. రాష్ట్రంలో 1.86లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యా యులు సిపిఎస్ వల్ల భవిష్యత్ కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎస్ పట్ల ఉద్యోగుల్లో ఉన్న ఆందోళన, నిన్నటి ధర్నాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసనలు తెలపడం ద్వారా వ్యక్తమయ్యింద న్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు తోసేసి సమస్యను దాటవేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరణ చేస్తూ అసెంబ్లీలో తీర్మానించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం పిఎఫ్ఆర్‌డిఏతో ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని కోరారు. అందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే పెన్షన్‌సాధన సమితి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తామని ప్రకటించారు.

సిఎం నివాసం సమీపంలో కలెక్టర్ల సదస్సు

13న మంత్రి మండలి భేటీ?

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈనెల 18, 19 తేదీల్లో నిర్వహించే కలెక్టర్ల సదస్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం సమీపంలోని గ్రీవెన్స్ హాల్ వేదిక కానుంది. ఈమేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మన్మోహన్ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత సచివాలయం ఐదో బ్లాకులోని సమావేశ మందిరంలో నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ పలు కారణాల వల్ల వేదికను సిఎం నివాస సమీపానికి మార్చారు. అలాగే ఈ నెల 13న మంత్రి మండలి సమావేశం ఉంటుందని తెలిసింది. తొలుత 17న క్యాబినెట్ భేటీ అని నిర్ణయించినప్పటికీ ఆ రోజు సిఎం చంద్రబాబు ప్రధాని మోడీని కలిసేందుకు ఢిల్లీ వెళ్లనున్నారని సమాచారం. అందువల్లే మంత్రి మండలి సమావేశ తేదీని మార్చినట్లు తెలిసింది. అయితే క్యాబినెట్ భేటీ తేదీపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ఆహార దిగుబడుల్లో అగ్రగామిగా నిలవాలి

- ప్రజా సేవా కేంద్రాలుగా కార్యాలయాలు
- సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆహార దిగుబడుల నాణ్యతలో రాష్ట్రం అగ్రగామి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆహార దిగుబడులు, మత్స్య, ఉద్యాన ఉత్పత్తుల నాణ్యతలో ముందుండాలన్నారు. జలవనరుల వృద్ధితో కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం రూపురేఖలు మారిపోతాయన్నారు. జన్మభూమిపై బుధవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు ప్రజా సేవా కేంద్రాలుగా మారాలన్నారు. ఐఎస్ఓ 9001 గుర్తింపు పొందిన కృష్ణా జిల్లా కలక్టరేట్ అధికారుల్ని అభినందించారు. గత మూడున్నరేళ్లలో అభివృద్ధి, అసమానతల తగ్గింపుపై దృష్టి పెట్టామన్నారు. ఇందు కోసం స్వల్పకాలిక, మధ్యకాలిక ప్రమాణాలు అమలు చేశామన్నారు. జన్మభూమి నిర్వహణ విషయంలో గ్రామాలు, వార్డులకే గ్రేడింగ్ ఇవ్వాలన్నారు. బెస్ట్ విలేజ్, వార్డు, మండలం, మున్సిపాలిటీ, నగరపాలక సంస్థలకు అవార్డులిచ్చి ప్రోత్సహించాలని సూచించారు. దాదాపు 50 లక్షల మంది గ్రామసభల్లో పాల్గొనడం జన్మభూమి కార్యక్రమం పట్ల ప్రజల్లో స్పందనకు నిదర్శనమన్నారు. పింఛన్ల పంపిణీపై 68 శాతం, రేషన్ కార్డులపై 67 శాతం, చంద్రన్న బీమాపై 71 శాతం ప్రజల్లో సంతృప్తి ఉందని, దీన్ని 80 శాతానికి పెంచాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో ప్రణాళికా మండలి ఉపాధ్యక్షులు సి.కుటుంబరావు, వికలాంగుల సంస్థ ఛైర్మన్ గొనుగుంట్ల కోటేశ్వరరావు, రియల్‌టైం గవర్నెన్స్, గ్రామీణాభివృద్ధి, ప్రణాళికా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైతులకు 30 వేల పంపుసెట్లు

నెడ్‌క్యాప్ క్యాలెండర్ ఆవిష్కరణలో అజయ్‌జైన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ ఏడాది 30 వేల పంపుసెట్లను రైతులకు పంపిణీ చేస్తామని ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ అన్నారు. రాష్ట్రంలో సోలార్ వినియోగం పెరిగిందని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ నూతన, పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (నెడ్ క్యాప్) క్యాలెండర్‌ను ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సోలార్ పంపుసెట్లను నెడ్ క్యాప్ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్నారన్నారు. ఈ రంగంలో నెడ్ క్యాప్ కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నెడ్ క్యాప్ ఎండి ఎం.కమలాకర్‌బాబు, జి.ఎం యర్రం రెడ్డి, టి.ఎస్.సి బోసు తదితరులు పాల్గొన్నారు.

ఆ రిట్ పిటిషన్‌ను 'పిల్'గా చేయండి

రిజిస్ట్రీకి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్

మూడు జిల్లాల్లో విద్యార్థుల సంఖ్యపై ఆరోపణల రిట్ పిటిషన్‌ను ప్రజాప్రయోజన వ్యాజ్యంగా చేయాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. పశ్చిమగోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని పలు డిఎడ్ కాలేజీల్లో 163 మంది విద్యార్థులుంటే వెయ్యి మంది ఉన్నట్లుగా కాలేజీ యాజమాన్యాలు రికార్డుల్లో చూపించాయని ఎన్. మాధవరావు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఆయా జిల్లాల్లోని మహాత్మాగాంధీ, సలామ్ అమరావతి, ఎస్ఆర్, జీఎస్ఆర్, ఎస్ఆర్‌డీ, షారోన్ తదితర కాలేజీల్లోని విద్యార్థులు లేకపోయినా ఉన్నట్లుగా రికార్డుల్లో చూపించారని పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు. కాలేజీలు ప్రభుత్వం నుంచి ఆమోదం పొందే ప్రయత్నాలు చేస్తున్నాయని, ఈ చర్యల్ని అడ్డుకోవాలని పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారు. రిట్‌ను హైకోర్టు న్యాయమూర్తి ఎస్వీ భట్ విచారించారు.

లౌకిక, వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలి

- మోడీ మతోన్మాద, ఫాసిస్టు చర్యలకు వ్యతిరేకంగా పోరు
- సిపిఐ జాతీయ ప్రధానకార్యదర్శి సురవరం పిలుపు
- ముగిసిన జాతీయ సమావేశాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అవినీతి, అరాచక, మతోన్మాద, ఫాసిస్టు పాలన కొనసాగిస్తున్న నరేంద్రమోడీని గద్దె దించేందుకు లౌకిక, వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకం కావాలని సిపిఐ జాతీయ ప్రధానకార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి పిలుపునిచ్చారు. విజయవాడలో మూడు రోజులుపాటు జరిగిన సిపిఐ జాతీయ కౌన్సిల్ సమావేశాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజయవాడలోని జింఖానా గ్రౌండ్స్‌లో బహిరంగసభ జరిగింది. ఈ సందర్భంగా సురవరం మాట్లాడుతూ మూడేళ్ల ఎన్డీఏ పాలనను సమీక్షిస్తే అవినీతి, అరాచకం, అబద్ధాల పాలన సాగుతున్నట్లు తేలిందన్నారు. అవినీతి నిర్మూలనే నా ధ్యేయమంటూ మోడీ కోతలు కోస్తున్నారని, చిత్తశుద్ధి ఉంటే 'లోక్‌పాల్' ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. మతోన్మాదశక్తులు పెట్రేగిపోతున్నాయని, గోసంరక్షణ దళాలు దాదాపు 30 మందిని పొట్టన పెట్టుకున్నాయన్నారు. ప్రధాని వీటిపై మౌనం పాటిస్తూ 'మహా మౌని మోడీ'గా అవతారమెత్తుతున్నారని ఎద్దేవా చేశారు. మనువాదుల కేంద్రంగా ఉన్న సంఘ పరివార్ కాలం చెల్లిన వర్ణ వ్యవస్థను మళ్ళీ పునరుద్ధరించే ప్రయత్నం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కుల్ని కాలరాస్తున్నారని, రైతాంగ సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో అడ్రస్ కూడా లేని ఆర్ఎస్ఎస్ శక్తులు దేశభక్తి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. దేశం కోసం నిత్యం శ్రమించే దళితులపై దాడులకు పాల్పడుతున్నవారు, మతం పేరుతో దేశాన్ని చీల్చాలనుకునే వారే దేశ ద్రోహులన్నారు. ప్రజా వ్యతిరేక, అభివృద్ధి నిరోధక మోడీ ప్రభుత్వాన్ని తక్షణమే తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పని ఒక్క కమ్యూనిస్టులే చేయలేరని, లౌకిక, వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులంతా ఏకం కావాల్సిన అవసరముందని పునరుద్ఘాటించారు. అంతా కలసి 'మహా సంఘటన'గా ఏర్పడాల్సిన ఆవశ్యకత ఆసన్నమైందన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శి రాజా మాట్లాడుతూ కమ్యూనిస్టుల దేశభక్తిని ప్రశ్నించే అర్హత బిజెపి, ఆర్ఎస్ఎస్‌కు లేదన్నారు.

ప్రత్యేకం

పైసా వసూల్..!

- పండగలకు ప్రత్యేక బాదుడు
- ఆర్టీసిలో అదనపు ఛార్జీలు
- బెంబేలెత్తుతున్న సామాన్యులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పులివెందులకు చెందిన ఆనందరావు సచివాలయంలో ఓ చిన్న స్థాయి ఉద్యోగి. సంక్రాంతి పండుగకు వరుసగా సెలవులు రావడంతో సొంత ఊరికి వెళ్లాలని బయలు దేరాడు. ప్రయాణించేందుకు బస్టాండ్‌కు వచ్చిన అతనికి బస్సులన్నీ కిటకిట లాడుతూ కనిపించాయి. అలా ముందు కు వెళ్లగానే స్పెషల్ సర్వీస్ బోర్డు కనిపించింది. తన ప్రయాణానికి మార్గం దొరికిందనుకున్నాడు. బస్సు ఎక్కిన తరువాత తెలిసింది. తన ఊరికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన స్పెషల్ సర్వీసులో బస్సు ఛార్జీ కూడా స్పెషలేనని. ఆయనకే కాదు పిల్లలు మొదలుకొని ముసలివాళ్ల వరకూ పండగకు ఊళ్లకు వెళ్లాలనుకున్న ఎంతో మంది ప్రయాణికులకు ఇలాంటి అనుభవమే ఎదురవుతోంది...సామాన్యుల సంగతేమోగాని ఆర్టీసి మాత్రం పండగ చేసుకుంటోంది.



పండగొచ్చిదంటే చాలు విద్యార్థులు మొదలు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వలస కూలీలు అందరూ సొంత ఊళ్లకు వెళ్లేందుకు సిద్ధమవుతారు. రాజ ధాని ప్రాంతం నుంచి సొంత ఊళ్లకు వెళ్లే వారి సంఖ్య ప్రత్యే కంగా చెప్పనక్కర్లేదు. ప్రయాణికుల కోసం ఎపిఎస్ ఆర్టీసి పలు ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసుల్ని ఏర్పాటు చేసింది. ప్రత్యేక బస్సుల్లో అధికంగా ఛార్జీలు వసూలు చేయబోమని గతంలో ప్రకటించిన ఆర్టీసి యాజమాన్యం అందుకు విరుద్ధంగా ఛార్జీలు నిర్ణయించి ప్రయాణికులపై అధిక భారాన్ని మోపుతోంది. విజయవాడ నుంచి పులివెందులకు నడిసే సూపర్ లగ్జరీ బస్సుల్లో సాధారణ ఛార్జీ రూ.572 ఉండగా ప్రత్యేక బస్సుల్లో రూ.920 వసూలు చేస్తోంది. సాధారణ సర్వీసుల్లో రూ.450 ఉన్న విజయవాడ- కర్నూలు మార్గంలో రూ.800, రూ.480 ఉన్న విజయవాడ- విశాఖపట్నం బస్సుల్లో రూ.850, రూ.610 ఉన్న విజయవాడ-అనంతపురం బస్సుల్లో రూ.920, రూ.440 ఉన్న విజయవాడ-నంద్యాల బస్సుల్లో రూ.620 వసూలు చేస్తోంది. సాధారణ సమయాల్లో నడిచే బస్సుల్లో సీట్లు ఖాళీ లేకపోవడంతో ప్రయాణి కులు చేసేదేమీ లేక అధిక ఛార్జీని చెల్లించి స్పెషల్ సర్వీసుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. పండగలొస్తే ప్రత్యేక సర్వీసుల పేరుతో అధికంగా బస్సు ఛార్జీలు వసూలు చేయడం ఆర్టీసీకి అలవాటైపోయిందని ప్రయాణికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెట్టింపు ఛార్జీలతో సామాన్య ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు.

ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్లు

వరుస సెలవులు కావడంతో విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌తో పాటు విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు, అనంతపురం వంటి ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. సాధారణ రోజుల కన్నా రెట్టింపు సంఖ్యలో ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణించినట్లు ఆర్టీసి అధికారులు చెబుతున్నారు. ప్రయాణికులకు ఎటువంటి సమస్యలూ తలెత్తకుండా ప్రత్యేక బస్సుల్ని ఏర్పాటు చేశామని చెబుతున్నా వాటిపై ప్రయాణికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

సంక్షిప్తం

ఇస్రో ఛైర్మన్‌గా డాక్టర్ శివన్

ప్రజాశక్తి - సూళ్లూరుపేట (నెల్లూరు)

ఇస్రో ఛైర్మన్‌గా డాక్టర్ శివన్‌ను నియమిస్తూ కేంద్రం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన తిరువనంతపురంలో విఎస్ఎస్‌సి డైరెక్టరుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం డాక్టర్ శివన్ సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని వెళ్లారు. ప్రస్తుత ఛైర్మన్ కిరణ్‌కుమార్ ఈనెల 14న ఉద్యోగ విరమణ చేయనున్నారు. 18వ తేదీన శివన్ బాధ్యతలు స్వీకరిస్తారని తెలిసింది.

తమిళనాడు ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ఇయు, ఎస్‌డబ్ల్యూఎఫ్ మద్దతు

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

తమిళనాడులో ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్లు ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్(ఇయు), అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైవి రావు, కె పద్మాకర్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్)అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌కె జిలానీ బాషా, సిహెచ్ సుందరయ్య బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈమేరకు నేడు, రేపు అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, ధర్నాలు చేపట్టాలని కార్మికులకు వారు పిలుపునిచ్చారు. మోటార్ వాహనాల చట్ట సవరణబిల్లులో ఆర్టీసీకి వ్యతిరేకంగా ఉన్న అంశాల్ని తొలగించాలంటూ రెండు సంఘాలూ ఉమ్మడిగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఎత్తిపోతలకు రూ.100 కోట్ల నాబార్డు రుణం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తొమ్మిది జిల్లాల్లో 20 ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి రూ.100.84 కోట్ల రుణాన్ని ప్రభుత్వానికి జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్(నాబార్డు) మంజూరు చేసినట్లు సంస్థ సిజిఎం కె.సురేష్‌కుమార్ తెలిపారు. ఈ ప్రాజెక్టుల నుంచి 24,912.50 ఎకరాలకు నీటి వసతి కలుగుతుందన్నారు. గుంటూరు, కృష్ణాల్లో ఒక్కో జిల్లాకు ఐదేసి ప్రాజెక్టులకు, శ్రీకాకుళంలో మూడు, కర్నూలులో రెండు, అనంతపురం, కడప, ప్రకాశం, విశాఖపట్నం, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఒక్కో ఎత్తిపోతల పథకం నిర్మాణానికి మొత్తంగా రూ.120.62 కోట్ల వ్యయం అవుతుండగా నావార్డు 100.84 కోట్ల రుణం మంజూరు చేసింది. ఆర్ఐడిఎఫ్ 23వ ట్రంచ్ కింద రాష్ట్రంలో నాబార్డు రాష్ట్ర ప్రభుత్వానికి మంజూరు చేసిన రుణం రూ.720 కోట్లు దాటిందని తెలిపారు.

నేడు 'అనంత'లో ముఖ్యమంత్రి పర్యటన

ప్రజాశక్తి- అనంతపురం సిటీ

ఈ నెల 11వ తేదీన అనంతపురం జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటించనున్నారు. గురువారం ఉదయం 10.45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో బుక్కపట్నం చెరువు వద్దకు చేరుకుంటారు. అక్కడ పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. తదనంతరం కొత్తచెరువు గ్రామస్తులతో ముచ్చటిస్తారు. 12.20 గంటలకు తిరిగి పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ పది నిమిషాలు కియో కార్ల పరిశ్రమ పనుల పురోగతిపై సమీక్షిస్తారు.



చిత్తూరు జిల్లా కుప్పంలో బుధవారం రెండో రోజు 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమంలో అర్జీలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

కుప్పంలో అర్జీలు స్వీకరించిన సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - కుప్పం (చిత్తూరు)

చిత్తూరు జిల్లాలో 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు మంగళవారం రాత్రి కుప్పం ఆర్ అండ్ బి అతిథిగృహంలో బస చేశారు. బుధవారం రెండోరోజు పర్యటనలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం సంబంధిత అధికారులకు ఇచ్చి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కుప్పం పిఇఎస్ మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ నుండి రాజమండ్రి పర్యటనకు బయల్దేరి వెళ్లారు. పరిశ్రమల శాఖా మంత్రి అమరనాథ్‌రెడ్డి, కలెక్టర్ ప్రద్యుమ్న, ఎంపి శివప్రసాద్, ఎంఎల్‌సి గౌనివారి శ్రీనివాసులు, డిఐజి ప్రభాకర్‌రావు, ఎస్‌పి రాజశేఖర్‌బాబు తదితరులు ఘనంగా వీడ్కోలు పలికారు.

ప్రధాన వినతులు ఇవే.. రామకుప్పం మండలం గోవిందపల్లి గ్రామానికి చెందిన కామాక్షి భర్త గోపికి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక కిడ్నీ క్షీణించడంతో బెంగుళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ డాక్టర్ల సలహా మేరకు కిడ్నీని తొలగించారు. ఇంటికి పెద్దదిక్కు అయిన తన భర్త పరిస్థితి క్షీణించిందని, కుటుంబ పోషణ భారమయ్యిందని, తాము దళిత కుటుంబాలకు చెందిన వారమని, ఇద్దరు పిల్లలున్నారని చంద్రబాబుకు మొర పెట్టుకుంది. సిఎం సహాయనిధి నుంచి ఆదుకోవాలని కోరారు. వికలాంగులకు పక్కా గృహాలు, యాభై శాతం వైకల్యం ఉన్న వారికి రూ.1500 పింఛన్ ఇవ్వాలని, అంత్యోదయ, రేషన్‌కార్డు మంజూరుచేయాలని వికలాంగుల అధ్యక్షులు బాబూరావు కోరారు.

విశాఖలో జల విహారం

- రూ.9 కోట్లతో ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్..!
- ఫిబ్రవరిలో పర్యాటకులకు అందుబాటులోకి..

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

ఉభయచర వాహనంగా, ఎక్కడైనా సరే సునాయాసంగా ప్రయాణించే సామర్థ్యమున్న హోవర్ క్రాఫ్ట్‌లు ఇప్పటివరకూ మన దేశంలో తీర రక్షణ దళంలో మాత్రమే ఉన్నాయి. ఇంగ్లండ్, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, రష్యా తదితర దేశాల్లో పర్యాటకులకు ఈ వాహనాలు అందుబాటులో ఉన్నప్పటికీ భారతదేశంలో ఎక్కువగా లేవు. అలాంటి వాహనాలు దేశంలోనే తొలిసారిగా విశాఖ సాగర తీరంలో సందడి చేయనున్నాయి. విశాఖకు చెందిన అక్షయ ఎంటర్ ప్రైజస్ సంస్థ 'హోవర్ డాక్ ఎల్‌ఎల్‌పి' (లిమిటెడ్ లయబులిటీ పార్టనర్‌షిప్) పేరుతో ఈ ప్రాజెక్టును నడపనుంది. ఇప్పటికే అన్ని అనుమతులు పొందిన ఈ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి ఫిబ్రవరిలో ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేస్తోంది.

విశాఖ సాగర తీరంలో పోర్టువైపు వెళ్లే మార్గంలో నోవాటెల్ హోటల్ దాటాక పార్కింగ్ ప్రాంతమున్న చోట దీన్ని ఏర్పాటు చేయనున్నట్లు అధికారుల ఆలోచనా. ఇందుకోసం రెవెన్యూ శాఖ 3,775 గజాల స్థలాన్ని అప్పగించాల్సి ఉంది. ఈ స్థలానికి ఏడాదికి రూ.15 లక్షలతో పాటు ఏటా ఐదు శాతం పెంచేలా లీజును, పర్యాటక పాలసీకి అనుగుణంగా చెల్లించేందుకు సంస్థ ముందుకొచ్చింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన నౌకాదళ, కోస్ట్‌గార్డు, పోర్టు ట్రస్ట్ సిఆర్‌జెడ్ అనుమతులు కొలిక్కివచ్చాయి. దీనికి సంబంధించి ఇప్పటికే కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ, కాలుష్య నియంత్రణ మండలి సభ్యులతో సమావేశమై అనుమతుల కోసం రాష్ట్ర సిఆర్‌జెడ్‌కు నివేదిక పంపారు. గుత్తేదారు సంస్థ సిఎం కార్యాలయంలో ఈ ప్రాజెక్టు తీరు తెన్నులను ప్రదర్శించి రాష్ట్ర ప్రభుత్వ సహకారం కోరింది. ఇతర రాష్ట్రాల్లోని అనుబంధ రంగాల అధికారులను ప్రారంభోత్సవ, ట్రయల్ రన్ కార్యక్రమానికి అనుమతించేలా ఏర్పాట్లు చేయాలని సంస్థ ఎమ్‌డి ఆర్ఎం చైతన్యవర్మ ప్రభుత్వాన్ని కోరారు.



హోవర్ క్రాఫ్ట్ ఇదే..

వారందరి అభిప్రాయాలు క్రోడీకరించి ప్రాజెక్టు విస్తరణపై అంచనాకు రానున్నారు.

ఎక్కడైనా నడిచేలా ఏర్పాట్లు

హోవర్ క్రాఫ్ట్ వాహనాలు కింది భాగం గాలి బుడగ మాదిరిగా ఉంటాయి. ఎలాంటి ప్రాంతంలోనైనా సునాయాసంగా వెళ్లగలుగుతాయి. విపత్తుల సమయం లోనూ వీటిని వినియోగించుకునే వెసులుబాటు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ముంపు ప్రాంతాల్లోకి సైతం ఈ వాహనాలతో సులభంగా వెళ్లొచ్చు. విశాఖ సాగరతీరం ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు అభివద్ధి చెందుతున్నందున కోస్టల్ పెట్రోలింగుకూ వీటిని వాడుకునే వెసులుబాటు ఉంటుంది. సముద్ర భౌగోళిక స్థితికి సంబంధించి ఒక అంచనాకు వచ్చేందుకు బ్యాటీ మెట్రో డేటా, సైట్ స్కాన్ సోనార్ సర్వేలు ఇప్పటికే పూర్తయ్యాయి. ఎక్కడెక్కడ రాళ్లున్నాయి.? కెరటాల తీవ్రత ఏ సమయంలో ఎంత ఉంటుంది? అలల శైలి ఎలా ఉంటుంది.? తదితర అంశాలపై ఇప్పటికే అవగాహనకు వచ్చిన సంస్థ పర్యాటకులను అలరించే రీతిలో ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్నారు. ఈ వాహనం గంటకు 60 నుంచి 70 కిలో మీటర్ల వేగంతో ప్రయాణించే అవకాశముంది. ప్రమాదాలకు ఆస్కారం లేకపోవడం, తక్కువ నీటిమట్టం ఉన్న ప్రాంతాల్లో కూడా ప్రయాణించే అవకాశం ఉండటంతో ఈ హోవర్ క్రాఫ్ట్‌ను విశాఖలో ప్రవేశపెట్టేందుకు కసరత్తు చేస్తున్నారు.

ప్రతి ఏటా పెరుగుతున్న పర్యాటకులు

ఈ ప్రాజెక్టు వ్యయం రూ. 9 కోట్లుగా అంచనా వేస్తున్నారు. కంట్రోల్ రూమ్, టికెట్ కౌంటర్, ఫుడ్ కోర్టుల కోసం తాత్కాలిక నిర్మాణాలు చేపట్టనున్నారు. రాష్ట్ర పర్యాటకశాఖ సహకారంతో ఈ ప్రాజెక్టును సమర్థంగా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. విశాఖ అందాలను చూసేందుకు దేశ, విదేశీ పర్యాటకులు ఏటా పోటెత్తుతున్నందున ఈ ప్రాజెక్టుకు ఆదరణ లభిస్తుందని అంచనా వేస్తున్నారు. ఇందుకు అవసరమైన ఆరు సీట్ల వాహనాలు మూడు, తొమ్మిది సీట్ల వాహనం ఒకటి గత నెల 9న నౌకలో రష్యా నుంచి బయలుదేరాయి. ఇవి జనవరి 15 నాటికి విశాఖ చేరుకుంటాయి. ఆరు సీట్ల హోవర్ క్రాఫ్ట్ వాహనం కొనుగోలుకు రూ. 1.2 కోట్ల చొప్పున, తొమ్మిది సీట్ల వాహనానికి రూ. 2 కోట్ల చొప్పున వెచ్చిస్తున్నారు. దీనికి అదనంగా అంతర్జాతీయ వస్తు సేవా పన్ను(ఐజిఎస్‌టి) 64.7 శాతం పడుతోంది.

మైనింగ్ క్వారీలపై నిఘా..!

- గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో కొనసాగుతున్న సర్వే
- నివేదికల ఆధారంగా త్వరలో నోటీసులు
- భూగర్భ వనరుల శాఖ ఉప సంచాలకులు పాపారావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని మైనింగ్ క్వారీల తీరు తెన్నులపై సర్వే చేసి నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో ఇటీవల పలు క్వారీల్లో కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు వాటిల్లిన నేపథ్యంలో ప్రభుత్వం వీటిపై నివేదిక కోరింది. ఈ మేరకు నాలుగు జిల్లాల నుంచి 12 మంది అధికార బృందాలను రప్పించారు. ఒక్కో బృందానికి ఒక అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో సర్వే చేపట్టారు. విశాఖపట్నం, ఉభయ గోదావరి, కృష్ణాజిల్లాల నుంచి అధికారులు సర్వేలో పాల్గొంటున్నారు. ఒక్కో బృందంలో నలుగురు అధికారులు ఉంటారు. అక్రమ మైనింగ్ నియంత్రణతోపాటు అధునాతన, సాంకేతిక పరిజ్ఞానంతో మైనింగ్‌కు అనుసంధానం చేసి ఆదాయం పెంపు లక్ష్యంగా ఈ సర్వే కొనసాగుతున్నట్లు తెలిసింది. త్వరలో జియో ట్యాగింగ్, డ్రోన్ల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 400 రోడ్డు మెటల్ క్వారీలు, మరో 300 గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. వీటిలో కొన్నింటి నుంచి మైనింగ్ చేస్తుండగా మరికొన్ని నిరుపయోగంగా ఉన్నాయి. పలు క్వారీల్లో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయి. తవ్వకాలు సందర్భంగా కనీస భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా? లైసెన్సు తీసుకున్న మేరకు కాకుండా అంతకు మించి తవ్వుతున్నారా? ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీనరేజ్ సెస్ చెల్లిస్తున్నారా? లేదా? గతంలో వచ్చిన ఆదాయం కంటే పెరిగే అవకాశం ఉన్నా అక్రమార్కులు స్వాహా చేస్తున్నారా? వాస్తవంగా అందుబాటులో ఉన్న నిక్షేపాలు ఎన్ని? ఎంత మేరకు తవ్వుతున్నారు? తదితర వివరాలనూ సర్వేలో తెలుసుకుంటున్నారు. మొత్తం 700 మంది లీజు దారుల్లో కనీస నిబంధనలు పాటించని వారినీ ఈ సర్వే ద్వారా గుర్తించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గుంటూరు, ప్రకాశం జిల్లాలో సర్వే కొనసాగుతుందని, త్వరలో నివేదిక అందుతుందని గనులు, భూగర్భ వనరుల శాఖ ఉపసంచాలకులు జి.పాపారావు తెలిపారు. ప్రభుత్వానికి ఆదాయం రావడంతోపాటు ప్రజల భద్రతా ముఖ్యమని, నివేదికలు అందిన తర్వాత భద్రతా ప్రమాణాలు, నిబంధనలు పాటించని వారికి త్వరలో నోటీసులు జారీ చేస్తామని ఆయన వెల్లడించారు.

ఆహారంలో జాగ్రత్తలు అవసరం

'తినండి-తగ్గండి-ఆరోగ్యంగా ఉండండి' పుస్తకావిష్కరణలో ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్



'తినండి-తగ్గండి-ఆరోగ్యంగా ఉండండి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, తదితరులు

మనం ప్రతి రోజూ తినే ఆహారంలో జాగ్రత్తలు తీసుకుని, ప్రతి రోజూ వ్యాయామం చేస్తే ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని కేంద్రీయ హిందీ సమితి సభ్యులు పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ గుమ్మా లీలా సుష్మ రచించిన 'తినండి - తగ్గండి - ఆరోగ్యంగా ఉండండి' పుస్తకాన్ని విజయవాడలోని స్వరాజ్యమైదాన్‌లో జరుగుతున్న పుస్తక మహోత్సవ్‌లో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, ఆహార నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని తెలిపారు. ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి గోళ్ల నారాయణ మాట్లాడుతూ.. బ్యూటీషియన్లను గుర్తించినంతగా నేడు డైటీషియన్లను గురించలేకపోతున్నామన్నారు. అందుకే అనేక విధాలుగా అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ డైటీషియన్ల పర్యవేక్షణలో ఆహారం తీసుకోవాలన్నారు. జనరల్ ఫిజీషియన్ అండ్ సర్జన్ డాక్టర్ టివి నారాయణరావు మాట్లాడుతూ.. డాక్టర్ గుమ్మా లీలా సుష్మ రంచించిన పుస్తకం ప్రతి ఒక్కరూ చదవడంతోపాటు ప్రతి ఇంటిలోనూ ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జివి పూర్ణచంద్, విశ్రాంతాచార్యులు ఆచార్య యస్ గంగప్ప, ఆంధ్రా లయోలా కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గుమ్మా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

'అనంత'ను దత్తత తీసుకుంటా

మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి- పెనుకొండ



పెనుకొండ జన్మభూమి సమావేశంలో మాట్లాడుతున్న లోకేష్

అనంతపురం జిల్లాను దత్తత తీసుకుని రాష్ట్రంలో జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని రాష్ట్ర ఐటి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ హామీఇచ్చారు. బుధవారం అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా పెనుకొండకు విచ్చేసిన ఆయన పట్టణంలో జరిగిన 5వ విడత జన్మభూమి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచి అశ్వర్థనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ.. 2022 నాటికి దేశంలోనే అగ్రగామి ఆంధ్రప్రదేశ్‌ను ఉంచుతామన్నారు. కియా సంస్థ పెనుకొండ ప్రాంతానికి వచ్చిందని, దీంతో ఈ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య వెంటాడుతోందని, ఈ సమస్యల పరిష్కారానికి రూ.260కోట్లు కేటాయించామన్నారు. స్పెషల్ ప్యాకేజీ కింద రూ.70కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో రోడ్లకు రూ.11.5 కోట్లు, 30 నుంచి 40 అంగన్‌వాడీ భవనాలు పూర్తి చేయనున్నట్లు చెప్పారు.

ఇళ్లస్థలాలు కోసం మహిళల వినతి

30 సంవత్సరాలుగా అద్దెఇళ్లలో ఉంటున్నామని ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా భవనాలు నిర్మించాలని మహిళలు నారా లోకేష్‌ను కోరారు. సభ ప్రారంభానికి ముందే ఈ సంఘటన చోటుచేసుకోవడంతో మంత్రి కలుగజేసుకొని చివరలో అర్జీలు తీసుకుంటామని త్వరలోనే 800 పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, పరిటాల సునీత, ఎంపీ నిమ్మల కిష్టప్ప, ఎమ్మెల్యే బికె పార్థసారథి, ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, జడ్పీఛైర్మన్ పూల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి బోధనలు అనుసరణీయం

జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే ఫిలిప్ సి టోచర్

ప్రజాశక్తి-సత్యనారాయణపురం (విజయవాడ)

వివేకానందుడి బోధనలు ఆచరణ, అనుసరణీయమని గుంటూరు శాసనసభ్యులు ఫిలిప్ సి టోచర్, శాసనమండలి సభ్యులు డాక్టర్ అమ్మినేని శ్రీరామకృష్ణ పేర్కొన్నారు. ఏపి క్రియేటివ్ అండ్ కల్చరల్ అసోసియేషన్, ఫిలాంత్రోఫిక్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ కన్వెన్షన్ హాలులో తెలుగు రక్షణ వేదిక జాతీయ కార్యదర్శి, ప్రభుత్వ జాషువా అవార్డు గ్రహీత డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన స్వామి వివేకానంద జయంతి వేడుకలు బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో తెలంగాణ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్‌బి బేగ్, ఎపి సిఆర్‌డిఎ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్‌విఎస్‌ఎన్ కుమార్, గ్లోబల్ క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు (అమెరికా) సీతా మధభూషి, వ్యక్తిత్వ వికాస నిపుణులు బ్రదర్ షఫి, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మేదర సురేష్‌కుమార్, ఏపి రచయితల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఘంటా విజయ్‌కుమార్, అభ్యుదయ కవి యడవల్లి శ్రీనివాసరావు, తెలుగు రైతు విభాగం జిల్లా ఉపాధ్యక్షులు ఎ.జ్వాలాప్రసాద్ సందేశాలిచ్చారు. వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన 17 మంది ప్రముఖులకు వివేకానంద జాతీయ జీవన సాఫల్య, జాతీయ ప్రతిభా పురస్కారాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. తొలుత 202 వాకర్స్ క్లబ్ గవర్నర్ దారా కరుణశ్రీ జ్యోతి ప్రజ్వలన చేశారు.

28 మంది తమిళ కూలీలు అరెస్టు

రూ.10 లక్షల విలువైన 30 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి - వీరబల్లి/రాయచోటి

కడప జిల్లా రాయచోటి నియోజకవర్గంలోని వీరబల్లి, సుండుపల్లె, చిన్నమండెం మండలాల పరిధిలో 28 మంది తమిళ కూలీలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 30 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని పులివెందుల ఎఎస్‌పి క్రిష్ణారావు తెలిపారు. బుధవారం రాయచోటి రూరల్ పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చుట్టు పక్కల ప్రాంతాలైన వీరబల్లి, సుండుపల్లె, చిన్నమండెం ఎస్‌ఐలకు సమాచారం ఇవ్వడంతో కొత్త రోడ్డు వద్ద 10 దుంగలు, వండాడి వద్ద 10, క్రాస్ వద్ద 10 దుంగలు చొప్పున స్వాధీనం చేసుకొన్నట్లు పేర్కొన్నారు. తమిళ కూలీలను అదుపులోకి తీసుకుని వివరించామన్నారు. వారి వద్ద నుండి 13 గొడ్డళ్ళు, రాళ్ళను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. పట్టుబడిన కూలీలందరూ తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించామని చెప్పారు. పట్టుబడిన వారిపైన 392 కేసులు ఉన్నాయన్నారు. ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేయడంలో తమ సిబ్బంది ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు.

ప్రత్యేకం

డిసిఐ ప్రయివేటీకరణతో దళిత, గిరిజనులకు అన్యాయం

150 ఉద్యోగాలకు ఎసరు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ)పై కేంద్ర ప్రభుత్వం జరిపిన ప్రయివేటీకరణ దాడితో సామాజిక తరగతులు విలవిల్లాడిపోతున్నాయి. సామాజిక న్యాయానికి దూరమవుతామన్న ఆందోళన దళిత, గిరిజనుల్లో తీవ్ర ఆవేదనను మిగుల్చుతోంది. డిసిఐ అమ్మకానికి వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు చేపట్టిన ఆందోళనపై కేంద్రం నుంచి ఎలాంటి సానుకూల చర్యా కానరాలేదు. డిసిఐలో దళిత, గిరిజనానికి చెందిన పర్మినెంట్ ఉద్యోగాల కోటా 150 వరకూ ఉంది. ప్రస్తుతం 60 మంది పని చేస్తున్నారు. ఒబిసిలు 30 మంది, ప్రత్యేక ప్రతిభావంతులు 8 మంది వరకూ పని చేస్తున్నారు. డిసిఐ ప్రయివేటీకరణతో వీరంతా రోడ్డున పడనున్నారు. డిసిఐలో నూరు శాతం పెట్టుబడులు అమ్మేయాలని రెండు నెలల క్రితం కేంద్ర క్యాబినెట్ నిర్ణయించడంతో అందులో పనిచేస్తోన్న (ఆన్ షోర్, ఆఫ్ షోర్) 1188 మంది ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన చెలరేగుతోంది. ప్రభుత్వ రంగంగా ఉన్న డిసిఐలో సామాజిక న్యాయానికి ఆస్కారం ఉంటుందన్న మాట తెలిసిందే. ప్రయివేటీకరణ జరిగితే పెద్ద సంఖ్యలో కాంట్రాక్టర్ల వ్యవస్థ స్థాపించబడి పోస్టులన్నీ ప్రయివేటు వ్యక్తులకే కట్టబెడతారు. దీంతో సామాజిక న్యాయం దెబ్బతింటుంది.



విశాఖలోని డిసిఐ కార్యాలయం

ఇప్పటికీ లాభాల్లోనే డిసిఐ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసిఐ రూ.79 కోట్ల వరకూ లాభాల్లో ఉంది. ఎలాంటి నష్టాల్లేకుండా దేశంలోని పోర్టుల్లో ప్రగతి దిశగా పయనిస్తోంది. రూ.లక్షల కోట్ల విలువైన సంపదను డిసిఐ కలిగి ఉండడంతో దీనంతటిపైనా కార్పొరేట్ల కళ్లుపడ్డాయి. సామాజిక న్యాయానికి, రిజర్వేషన్లకు అద్దం పట్టే డిసిఐ సంస్థ ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తే అన్యాయం జరగుతుందని దళితులు, గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. నెలల తరబడి ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్రంలోని పాలకుల్లో ఎలాంటి చలనం రావడం లేదని, గట్టి ఉద్యమానికి తెర తీస్తామంటూ సామాజిక తరగతులకు చెందిన డిసిఐ ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటరావు చెబుతున్నారు.

సంక్షిప్తం

తిరుమలలో ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం

తిరుమల: ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడికి బుధవారం సాయంత్రం టిటిడి ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జేఈవో కెఎస్ శ్రీనివాసరాజు, సివిఎస్‌ఓ ఆకె రవిక్రిష్ణ స్వాగతం పలికారు. పద్మావతి అతిథిగృహంలో బస ఏర్పాట్లను చేశారు. రేణిగుంట ఎయిర్ పోర్టు నుండి తిరుమల శ్రీ పద్మావతి గెస్ట్ హౌస్‌కు ఆయనతో పాటు మంత్రి అమర్‌నాథ్ రెడ్డి విచ్చేశారు. ఉప రాష్ట్రపతి తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఉదయం 6.20 గంటలకు శ్రీవరాహ స్వామి వారిని దర్శనం చేసుకుని, అనంతరం శ్రీవారి దర్శనం చేసుకుంటారని ఈఓ వెల్లడించారు. ఉదయం 9 గంటలకు రేణిగుంట ఎయిర్ పోర్టుకు తిరుగు పయనమవుతారని తెలిపారు.

కత్తి మహేష్ దిష్టిబొమ్మ దహనం

శ్రీకాళహస్తి:సినీ హీరో, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై విమర్శనాస్త్రాలు సంధిస్తున్న సినీ విమర్శకులు కత్తి మహేష్ దిష్టిబొమ్మను అజ్ఞాతవాసి ప్రీమియర్ షో సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి పవన్ అభిమానులు దహనం చేశారు. కొంతకాలంగా కత్తిమహేష్‌కు పవన్ అభిమానులకు మధ్య సోషల్‌మీడియా వేదికగా మాటలయుద్ధం జరుగుతున్న విషయం విదితమే. ఈ తరుణంలో పవన్ కళ్యాణ్ నటించిన అజ్ఞాతవాసి ప్రీమియర్ షోకు వచ్చిన అభిమానులు పట్టణంలోని ఆర్ఆర్ థియేటర్ ఎదురుగా కత్తి మహేష్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

దివ్య దర్శనం బస్సుయాత్ర ప్రారంభం

విశాఖపట్నం :దివ్యదర్శనం బస్సుయాత్రను విశాఖలోని ఎంవిపి కాలనీలో బుధవారం మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. తీర్థయాత్రకు సుమారు 200 మంది యాత్రికులు బయలుదేరారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పలు క్షేత్రాలను దర్శించుకునే ప్రక్రియలో భాగంగా దివ్యదర్శనం యాత్రను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు.

సంపాదకీయం

త్రిపురలో కాషాయ కుట్రలు

దేశంలోనే అతి చిన్న రాష్ట్రాల్లో ఒకటైన త్రిపురలో అడుగుపెట్టడానికి కమలనాధులు పన్నుతున్న పన్నాగాలు విస్మయాన్ని కలిగిస్తున్నాయి. అధికార సాధనే లక్ష్యంగా అన్నిరకాల దిగజారుడు చర్యలకూ బిజెపి దిగుతోంది. కుల, మతోన్మాదాన్ని రెచ్చగొట్టడంతో పాటు, ఉగ్రవాదులతోనూ చేతులు కలుపుతోంది. ఇక వామపక్ష ప్రభుత్వంపై విసురుతున్న అసత్యాల రాళ్లకైతే అంతూపొంతూలేదు. బిజెపికి చెందిన ఛోటామోటా నాయకుల నుండి, అగ్రనేతల వరకూ కొంత కాలంగా ఇదే పనిలో ఉన్నారు. కేవలం 36 లక్షల జనాభాతో, దేశానికి ఒక మూలగా బంగ్లాదేశ్‌తో సరిహద్దును పంచుకునే ఈ ఈశాన్యరాష్ట్రం ఒకప్పుడు ఉగ్రవాదానికి చిరునామాగా ఉండేది. గిరిజనులకు, గిరజనేతరులకు మధ్య తీవ్ర స్థాయిలో పోరాటాలు జరిగేవి. దేశ భద్రతకు కూడా కీలకంగా ఉన్న ఈ చిన్న రాష్ట్రంలో చోటుచేసుకునే ఈ సంఘటనలు జాతీయ స్థాయిలోనూ కలవరాన్ని రేపాయి. వామపక్ష ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల్ని భాగస్వామ్యం చేయ డం ద్వారా ఉగ్రవాదాన్ని ఆ రాష్ట్రం నుండి దాదాపు పార ద్రోలింది. గిరిజనులకు, గిరిజనేతరులకు మధ్య వైరుధ్యాలను రూపుమాపి, వారిమధ్య స్నేహపూరిత వాతావారణాన్ని నెలకొల్పింది. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించింది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీల నుండి పదేపదే సహాయనిరాకరణ ఎదురైనప్పటికీ వామపక్ష ప్రభుత్వం పట్టుదలతో ఈ కృషిని కొనసాగించింది. మానవాభివృద్ధి సూచికలలో దేశంలోనే త్రిపుర మొదటి స్థానాల్లో నిలిచిందంటే ఈ కృషే కారణం.ఒకప్పుడు నిరక్షరకుక్షులు మాత్రమే కనిపించే ఆ రాష్ట్రంలో ఇప్పుడు అక్షరాలు రాని వారి కోసం దుర్భిణి వేసి వెతకాల్సిందే. ప్రజా రోగ్యం, ఉన్నత విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లోనూ వామపక్ష ప్రభుత్వం ఇదే విధమైన దీక్షతో పనిచేసింది. ఉపాధిహామీ చట్టాన్ని పట్టణ పేదలకు విస్తరించడమే ఆ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. ఈ కారణం చేతనే త్రిపుర ప్రజానీకం పదేపదే వామపక్ష ప్రభుత్వానికి పట్టం కడుతున్నారు.

త్రిపుర ప్రజానీకం స్పందిస్తున్న ఈ తీరే కాషాయమూకలకు కంటగింపుగా మారింది. నరేంద్రమోడీ నేతృత్వంలో బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకొచ్చాక నిధుల విడుదలలో కోత పెట్టారు. ప్రాజెక్టులకు అనుమతి నిలిపివేశారు. రాష్ట్ర ప్రభు త్వం పదేపదే చేస్తున్న అభ్యర్థనల్ని ఆయన చెవికెక్కించు కోవడం లేదు. మరోవైపు అమిత్‌షా నేతృత్వంలో కాషాయ మూకలు మతోన్మాదాన్ని రెచ్చగొట్టే చర్యలకు దిగాయి. పనిలో పనిగా అవాస్తవాల్ని ప్రచారం చేయడం ప్రారంభించాయి. ఉపాధిహామీ కూలీ మొత్తాన్ని కేంద్రం గణనీయంగా పెంచినా రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు ఇవ్వడం లేదన్నది వీటిలో ఒకటి. నిజానికి కేంద్రం ఉపాధి నిధుల్లో కోత విధించింది. ఆ వాస్తవాన్ని వామపక్ష నేతలు ఆధారాలతో సహా రాష్ట్ర ప్రజలకు వివరించడంతో వారి గొంతుల్లో వెలక్కాయ పడ్డటైంది. వివాద రహితుడిగా, నిరాడంబరుడిగా దేశంలోనే పేరుపొందిన త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్‌సర్కార్‌ను ఎన్నికల తరువాత బంగ్లాదేశ్‌కు పంపేస్తామంటూ నోరుపారేసుకోవడం రెచ్చగొట్టే వ్యూహంలో భాగమే! త్రిపుర ప్రజానీకమంతా ఈ వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేయడంతో బిజెపి పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా మారింది. ఈ తరహా వ్యాఖ్యలు శృతిమించుతుండడంతో అద్దాల కొంపలో కూర్చుని రాళ్లు వేయవద్దంటూ వామపక్ష నేతలు హెచ్చరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మన రాష్ట్రంలో రెండు జిల్లాల అంత పాటి విస్తీర్ణం కూడా లేని త్రిపురలో ఎన్నికల ప్రచారం కోసం బిజెపి వందల సంఖ్యలో వాహనాల్ని తరలించడం, భారీ మొత్తంలో డబ్బు సంచుల్ని సిద్ధం చేసిందంటూ వార్తలొస్తున్నాయి. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జర్నలిస్టు శంతాను భూమిక్ హత్య కేసులో ఇద్దరు నిందితుల్ని ఇటీవల కాషాయ పార్టీలో చేర్చుకున్నారు. ఆ ఇద్దరికీ నిషిద్ధ ఉగ్రవాద సంస్థ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ త్రిపురతో సంబంధాలున్నాయని పోలీసుల పరిశోధనలో తేలింది. మతోన్మాద-ఉగ్రవాద శక్తుల ఈ కలయిక తీవ్రస్థాయిలో ఆందోళన కరం. అధికారమే ధ్యేయంగా త్రిపురలో సాగుతున్న దేశ వ్యతిరేక కుట్రపై స్పందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. చైతన్య వంతమైన త్రిపుర ప్రజానీకం ఈ తరహా కుట్రను అర్థం చేసుకుని సరైన తీర్పే ఇస్తారని ఆశిద్దాం... ఇప్పటికే ఆ దిశగా సంకేతాలొస్తున్నాయి.

ఇదీ విషయం




కమలానికి కళ్ళుంటే
కన్నీళ్లే కారవా...
నోట్ల రద్దు చిమ్ముతున్న
విషం వైపు చూడవా!

వార్తలు నొక్కేసినా
వాస్తవాలు దాగవు...
నిజాన్ని తగలేసినా
నిప్పు కణికలారవు!

- కొల్లూరు వెంకట్

రైతు అభ్యున్నతి విస్మరించిన 'జన్మభూమి'

విశ్లేషణ



వి శంకరయ్య

ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయక రాష్ట్రం. రాష్ట్ర బడ్జెట్‌లో కూడా వ్యవసాయ రాబడే ఎక్కువగా చూపుతున్నారు. ఈ గారడి బహు చిత్రంగా వుంది. కొల్లేరు సరస్సు, కోనసీమ కొబ్బరి తోటలు తుదకు సముద్రపు ముప్పు నుండి కాపాడే మడ అడవులను కూడా నేల మట్టం చేసి చేపలు, రొయ్యలు పెంచుతున్నారు. దీంతో వస్తున్న ఆదాయాన్ని కలుపుకొని వ్యవసాయంలో రెండంకెల వృద్ధిరేటు చూపుతున్నారు. అత్యధిక సంఖ్యాకులైన రైతుల అభ్యున్నతికి ఈ ప్రభుత్వం ఏ మాత్రం ఉపక్రమించడం లేదు. ఇంత వివరణ ఎందుకు ఇవ్వాల్సి వస్తున్నదంటే 2014-15తో పోల్చి చూస్తే 2015-16లో 7.69 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం తగ్గింది. 2016-17లో 2.93 లక్షల ఎకరాల సాగు పడిపోయింది. మరో వైపు ఈ మూడేళ్ల కాలంలో నీరు-ప్రగతి పథకం కింద దాదాపు రూ.9,900 కోట్లు వ్యయం చేశారు. ఈ నిధులు తెలుగుదేశం కార్యకర్తలకు హారతి కర్పూరంలా సమర్పించారని, ఈ ప్రభుత్వాన్ని కొమ్ముగాచే మీడియానే పలు సందర్భాల్లో వివిధ కథనాలను వండి వార్చింది. ఈ నిధుల వ్యయం ద్వారా వ్యవసాయాభివృద్ధికి ఏ మాత్రం మేలు చేయలేదు. ప్రస్తుతం అమలు జరుగుతున్న జన్మభూమి కూడా ప్రచారార్భాటానికి తప్ప క్షేత్రస్థాయిలో వ్యవసాయ రంగానికి ఏ మాత్రం ఉపకరించడం లేదు. ఒక వైపు రాష్ట్రంలో సాగు విస్తీర్ణం భారీగా పడిపోతుండగా వ్యవసాయ రంగంలో రెండంకెల వృద్ధి రేటు ఎలా సాధ్యమో అనూహ్యం. ఈ అంకెల గారడీపై ఎవరైనా ప్రశ్నిస్తే అభివృద్ధి నిరోధకులుగా ముద్రించి ఎదురుదాడికి దిగుతున్నారు.

రైతులకు గానీ ప్రభుత్వానికి గానీ చెరకు సాగు విస్తీర్ణం పెరిగితే రాబడి పెరుగుతుంది. 2014-15లో 3,47,500 ఎకరాల్లో చెరకు సాగు అయితే 2015-18 నాటికి 2,41,265 ఎకరాలకు సాగు పడిపోయింది. పైగా రికవరీ శాతం 2014-15లో దేశం మొత్తం మీద 10.4 శాతం వుంటే ఏపిలో 9.7 శాతంగా వుంది. తిరిగి 2016-17కి ఏపిలో 9.3 శాతానికి రికవరీ శాతం పడిపోయింది. ఈ గణాంకాలన్నీ ప్రభుత్వ రికార్డుల నుండి తీసుకున్నవే. మరో వైపు 2015 ఆగస్టులో వెలువడిన కేంద్ర ఆర్థిక సర్వే ప్రకారం ఏపిలో చిన్న సన్నకారు రైతులపై 2016-17 నాటికి రూ.44,599 కోట్లు రుణభారం వుంది. ఇందులో వ్యవస్థీకృత రంగం నుండి తీసుకున్నది కేవలం రూ.18,727 కోట్లుకాగా ప్రయివేటు వడ్డీ వ్యాపారం నుండి రూ.25,872 కోట్లు రైతులు అప్పు చేశారు. మధ్యతరగతి రైతులపై మరో రూ.7,388 కోట్లు పెద్ద రైతులపై రూ.5,542 కోట్ల రుణభారం వుంది. మొత్తం ఏపి రైతులపై రూ.57,529 కోట్ల అప్పు వుంది. ఈ గణాంకాలను పరిశీలిస్తే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణ ఉపశమన పథకం సముద్రంలో కాకి రెట్టతో సమానం. సన్న చిన్నకారు రైతులు ప్రయివేటు వ్యక్తుల వద్ద రూ.25,882 కోట్లు అప్పు చేసి వుండగా ఈ పద్దు కింద రైతు రుణ ఉపశమనం ఏ విధంగానూ ఉపకరించదు. రాష్ట్రంలో రైతు కుటుంబాల పరిస్థితి కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారమే ఇంత దుర్భరంగా ఉంటే ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మభూమి సభల్లో చేస్తున్న ప్రసంగాలు ఏ మేరకైనా ఉపకరిస్తాయా? వ్యవసాయాదాయమే ప్రధానంగా వుండే ఏపిలో దీని బాగోగుల కోసం జన్మభూమి పథకంలో చేపట్టిన కార్యక్రమం కించిత్తు లేదు. ప్రజల్ని మాయలో వుంచేందుకు సంక్షేమ పథకాలతో కాలం వెలిబుచ్చుతున్నారు. ఈ సంక్షేమ పథకాల అమలులో కూడా చిలక కొట్టుళ్లు ఎక్కువై ప్రజలకు మొత్తంగా చేరడం లేదు. రేషన్ కార్డుల పంపిణీ, గ్రామాల్లో గర్భిణీలకు సీమంతం, ఒకింటికి రెండు పింఛన్లు, దివ్యదర్శనాలు, చంద్రన్న కానుకలు ఇలాంటివి వ్యవసాయ రంగం కుదుటపడేం దుకు ఏ మేరకు ఉపకరిస్తాయో జన్మభూమి సభల్లో ముఖ్యమంత్రి వివరిస్తే మంచిది. జన్మభూమి సభల్లో ప్రజల నుండి వస్తున్న నిరసనలు ఎక్కువగా వున్నా ఈ సందర్భంలో కోట్లాది రూపాయలు ప్రకటనల కింద పొందిన మీడియా, ప్రజల నిరసనను మరుగుపరచడమో! లేక జిల్లా ఎడిషనుకు పరిమితం చేయడమో! జరుగుతోంది.





వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు పెరిగితేనే రైతుల అభివృద్ధి సాధ్యమని డాక్టర్ స్వామినాథన్ ప్రధానంగా సూచించారు. కానీ ముఖ్యమంత్రి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పాలని ప్రయత్నిస్తున్నారు... కమలనాథులను ప్రసన్నం చేసుకునేందుకు సుభాష్ పాలేకర్‌ను ముందుకు తెచ్చారు. ఆయన ఏకంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాలనే రద్దు చేయమని కోరడం కొసమెరుపు.

తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తరువాత సమ్మిళిత సుస్థిర వ్యవసాయ అభివృద్ధిపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించమని హైదరాబాద్‌లోని ఆర్థిక, సామాజిక అధ్యయన కేంద్రాన్ని (సెస్) రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అధ్యయనం అనంతరం సెస్ నివేదిక సమర్పించింది. అయితే ప్రభుత్వం నుండి కనీస స్పందన లేకపోవడంతో గత ఆగస్టులో ఈ సంస్థ విశాఖపట్నంలో సభ జరిపి వాస్తవాలను బహిర్గత పర్చింది. రాష్ట్రంలో వ్యవసాయరంగం సంక్షోభంలో వుందని, రైతులు ముఖ్యంగా చిన్నసన్నకారు రైతుల పరిస్థితి దుర్భరంగా వుందని, పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని తమ అధ్యయనంలో తేలినట్లు ప్రకటించింది. అంతేకాక ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో పరిస్థితి మరింత దుస్థితిలో వుందని వివరించింది. ఈ పరిస్థితి నుండి బయట పడాలంటే తొలి చర్యగా రైతు కమిషన్ నియమించాలని తాము సిఫార్స్ చేసినా ప్రభుత్వం నుండి ఏ మాత్రం స్పందన లేదని అసంతృప్తి వెలిబుచ్చింది. సెస్ అధ్యయనంలో సన్నచిన్నకారు రైతులు సంఖ్య క్రమేణా పెరుగుతోందని వీరి జీవనోపాధికి, భద్రతకు వ్యవసాయం భరోసా ఇవ్వడంలేదని తేలింది. ఇంకా రాష్ట్రంలో సగానికి పైగా సాగు విస్తీర్ణం వర్షాధారంగా వుందని, రుతుపవనాలలో తేడా వచ్చినప్పుడు వ్యవసాయ రంగం కుదేలవుతోందని పేర్కొంది.


2002-10 దశాబ్దంలో సాగు వ్యయం రెట్టింపైందని దీనికి తగ్గట్టుగా పంటలకు ధరలు లభించకపోవడంతో వ్యవసాయం లాభసాటిగా లేదని ఫలితంగా రైతులు వలస బాట పట్టడం గానీ ఆత్మహత్యలు చేసుకోవడం గానీ జరుగుతోందని వివరించింది. రాష్ట్రంలో పంటల సరళిలో పెద్ద మార్పులు వచ్చాయని పండ్ల తోటల విస్తీర్ణం 1965లో 5.5 శాతం వుండగా 2013 నాటికి 14 శాతం పెరిగి ఆహార ధాన్యాల సాగు విస్తీర్ణం 71.6 శాతం నుండి 54 శాతానికి పడిపోయిందని నివేదికలో వివరించింది. ఇందుకు కొనసాగింపుగానే తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని పంటల సాగు విస్తీర్ణం ప్రతి సంవత్సరం పడిపోతూ వుంది.

ఆ మాటకొస్తే ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ నివేదిక ఒక లెక్కే కాదు. చంద్రబాబు పదేళ్లపాటు ప్రతిపక్ష నేతగా వున్న కాలంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వామినాథన్ సూచనలను అమలు చేయాలని బల్లగుద్ది వాదించిన సందర్భాలు లేకపోలేదు. అయితే అధికారం చేపట్టిన తర్వాత ఆయన సూచనలకు విరుద్ధంగా విధానాలు అమలు జరుగుతున్నాయి. కోటి ఎకరాలలో పండ్ల తోటలను పెంచాలని ముఖ్యమంత్రి ఇటీవల చేసిన ప్రతిపాదన వ్యవసాయ రంగంలో ప్రయివేట్ పెట్టుబడులకు ద్వారాలు తీయడం కార్పొరేట్ శక్తుల కబంధ హస్తాల్లోకి రైతులను నెట్టడమే అవుతుంది. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు పెరిగితేనే రైతుల అభివృద్ధి సాధ్యమని డాక్టర్ స్వామినాథన్ ప్రధానంగా సూచించారు. కానీ ముఖ్యమంత్రి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పాలని ప్రయత్నిస్తున్నారు. అందుకే స్వామినాథన్ పేరు ఏ సందర్భంలోనూ ఈ మూడున్నరేళ్ల కాలంలో ముఖ్యమంత్రి నోట నుండి రాలేదు. అయితే కమలనాథులను ప్రసన్నం చేసుకునేందుకు సుభాష్ పాలేకర్‌ను ముందుకు తెచ్చారు. ఆయన ఏకంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాలనే రద్దు చేయమని కోరడం కొసమెరుపు.

ఈ పూర్వరంగంలో 2019 ఎన్నికల్లో గట్టెక్కపోతే దుకాణం కట్టేయవల్సి వస్తుందనే భయంతో ప్రజల్ని ఆకర్షించేందుకు జన్మభూమి పథకం ద్వారా చౌకబారు సంక్షేమ పథకాలను వల్లె వేస్తున్నారు. జన్మభూమి సభలు జరుగుతున్న తీరు పరిశీలిస్తే రాష్ట్రంలో అత్యధిక సంఖ్యాకులైన రైతులకు, వ్యవసాయానికి ఏ మాత్రం ఉపకరించే విధంగా లేదు. ఉత్పత్తేతర వ్యయానికే నిధులు మళ్లిస్తున్నారు. చేస్తున్న అప్పులు వడ్డీలకే సరిపోగా మిగిలిన నిధులు ఉత్పత్తేతర వ్యయానికి సరిపోతుంది. అభివృద్ధి పథకాలకు నిధులు లభ్యం కావడం లేదు. ఈ సందర్భంలో స్వామినాథన్ ఆవేదనను గుర్తుచేసుకోవాల్సిన అవసరముంది. కేంద్ర ప్రభుత్వం ఏడవ వేతన సంఘం సిఫార్సులు చేసిందంటూ ఉద్యోగుల జీతభత్యాలు పెంచడానికి వెనకాడలేదని అదే సమయంలో కొన్ని దశాబ్దాలుగా రైతులు డిమాండ్ చేస్తున్న గిట్టుబాటు ధర కల్పన విషయంలో శ్రద్ధ చూపడం లేదని ఇటీవల ఒక సందర్భంలో డాక్టర్ స్వామినాథన్ చురక అంటించారు. సరిగ్గా ఏపిలో కూడా ఇదే తంతు జరిగింది. ఉద్యోగుల జీతభత్యాలు భారీగా పెంచారు. ఇందుకు అసూయ పడనక్కర్లేదు. కానీ ప్రకృతి వైపరీత్యాలు, మార్కెట్ ఒడిదుడుకులు సంభవించినపుడు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు ఎన్నికల సందర్భంగా చేసిన హామీ ప్రకారం ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఇంకా సిద్ధం కాలేదు. కనీసం 5 దఫాలు జన్మభూమి సందర్భంగా ధారబోసిన నిధులు కూడగట్టి వుంటే ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసే అవకాశముండేది. అందుకు చంద్రబాబు సిద్ధంగా లేరు. ముఖ్యమంత్రి రైతు పక్షపాతి కాదు. పారిశ్రామిక వేత్తలకు నమ్మిన బంటు.

(రచయిత విశ్రాంత పాత్రికేయుడు, సెల్ : 9848394013)

మాటకు మాట



✦ **ఎక్కువ మాట్లాడితే మీ సంగతి చూస్తా : మత్స్యకారులపై చంద్రబాబు ఆగ్రహం**
– మీకన్నా ఎక్కువ మాట్లాడుతున్నారా?

✦ **అమాంతం ఎదిగిన అదానీ సంపద**
– వడ్డించేవోడు మనోడైతే ఏ బంతిలో కూర్చున్నా పర్లేదు.



✦ **గతంలో మా పార్టీలో కొన్ని తప్పిదాలు జరిగాయి. నేను కూడా కొన్ని తప్పులు చేశా : రాహుల్‌గాంధీ**
– టూ...లేట్!

✦ **మిత్రపక్షంగా ఉంటారో...వెళ్తారో మీరే తేల్చుకోండి : బీజేపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు**
– టిడిపికి కౌంట్ డౌన్ మొదలు పెట్టారా...!




✦ **అవసరం, సందర్భాన్ని బట్టి ప్రధాని నరేంద్ర మోడీ చంద్రబాబుకు అపాయింటుమెంట్ ఇస్తారు : జెసి**
– ఎవరి అవసరాన్ని బట్టి...?

✦ **త్వరలో 2.50 లక్షల గృహ ప్రవేశాలు : ముఖ్యమంత్రి**
– కడుతున్నవాటికి ముందు బిల్లులివ్వండి సారూ



✦ **'అమ్మకానికి ఆధార్' కథనం రాసిన జర్నలిస్టుపై కేసు**
– నిజం రాయడమే నేరమా!

✦ **కొత్త ఏడాదిలోనూ అబద్ధాలేనా!: సీఎంపై మండిపడ్డ బొత్స**
– అబద్ధాలకు కొత్త, పాత ఏంటీ? ఎవర్ గ్రీన్ అయితేనూ!



✦ **వ్యవసాయ యూనివర్శిటీలను మూసేయాలి : సుభాష్ పాలేకర్**
– ఆవు పేడ కేంద్రాలు తెరవాలేమో!

✦ **ఆధార్ భద్రత డొల్ల : రూ.500కే అందరి వివరాలు**
– ఆ విషయం కేంద్రానికి తెలియదా యేంటి

✦ **జన్మభూమిలో నిరసనలు, నిలదీతలు : వార్త**
– ష్...గట్టిగా అనకండీ



- ఉదయ

జన వాక్యం

ఆన్‌లైన్లో అవకాశం



రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజుల లేఖరి వృత్తి నమ్ముకుని ఏడు లక్షల మంది వరకు ఉపాధి పొందుతున్నారు. ఈ వృత్తిపై లేఖర్లుగా, వెండర్లుగా, డి.టి.పి ఆపరేటర్లుగా అనేక మంది జీవిస్తున్నారు. అయితే ప్రభుత్వం దస్తావేజులను ఆన్‌లైన్ డిజిటలైజేషన్ చేయబోతోంది. దీంతో ఈ వృత్తి మీద ఆధారపడినవారు నష్టపోవలసి వస్తుంది. ఒక స్థిరాస్తి విషయంలో అమ్మకం, కొనుగోలు, గిఫ్ట్ మొదలగు మతలబు తయారు చేసే విధానంలో కక్షిదారులకు సబ్ రిజిస్ట్రార్, దస్తావేజుల లేఖరి పాత్ర, వారి ఆలోచనలు ఎంతో కీలకమైనవి. కానీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ నూతన విధానంలో కొన్ని అంశాలకు మాత్రమే అవకాశం వుంటుంది. దీని వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు కలుగవచ్చు. అందుకే ఆన్‌లైన్ విధానంలో కూడా దస్తావేజుల లేఖరికి ప్రభుత్వం అవకాశం కల్పించాలి.

యేటూరి రవికుమార్,
షేర్‌మహమ్మద్‌పేట, కృష్ణాజిల్లా.

వ్యాసాలు, ఉత్తరాలు పంపించాల్సిన చిరునామా
editpageps@gmail.com

కార్మికులకు కోతలు-కార్పొరేట్లకు రాయితీలు

అంతర్జాతీయం



ఎం కోటేశ్వరరావు

అమెరికా అధ్యక్ష భవనంలో ఎవరు కొలువు తీరారన్నది పెద్దగా ప్రాముఖ్యత కలిగిన విషయం కాదు. వ్యక్తుల ప్రవర్తనలో మంచిచెడ్డలు విధానాలపై ప్రభావం పెద్దగా చూపవు. పాలకవర్గ ప్రయోజనాలకు అనుగుణంగా జాతీయ, అంతర్జాతీయ విధానాలు వుంటాయి. ఏ పార్టీ నేత పీఠంపై వున్నా దోపిడీ, ప్రపంచాధిపత్యం, యుద్ధోన్మాదం కనిపిస్తూనే వుంటుంది. అంతర్గతంగా గతేడాది కాలంలో ట్రంప్ సర్కార్ ఏ విధంగా వ్యవహరించిందో చూద్దాం. ట్రంప్ పదవీ బాధ్యతలు స్వీకరించక ముందే ఇండియానా పోలీసు ప్రాంతంలో జరిపిన పర్యటన గురించి పెద్ద ఎత్తున మీడియా ప్రచారం చేసింది. అక్కడి ఒక వుక్కు కర్మాగారంలో తాను పదకొండు వందల పర్మనెంటు వుద్యోగాలను రక్షించానని చెప్పుకున్న గొప్పలకు అక్కడి కార్మికనేత అంత సీన్ లేదని, చాలా తక్కువ అని గాలి తీశాడు. 'నా పరువు తీస్తావా?' అంటూ సదరు నేతపై ట్రంప్ ట్విటర్ దాడి చేశాడు. అదే పెద్ద మనిషి ఏడాది తరువాత తానొక స్థిరమైన మేథావినని డబ్బా కొట్టుకున్నాడు. ట్రంప్ పదవీ స్వీకారం జరిగిన వెంటనే ఆయన కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భారీ మహిళా ప్రదర్శన జరిగింది. తరువాత ఏడాది కాలంలో జరిగిన ప్రదర్శనల్లోనూ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మేకలకు తోడేళ్లను సంరక్షకులుగా నియమించినట్లు ఒక పెద్ద ఫాస్ట్‌ఫుడ్ కంపెనీ యజమాని ఆండ్రూపుడెర్‌ను కార్మికశాఖా మంత్రిగా నియమించటంపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం కావటంతో వుపసంహరించక తప్పలేదు. అనేక మంది పేదలకు కొత్తగా అందుబాటులోకి తెచ్చిన ఒబామా ఆరోగ్య సేవల పథకానికి తూట్లు పొడిచేందుకు ట్రంప్ చేసిన యత్నాన్ని తాత్కాలికంగా అయినా కార్మికులు అడ్డుకోగలిగారు. ఒకవైపు కార్మికుల సంక్షేమ చర్యలను నీరుగార్చేందుకు ప్రయత్నిస్తూనే మరోవైపు రాబోయే పది సంవత్సరాల కాలంలో ధనికులు, కార్పొరేట్లకు లక్షన్నర కోట్ల డాలర్ల మేర పన్ను రాయితీలు ఇచ్చేందుకు నిర్ణయించారు. కార్మిక వ్యతిరేక చట్టాలకు అనుమతి, వుద్యోగ భద్రత, ఆరోగ్య రక్షణ వుపసంహరణ, ఆర్థిక పరమైన రక్షణలకు మంగళం పాడే అనేక నిర్ణయాలకు అనుమతినిచ్చారు. జాతీయ కార్మిక సంబంధాల బోర్డుతో సహా అనేక కమిటీలు, బోర్డులను కార్మిక వ్యతిరేకులతో నింపివేశారు. పర్యవసానంగా మూడు కార్మిక అనుకూల తీర్పులను తిరస్కరించారు. ట్రంప్ ప్రభుత్వ తీరుపై కార్మిక సంఘాలలో వున్న విబేధాలు కూడా ట్రంప్ కార్మిక వ్యతిరేక చర్యలను వేగవంతం చేస్తున్నాయి.

ఒబామా హయాంలోనే మంచి వేతనాలతో కూడిన వుద్యోగాల సంఖ్య తగ్గి, వేతన మొత్తాలు తక్కువగా వుండే వుపాధి పెరుగుదల ప్రారంభమైంది. ట్రంప్ ఏడాది పాలనా కాలంలో అది మరింతగా పెరిగింది. అందువలన నిరుద్యోగం తగ్గినట్లు కనిపించినా ఆరోగ్య సంరక్షణ, బార్లు, హోటళ్లలో పని చేసే వారి సంఖ్య పెరిగింది. పర్యవసానంగా వేతన ఆదాయం తగ్గటంతో యూనియన్లలో చేరే కార్మికుల సంఖ్య కూడా గణనీయంగా పడిపోతోంది. దీంతో రాష్ట్రాలలో కార్మిక వ్యతిరేక చట్టాలకు ప్రతిఘటన కూడా తగ్గిపోయింది.

ట్రంప్ ఏడాది పాలన



ఒకవైపు కార్మికుల సంక్షేమ చర్యలను నీరుగార్చేందుకు ప్రయత్నిస్తూనే మరోవైపు రాబోయే పది సంవత్సరాల కాలంలో ధనికులు, కార్పొరేట్లకు లక్షన్నర కోట్ల డాలర్ల మేర పన్ను రాయితీలు ఇచ్చేందుకు నిర్ణయించారు. కార్మిక వ్యతిరేక చట్టాలకు అనుమతి, వుద్యోగ భద్రత, ఆరోగ్య రక్షణ వుపసంహరణ, ఆర్థిక పరమైన రక్షణలకు మంగళం పాడే అనేక నిర్ణయాలకు అనుమతినిచ్చారు. జాతీయ కార్మిక సంబంధాల బోర్డుతో సహా అనేక కమిటీలు, బోర్డులను కార్మిక వ్యతిరేకులతో నింపివేశారు.

అంతర్జాతీయ వ్యవహారాలలో డోనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలి మిగతావారి కంటే భిన్నంగా కనిపించినప్పటికీ ఎక్కడన్నా బావేగాని వంగతోట దగ్గర కాదన్నట్లు అమెరికా పాలకవర్గ మౌలిక ప్రయోజనాల విషయంలో మాత్రం ఎలాంటి రాజీ లేకుండా మీ ఇంటికొస్తే మాకేం పెడతావ్ మా ఇంటికొస్తే మాకేం తెస్తావ్ అన్నట్లుగా వ్యవహరిస్తున్నాడు. అయితే మీడియాతో వ్యవహరించే తీరులో, ట్విటర్ వ్యాఖ్యల విషయంలో అందరూ అనుకొంటున్నట్లుగా ఎవరేమనుకుంటే నాకేటి సిగ్గు అన్నట్లుగానే వుంది. అమెరికాలో పెరుగుతున్న ఆర్థిక అంతరాలు, ఆర్థిక రంగంలో గత పది సంవత్సరాలుగా కొనసాగుతున్న సంక్షోభం, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో తగిలిన ఎదురు దెబ్బలు, చైనాతో పెరుగుతున్న వాణిజ్య లోటు, లాటిన్ అమెరికాలో ప్రతిఘటన వంటి అనేక కారణాలు అంతర్జాతీయ రంగంలో అమెరికాను గుక్కతిప్పుకోనివ్వడం లేదు. తన సంక్షోభాన్ని ఎక్కడో ఒక చోట యుద్ధం ద్వారానో మరో విధంగానో ఇతరులపై రుద్దేందుకు ట్రంప్ యంత్రాంగం కూడా చేయని యత్నం లేదు. వుత్తర కొరియా అణు, క్షిపణి పరీక్షలను సాకుగా చూపి కాలుదువ్వటం దానిలో భాగమే. ఈ పూర్వరంగంలో ట్రంప్ ప్రభుత్వ వైఖరి భారత వుపఖండంలో ఎలా వుందో చూడటం అవసరం.

పాకిస్తాన్ వుగ్రవాదులకు మద్దతు ఇస్తున్న కారణంగా అందచేస్తున్న సాయాన్ని నిలిపివేస్తున్నట్లు ట్రంప్ సర్కార్ గొప్పగా చెబుతోంది. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్ల సృష్టిలో, మన దేశంలో పంజాబ్, కాశ్మీరుల్లో వుగ్రవాదులకు అవసరమైన శిక్షణ, ఆయుధాల అందచేతలో అమెరికా ప్రయోజనాలకు అనుగుణ్యంగా పాకిస్తాన్ వ్యవహరించిన తీరు లోకవిదితం. చైనా తరువాత అతి పెద్దదిగా వున్న భారత మార్కెట్‌ను చేజిక్కించుకొనేందుకు అమెరికా సామ, దాన, భేద, దండోపాయాలను అనుసరించింది. వుగ్రవాదులకు సాయం, ప్రోత్సాహం దానిలో భాగమే. ఇప్పటికీ అమెరికా మనపై వత్తిడి తెస్తూనే వుంది. వాణిజ్యం విషయంలో మన దేశంలోని కార్పొరేట్ శక్తులు అటు సోవియట్‌ను ఇటు అమెరికా, ఇతర ఐరోపా ధనిక దేశాలను వినియోగించుకొనేందుకు ప్రయత్నించిన అనుభవాలున్నాయి. సోవియట్ అంతరించిన తరువాత చైనాకు వ్యతిరేకంగా పాకిస్తాన్, మన దేశాన్ని కూడా తన గుప్పెటలో వుంచుకొనేందుకు అమెరికా తీవ్రంగా ప్రయత్నించింది. అయితే దానికి భిన్నంగా జరిగిన పరిణామాలలో గత పాతిక సంవత్సరాలలో ఒక్కొక్క అడుగు మన దేశం అమెరికాకు దగ్గర అవటం, అదే సమయంలో చైనాకు పాకిస్తాన్ దగ్గరయింది. దీంతో పాకిస్తాన్‌కు సాయం నిలిపివేసి మన దేశానికి ఏదో మేలు చేస్తున్నట్లు ట్రంప్ ఫోజు పెడుతున్నాడు. నరేంద్ర మోడీని, మన దేశాన్ని పొగుడుతూ మునగ చెట్టెక్కించటం తప్ప ఇంత వరకు ఏ ఒక్క విషయంలోనూ సానుకూల వైఖరిని అనుసరించలేదు. వీసాల విషయంలో లక్షలాది మంది భారత కార్మికులు, వుద్యోగులను భయకంపితులను గావించటంలో ఇప్పటివరకు అమెరికా అధ్యక్షులలో ట్రంప్ తరువాతే ఎవరైనా. ప్రపంచ రాజకీయాలలో మన దేశాన్ని జూనియర్ భాగస్వామిగా చేసుకొనేందుకు ఎప్పటి నుంచో ప్రయత్నిస్తోంది. ప్రపంచ వేదిక మీద 'భారత్‌కు విశ్వసనీయమైన భాగస్వామి కావాలి...... ఆ భాగస్వామి అమెరికానే, అది నూరేళ్ల బంధం' అని అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిలర్సన్ మనల్ని ఎక్కడికో తీసుకుపోయేందుకు ప్రయత్నించాడు. పెరుగుతున్న చైనా ప్రాభవాన్ని అడ్డుకొనేందుకు అమెరికా పెద్ద వ్యూహం పన్నింది. దానిలో మన దేశాన్ని నిలిపేందుకు పూనుకుంది. మన దేశం తనకు లొంగకపోతే మరోసారి పాకిస్తాన్‌ను దగ్గరకు తీసుకున్నా ఆశ్చర్యం లేదు. అందువలన ట్రంప్ మెచ్చుకోళ్లకు మురిసిపోతే వూబిలో దిగినట్లే.



ఇప్పటి పిల్లల్ని బొమ్మలు గురించి చెప్పమని అడిగితే.. మిక్కీమౌస్, టెడ్డీబేర్, ఇంకొంచెం అడ్వాన్స్ పిల్లలయితే సూపర్‌మ్యాన్, డోరేమ్యాన్, బ్యాట్‌మేన్.. సిండ్రిలా.. ఇంకా మాట్లాడితే పెద్దలకు సైతం అర్థంకాని విచిత్రపాత్రల బొమ్మలపేర్లు.. గుక్కతిప్పుకోకుండా చెప్తారు. కానీ మొన్నటితరం పిల్లల్ని అడిగితే మాత్రం.. హరిదాసు, గంగిరెద్దులు, డోలుసన్నాయిలు, ఎడ్లబండి, చెట్టుమీద కోతి, పురివిప్పిన నెమళ్ళు, తలాడించే తాతయ్య, బామ్మ.. అంటూ ఎంతో మురిసిపోతూ చెప్తుంటారు. ఇప్పటి పిల్లలకు బొమ్మలంటే కంప్యూటర్, టీవీల్లో వికటాట్టహాసాలు చేసే గాజుబొమ్మలే. కానీ మొన్నటి పిల్లలకు మాత్రం బొమ్మలంటే.. పెద్దయ్యాకా వెంటాడి మరీ అలరించే అందమైన జ్ఞాపకాలు. అలాంటి బొమ్మల్ని చూడాలంటే.. బొమ్మలకొలువులో మనమో బొమ్మగా మారాలి. మన పిల్లలకి సంక్రాంతి బొమ్మలకొలువు గురించి మళ్ళీ గుర్తుచేయాలి. వారి చిట్టి చేతులతో ఆ బొమ్మల్ని ఎత్తుకునేలా చేయాలి. గుప్పెడు కబుర్లూ చెప్పుకునేలా చేయాలి. రండి.. మన చిన్నారులతో కలిసి మన ఇంట కొలువుదీరే చిట్టిపొట్టి బొమ్మలను ప్రేమగా తాకి, పరవశించేలా చేద్దాం!!

చిట్టిపొట్టి బొమ్మలతో మాట్లాడదాం!!

సంక్రాంతి అనగానే గుర్తొచ్చే అందమైన జ్ఞాపకాల్లో బొమ్మల కొలువు ఒకటి. ఆకర్షణీయమైన రంగులతో కొలువుదీరే బొమ్మలకొలువులో రాముడు, కృష్ణుడువంటి దేవుళ్ళ బొమ్మలతోపాటు గుళ్ళూగోపురాలు, పురోహిత బ్రాహ్మణుడు, తల్లీబిడ్డ, ఆవూదూడ, బొమ్మలపెళ్ళి వంటివి అనేక బొమ్మలు తారసపడతాయి. ఇవేకాకుండా జంతువుల బొమ్మలు, పక్షుల బొమ్మలు, పండ్లు, చెట్ల బొమ్మలు, దేశనాయకుల బొమ్మలు, ప్రయాణవాహనాలు, వివిధ కట్టడాలు, తల ఆడిస్తూ నాట్యం చేసే బుట్ట బొమ్మలు, పిట్టలు, పొలానికి వెళ్ళే రైతు దంపతులు, తిరగలి తిప్పే బామ్మ, వేలితో గోవర్ధనగిరి ఎత్తిన కృష్ణుడు, దశావతారాలు, కౌరవపాండవ యుద్ధ సన్నివేశం, సీతారాముల కల్యాణం, పట్టాభిషేకం బొమ్మలు, అమ్మమ్మ, తాతయ్య వంటి కుటుంబ సభ్యుల బొమ్మలు ఇలా ఎన్నిరకాల బొమ్మలో.. అలరిస్తూ ఆకట్టుకుంటాయి. గతంలో మట్టి, పింగాణీ బొమ్మలు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం ప్లాస్టిక్, బార్బీలు కూడా వస్తున్నాయి. ఈ బొమ్మలను తీర్చిదిద్దే కళాకారులు వేరు. సంక్రాంతి, దసరా పండగలప్పుడు మన ఇళ్ళల్లో... ఎంతో సహజత్వంతో కొలువుదీరే ఈ బొమ్మలు వెనుక చాలా పెద్ద సంప్రదాయ, కళాత్మక కృషే దాగి ఉంది.

ఆట ఉంది.. శాస్త్రమూ ఉంది

ఇంట్లో పిల్లలకు ఆటపాటలపై అవగాహన కలిగిస్తూ, సామాజిక విషయాల పట్ల స్పృహ కలిగించడం.. కుటుంబ బాంధవ్యాల పట్ల విశ్వాసం కలిగించడమే.. బొమ్మలకొలువు ముఖ్యోద్దేశ్యమని పెద్దలు చెబుతారు. నిజంగానే బొమ్మలకొలువు తీరుతెన్నులు గమనిస్తే.. మనం ప్రకృతితో ముడిపడి చేయవలసిన సహజీవన విధానాలు అనేకం చూడొచ్చు. వాటి గురించి పిల్లలకు అర్థమయ్యేలా నేర్పనూవచ్చు. మనిషి తాను పొందిన సంపదను పదిమందితో కలిసి పంచుకోవాలనే సందేశాలూ కనిపిస్తాయి. జీవనయానంలో మనిషికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయపడే పశుపక్ష్యాదులను గుర్తించి, ఆదరించడమెలాగో బొమ్మలకొలువు చెప్పకనే చెబుతుంది. మొత్తానికి పిల్లలకు, పెద్దలకు ఆహ్లాదాన్ని కలిగించి, ఆనందాన్ని పంచి, మానవతను పెంచే సందర్భంగా ఇది మంచి గుర్తింపు పొందింది. ఎందుకంటే, మనం నివసిస్తున్న ప్రాంతాన్ని ప్రతిబింబించేలా, మన ఊరిలోని వీధుల పేర్లు, పేటల పేర్లు వచ్చేలా అమర్చుకోవచ్చు. జాతీయ సమైక్యతను చాటి చెప్పేలా భారతదేశపటం ఆకారంలో అమర్చి, ఆయా రాష్ట్రాల సంప్రదాయాలు మేళవించేలా బొమ్మలను కళాత్మకంగా, అర్థవంతంగా అమర్చుకోవచ్చు. ఆమాటకొస్తే బొమ్మలకొలువులో బొమ్మల కంటే.. అమరికే ముఖ్యం. బొమ్మల్ని ఎలా అర్థవంతంగా తీర్చామనేది మన ఆలోచన విధానాన్ని ప్రతిబింబిస్తుంది.



పిల్లలే ప్రత్యేకం!

నిజానికి ఈ వేడుక సంప్రదాయంలో భాగంగా వస్తున్నప్పటికీ బొమ్మల కొలువులో పిల్లల హడావిడీనే ఎక్కువ. బొమ్మలు కొనుగోలు చేయడం, వాటిని అందంగా, అర్థవంతంగా తీర్చే అమరికలో పిల్లలు కీలకపాత్ర పోషిస్తారు. అందుకే అమ్మకపుదార్లు వారిని ఆకర్షించేలా బొమ్మలను తయారుచేస్తుంటారు. ఎప్పటికప్పుడు కొత్తకొత్త బొమ్మలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తారు. తలను అటూ ఇటూ ఆడిస్తూ ఆకర్షణీయంగా కనిపించే బొమ్మలు పిల్లలను ఆకట్టుకునే వాటిల్లో మొదటి స్థానంలో ఉంటాయనే చెప్పాలి. అంతేకాదు, మార్కెట్‌లో లభించే ఈ బొమ్మల పేర్లను తెలుసుకోవడంతో పాటు.. వాటి వెనుకున్న చరిత్రను అధ్యయనం చేసే అవకాశం పిల్లలకు ఉంటుంది. నేటి ఆధునిక యుగంలోని చిన్నారులు పురాతన గాథలకు సంబంధించిన ఘట్టాలు, పండగలు, ఉత్సవాలు, వ్యవసాయ పద్ధతులపై అవగాహన ఏర్పడుతుంది.

స్వయం ఉపాధి మార్గంగా..!

అమ్మకందారులు నగరాల్లోని



ప్రధానకూడళ్ల వద్ద, మార్కెట్ ప్రాంతాలలో తోపుడుబల్లలపై వరుసక్రమంలో ఆకర్షణీయంగా బొమ్మలను అలంకరిస్తారు. ఉదయం మొదలయ్యే వీరి ఉపాధి వేట సాయంత్రం వరకూ నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంటుంది. "ఈ సీజన్‌లో బొమ్మలు బాగా అమ్ముడవుతాయి. రోజులో వెయ్యి రూపాయల వరకూ బొమ్మలు అమ్ముతాం. కొనుగోలు చేసేటప్పుడు పెద్దల కంటే పిల్లలే ఎక్కువ ఆసక్తి చూపుతారు. అయితే, గతంతో పోల్చుకుంటే ఇప్పుడు పెద్దగా బేరాలు లేవు. అయినా మేం ఈ బొమ్మల అమ్మకాన్నే నమ్ముకున్నాం" అంటోంది పదిహేనేళ్లుగా బొమ్మలు వ్యాపారం చేస్తోన్న వేణమ్మ. ఢిల్లీ నుంచి తెప్పించిన బొమ్మలకు హంగులు దిద్ది వీరంతా అమ్మకాలు జరుపుతారు. బొమ్మ సైజును బట్టీ ఇరవై రూపాయలు మొదలుకొని రెండు వందల రూపాయల వరకూ ఉంటుంది. సంవత్సరం మొత్తంలో డిసెంబర్ మొదలుకొని సంక్రాంతి వరకూ అమ్మకాలు జోరుగా సాగుతాయి. బొమ్మల అమరికలో వీరి ప్రత్యేకతను చాటుకుంటారు. అదే కొనుగోలుదారును ఆకర్షించడంలో కీలకం తర్వాత మిగిలిన బొమ్మలను జాగ్రత్తగా ఓ చోట భద్రపరచాల్సి ఉంటుంది. అది వ్యాపారులకు పెద్ద సవాల్ అనే చెప్పాలి. ఇలా పండుగ సందర్భాన బొమ్మల తో వీరికి గల అనుబంధం వెలకట్టలేనిది.

- చందు తిలారు

అమ్మకమే ఆధారం!



ఇరవై ఏళ్లుగా బొమ్మల అమ్మకమే మా కుటుంబానికి ఆధారం. ఎంత వ్యాపారం చేసినా ఈ సీజన్‌లోనే. తర్వాత మళ్లీ మామూలే. రోజులో రెండొందలకు మించి సంపాదించలేం. బొమ్మల్లో చాలా రకాలు వచ్చేశాయి. అయితే, ఇవే బొమ్మలు పెద్ద పెద్ద షాపుల్లో అయితే ఎక్కువ రేటుకే అమ్ముతారు. అక్కడ కొనలేనివాళ్ళు మా దగ్గర కొంటారు.

- జె రమణమ్మ

నిజంగా పండగే!



ఈ సీజన్ వచ్చిందంటే మాలాంటి బొమ్మలు అమ్మేవాళ్ళకు నిజంగా పండగ. ఎందుకంటే, ఏడాది మొత్తంగా అమ్మే బొమ్మల అమ్మకం ఒక ఎత్తు. ఈ సీజన్ మరో ఎత్తు. నాలుగువేళ్లూ నోట్లోకి వెళ్ళిన సందర్భం ఏదైనా.. మాలాంటి వారికి పండగే కదా?!

- ఆర్ వేణమ్మ

రమణుల రంగవల్లి

బహుమతి పొందిన ముగ్గు




సి.హెచ్.కృష్ణవేణి
శ్రీకాకుళం



21 చుక్కలు
7 వరుసలు
7 వచ్చేవరకు
సరిచుక్క

డి.విజయకుమారి
పార్వతినగర్
పాలకొల్లు
పశ్చిమగోదావరిజిల్లా



21 చుక్కలు
1 వచ్చేవరకు
సరిచుక్క



15 చుక్కలు
5 వరుసలు
5 వచ్చేవరకు



యస్. సుధారాణి
యస్.జి.ఓ కాలని
యర్రగొండపాలెం
ప్రకాశంజిల్లా




డి. లచ్చమ్మ
సుందరయ్యకాలని
మార్కాపురం
ప్రకాశం



17 చుక్కలు
9 వచ్చేవరకు
మధ్యచుక్క



జె. భాగ్యలక్ష్మి
జయపురం
బంటుమిల్లి
కృష్ణాజిల్లా






డి. గాయత్రి
మార్కాపురం
ప్రకాశంజిల్లా



5 చుక్కలు
సరిచుక్క
8 వచ్చేవరకు


జె. కుమారి
సూరేపల్లి
ప్రకాశంజిల్లా





16 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు
సరిచుక్క

మీ కోసం



మధుమేహులు అన్నం తిన్నా రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా ఉండాలంటే అన్నం ఉడికేటప్పుడు చిన్న దాల్చిన చెక్క వేస్తే సరి.

జీవన సౌరభం

చేసిన తప్పుని సరిదిద్దుకోకపోతే అది ఇంకా పెద్ద ఆపదను తెచ్చి పెడుతుంది.

సెన్సెక్స్ ↓ 10
34,433

నిఫ్టీ ↓ 05
10,632

రూపాయి ↑ 13 పై.
అమెరికా డాలరుకు రూ.
63.59



కొత్త బైకులు..
ప్రముఖ ద్విచక్ర వాహన కంపెనీ బజాజ్ ఆటో తాజాగా డిస్కవర్ వెర్షన్‌లో 110, 125సిసిలో రెండు కొత్త మోడళ్లను మార్కెట్లోకి విడుదల చేసింది. ఎక్స్‌షోరూం వద్ద వీటి ధరలను రూ.50,496 నుంచి రూ.56,314గా నిర్ణయించింది. డిస్కవర్ 110 వేరియంట్‌లో 115.5సిసి, 125లో 124.5 సిసి సామర్థ్యంతో రెండు వేరియంట్స్‌ను రూపొందించింది.



హ్యుందాయ్ 'నెక్స్ట్ జెన్ వెర్నా'
హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్‌ఎంఐఎల్) మిడ్‌సైజు ప్రీమియమ్ సెడాన్ వెర్నాలో రెండు కొత్త వేరియంట్స్‌ను విడుదల చేసింది. 1.4 లీటర్ పెట్రోల్ ఇంజన్ సామర్థ్యం కలిగిన వీటి ధరలను ఢిల్లీ ఎక్స్‌షోరూం వద్ద రూ.7,79,000 నుంచి రూ.9,09,000 లక్షలుగా నిర్ణయించింది.

ఒడిదుడుకుల్లో మార్కెట్లు

ముంబయి : వచ్చే నెలలో కేంద్ర బడ్జెట్‌కు తోడు ఈ వారాంతంలో కార్పొరేట్లు డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి గాను ఆర్థిక ఫలితాలు ప్రకటించనున్న నేపథ్యంలో మదుపర్లు ఆచీతూచి వ్యవహరించడంతో రోజంతా మార్కెట్లు ఒడిదుడులకు గురైయ్యాయి. దీంతో బుధవారం మార్కెట్లు స్వల్ప నష్టాలను ఎదుర్కొన్నాయి. తుదకు బిఎస్‌ఇ సెన్సెక్స్ 10.12 పాయింట్లు తగ్గి 34,443 వద్ద ముగిసింది. ఉదయం 34,538.78 వద్ద మొదలైన సూచీ ఇంట్రా ట్రేడింగ్‌లో 34,565.63–34,311.63 వద్ద కదలాడింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 4.8 పాయింట్లు కోల్పోయి 10,632 వద్ద నమోదయ్యింది. బిఎస్‌ఇలో రంగాల వారిగా ఐటి సూచీ అత్యధికంగా 1.84 శాతం పెరిగింది. ఇదే క్రమంలో టెక్ 1.46 శాతం, రియాల్టీ 1.16 శాతం, లోహ 0.1 శాతం చొప్పున రాణించి మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. మరోవైపు ఆటో సూచీ 0.68 శాతం, కన్సూమర్ డ్యూరెబుల్స్ 0.65 శాతం, కాపిటల్ గూడ్స్ 0.37 శాతం, పిఎస్‌యు 0.33 శాతం చొప్పున నష్టపోయాయి. సెన్సెక్స్‌లో టిసిఎస్ 3.64 శాతం, విప్రో 2.66 శాతం, కోల్ ఇండియా 1.33 శాతం, అదానీ పోర్ట్సు 1.05 శాతం, ఇన్ఫోసిస్ 0.99 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు డాక్టర్ రెడ్డీస్ 1.45 శాతం, ఎన్‌టిపిసి 1.25 శాతం, ఎన్‌టిపిసి 1.25 శాతం, ఆసియన్ పెయింట్స్ 1.22 శాతం, బజాజ్ ఆటో 1.1 శాతం, ఎస్‌బిఐ 1.05 శాతం చొప్పున అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

డిపాజిట్ చేయకపోతే జైలుకే..

జెపి అసోసియేట్స్‌కు సుప్రీం హెచ్చరిక

న్యూఢిల్లీ : జెపి అసోసియేట్స్‌పై మరోమారు సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కంపెనీ గృహ కొనుగోలుదారులకు గడువు సమయంలో ఫ్లాట్లను అందజేయకుండా చేతులెత్తేసిన విషయం తెలిసిందే. తాము అంతకముందు ఆదేశించిన రూ.125 కోట్లను డిపాజిట్ చేయాలని, లేదా కోర్టు ధిక్కార కేసు కింద తిహార్ జైలుకి పంపించాల్సి వస్తుందని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఎఎం ఖాన్‌విల్‌కర్, జస్టిస్ డివై చంద్రచుడ్‌తో కూడిన బెంచ్ బుధవారం హెచ్చరించింది. జెపి ఇన్‌ఫ్రాటెక్ గడువు సమయంలో ఇళ్లు అందించకపోవడంతో కొనుగోలుదారులు తమ నగదును తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో రూ.2000కోట్లను జెపి అసోసియేట్స్ తమ వద్ద డిపాజిట్ చేయాలని కోర్టు ఆదేశించింది. ఇందులో ఇప్పటి వరకు ఆ సంస్థ రూ.425కోట్లు మాత్రమే డిపాజిట్ చేసింది. జనవరి 25 వరకు మరో రూ.125 కోట్లను డిపాజిట్ చేయాలని జెపి అసోసియేట్స్‌కు గుర్తు చేసింది. ఆ సంస్థ చేపడుతున్న హౌసింగ్ ప్రాజెక్టుల వివరాలను న్యాయస్థానానికి సమర్పించాలని ఆదేశించింది.

సంస్కరణల వేగం పెరగాలి

- సులభ వ్యాపారాన్ని పెంచాలి
- విద్యా, వైద్య రంగాల్లో మార్పులవసరం
- భారత్‌కు ప్రపంచ బ్యాంకు ఆదేశాలు
- 2018లో 7% వృద్ధి
- జిడిపి పెరుగుదలకు విస్తృతావకాశాలు
- గ్లోబల్ ఎకనామిక్స్ ప్రాస్పెక్ట్–2018లో వెల్లడి



వాషింగ్టన్ : భారతదేశం సంస్కరణలను మరింత వేగవంతం చేయాలని ప్రపంచ బ్యాంకు మరోమారు పరోక్షంగా ఆదేశించింది. ఇప్పటికే తాహతుకు మించి విశాలమైన సంస్కరణలు చేపడుతుందని మరోవైపు ప్రశంసించింది. సులభ వ్యాపారానికి ఉన్న అడ్డంకులను తొలగించాలని, ప్రయివేటు పెట్టుబడులను ప్రోత్సహించాలని సూచించింది. విద్యా, వైద్య రంగాలను మరింత ప్రయివేటీకరించాలని పరోక్షంగా ఆ రంగ సంస్కరణలపై వ్యాఖ్యానించింది. దీంతో దేశ వృద్ధి రేటు పెరుగుదలకు విస్తృతావకాశాలు ఉన్నాయని పేర్కొంది. 2018లో భారత్ 7.3 శాతం వృదిని నమోదు చేసే అవకాశాలున్నాయని అంచనా వేసింది. కాగా వచ్చే రెండేళ్లలో ఈ వృద్ధి రేటు 7.5 శాతానికి పెరుగొచ్చని బుధవారం ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన '2018 గ్లోబల్ ఎకనామిక్స్ ప్రాస్పెక్ట్'లో వెల్లడించింది.

భారత్ ఇది వరకు చేపట్టిన నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) ప్రతికూల ప్రభావాల నుంచి బయటపడుతుందని తెలిపింది. దీంతో 2017లో 6.7 శాతం వృద్ధి నమోదవచ్చని అంచనా వేసింది. ఇతర వర్ధమాన దేశాలతో పోల్చితే వచ్చే దశాబ్ద కాలంలో భారత్ మెరుగైన వృద్ధి వైపు పయనిస్తుందని ప్రపంచ బ్యాంకు డెవలప్‌మెంట్ ప్రాస్పెక్ట్స్ గ్రూపు డైరెక్టర్ అయ్హన్ కోసె అన్నారు. ఈ క్రమంలో తాను స్వల్పకాల అంకెలపై దృష్టి పెట్టడం లేదన్నారు. భారత్‌లో భారీ అవకాశాలు ఉన్నాయని పునరుద్ఘాటించారు. గత మూడేళ్ల నుంచి వృద్ధి రేటు ఆరోగ్యవంతంగా ఉందన్నారు. వృద్ధి రేటును సమ్మిళితం చేయడంలో ఒకే దేశం, ఒకే పన్ను లాంటి జిఎస్‌టి కీలక సంస్కరణ మద్దతునియ్యనుందన్నారు. 2016 నవంబర్‌లో చేపట్టిన నోట్ల రద్దు తాత్కాలిక సంస్కరణలపై ప్రభుత్వం చాలా అవగాహన కలిగి ఉందని భావిస్తున్నానని అన్నారు.

మరో రిపోర్టులో 6.7% వృద్ధి

2017–18లో భారత్ 6.7 శాతం వృద్ధితో సరిపెట్టుకోవచ్చని ప్రపంచ బ్యాంకు దక్షిణ ఆసియా రీజినల్ ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఈ వృద్ధి రేటు 7.1 శాతంగా ఉన్న విషయం తెలిసిందే. ప్రయివేటు పెట్టుబడులు పడిపోవడంతో పాటు బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న మొండి బాకీల బెడద, కార్పొరేట్ రుణాల భారం లాంటివి ప్రస్తుత ఆర్థిక సంవత్సర వృద్ధి రేటుపై ఒత్తిడి పెంచాయి. ఈ పరిణామాలకు తోడు వస్తు సేవల పన్ను అమలు వల్ల కంపెనీల బ్యాలెన్స్ షీట్లపై ప్రభావం పడింది.

ఆర్థిక విధానాలు కొనసాగాలి..

ఇకపై కూడా వృద్ధి రేటను పెంపొందించడానికి, వ్యాపారంలో స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించడానికి ఆర్థిక పాలసీలను కొనసాగించాలని కోసె పేర్కొన్నారు. అయితే కొన్ని తాత్కాలిక భంగపాట్లు ఉన్నాయని అన్నారు. స్థూలంగా అన్నిటిలో అన్నీ కూడా బాగా పని చేస్తున్నాయన్నారు. భారత్ ఆరోగ్యవంతమైన 7 శాతం వృద్ధి రేటు సాధించడానికి విస్తృతావకాశాలు ఉన్నాయన్నారు. ఇంతకంటే మెరుగైన వృద్ధి సాధించడానికి వీలుందన్నారు.

అడ్డంకులను తొలగించాలి..

పెట్టుబడులకు మద్దతు నిచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోసె పేర్కొన్నారు. మొండి బాకీల నియంత్రణ, ఉత్పత్తిపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. దేశంలో సెకండరీ విద్యా పూర్తి చేసిన వారి శాతం ఎక్కువగా ఉందని, వీరిని ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు ఉపయోగించుకోవాలన్నారు. కార్మిక మార్కెట్‌లో సంస్కరణలను మరింత పెంచాలన్నారు. అదే విధంగా విద్యా, వైద్య రంగంలో సంస్కరణలు చేపట్టాలని పేర్కొన్నారు. కాగా పెట్టుబడులకు ఉన్న అడ్డంకులు తొలగించాలని అన్నారు.

భౌగోలికంగా ఇతర దేశాల కంటే భారత్‌కు ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. అదే విధంగా మహిళ కార్మికుల భాగస్వామ్యం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర వర్ధమాన దేశాలతో పోల్చితే భారత కార్మిక రంగంలో ఇప్పటికీ మహిళల పాత్ర తక్కువగా ఉందన్నారు. నిరుద్యోగ యువతను తగ్గించడం చాలా కష్టమన్నారు. అదే విధంగా ప్రయివేటు పెట్టుబడులను పెంచాలన్నారు. బ్యాంకుల ఆస్తుల నాణ్యత లాంటి సమస్యలు తెలిసినవేనన్నారు.

మారుతి సుజుకి కార్ల ధరల పెంపు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి ధరలు పెంచుతున్నట్లు ప్రకటించింది. అన్ని మోడళ్లపై రూ.1700 నుంచి రూ.17,000 వరకు ధరలు పెంచింది. ముడి సరుకుల ధరలు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ కంపెనీ తెలిపింది. అదే విధంగా కమొడిటీ, అడ్మినిస్ట్రేటివ్, డిస్ట్రిబ్యూషన్ వ్యయాలు పెరిగాయని పేర్కొంది. పెంచిన ధరలు వెంటనే అమల్లోకి వస్తాయని తెలిపింది. వెంటనే పెంచిన ధరలు అమల్లోకి వస్తాయని కంపెనీ తెలిపింది. ఈ కంపెనీ కార్ల ధరలు రూ.2.45 లక్షల నుంచి రూ.11.29 లక్షల మధ్య శ్రేణిలో ఉన్నాయి.

చమురుకు 'నోట్ల' దెబ్బ

న్యూఢిల్లీ : దేశంలో చమురు వినియోగం పడిపోయిందని ఒక నివేదికలో వెల్లడయ్యింది. నోట్ల రద్దుకు తోడు జిఎస్‌టి అమలు నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనపడటంతో చమురు వినియోగంలో స్తబ్దతత చోటు చేసుకుందని చమురు మంత్రిత్వశాఖకు చెందిన పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనలిస్టు సెల్ ఒక నివేదికలో వెల్లడించింది. 2017లో చమురు ఉత్పత్తుల వినియోగం కేవలం 2 శాతం పెరిగి 200 మిలియన్ టన్నులకు పరిమితమయ్యింది. 2013 తర్వాత ఇంత తక్కువగా పడిపోవడం ఇదే తొలిసారి. ఆ ఏడాది చమురు డిమాండ్ 1.7 శాతానికి క్షీణించింది. 2016 నవంబర్‌లో కేంద్రం చేపట్టిన నోట్ల రద్దు ప్రక్రియ గతేడాది ప్రథమార్థంలో చమురు డిమాండ్‌ను భారీగా దెబ్బతీసిందని ఆయిల్ ప్రొడక్ట్ అనలిస్టు నెవిన్ నాహ్ పేర్కొన్నారు. ద్వితీయార్థంలో జిఎస్‌టి తీవ్ర ప్రభావం చూపిందన్నారు. ఈ రెండు పరిణామాలు చమురు వినియోగం పడిపోవడానికి దోహదం చేశాయన్నారు. మొత్తం చమురు విని యోగంలో డీజిల్ 40 శాతం వాటాను కలిగి ఉంది.

వర్తమానాంశాలు : అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ పోటీ పరీక్షల ప్రత్యేకం

2017 సాకర్ ఉత్తమ ఆటగాడు ఎవరు?



ఎ. ఉమామహేశ్వరరావు
సబ్జెక్టు నిపుణులు, తెనాలి.
సెల్ : 9985288150

చైనా, పాక్, అఫ్గాన్ విదేశాంగ మంత్రుల భేటీ



చైనా, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ విదేశీ వ్యవహారాల మంత్రుల తొలి త్రైపాక్షిక సమావేశం డిసెంబర్ 26న బీజింగ్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఉగ్రవాదులతో సంబంధాలు కలిగిన సంస్థలు, బృందాలు, వ్యక్తులకు తమ భూభాగాల్లో ఆశ్రయం కల్పించరాదని మూడు దేశాలు తీర్మానించాయి. సమావేశానికి అధ్యక్షత వహించిన చైనా విదేశీ వ్యవహారాల మంత్రి వాంగ్ యి మాట్లాడుతూ అఫ్గానిస్థాన్ ఒప్పుకుంటే చైనా–పాకిస్థాన్ ఆర్థిక నడవా (సిపిఈసి)ను అఫ్గాన్ వరకూ విస్తరిస్తామని ప్రతిపాదించారు.

ఈజిప్ట్ మాజీ అధ్యక్షుడికి మూడేళ్లు జైలు

న్యాయ వ్యవస్థను దూషించినందుకు ఈజిప్ట్ మాజీ అధ్యక్షుడు మొహమ్మద్ మోర్సీకి ఆ దేశ న్యాయస్థానం డిసెంబర్ 30న మూడేళ్ల జైలుశిక్షతోపాటు 20 లక్షల పౌండ్ల జరిమానా విధించింది.

ప్రపంచ ర్యాపిడ్ టైటిల్ నెగ్గిన విశ్వనాథన్ ఆనంద్



ప్రపంచ ర్యాపిడ్ టైటిల్ నెగ్గిన విశ్వనాథన్ ఆనంద్

ఐదుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిల్ గెలుచుకున్నాడు. రియాద్‌లో డిసెంబర్ 28న ముగిసిన పోటీలో వ్లాదిమర్ ఫెడసీవ్ (రష్యా)ను ఆనంద్ ఓడించాడు. టైటిల్ నెగ్గిన ఆనంద్‌కు రూ.1.6 కోట్ల ప్రైజ్‌మనీ దక్కింది.

లైబీరియా కొత్త అధ్యక్షుడిగా జార్జ్ వేహ్

లైబీరియాలో జరిగిన ఎన్నికల్లో దేశ అధ్యక్షుడిగా జార్జ్‌వేహ్ ఎన్నికైనట్లు ఎన్నికల బోర్డ్ డిసెంబర్ 29న ప్రకటించింది. ఆయన జనవరి 22న అధ్యక్ష పదవి చేపట్టనున్నారు.

గుజరాత్ సీఎంగా రూపానీ ప్రమాణస్వీకారం

గుజరాత్ ముఖ్యమంత్రిగా విజయ్ రూపానీ వరుసగా రెండోసారి డిసెంబర్ 26న ప్రమాణస్వీకారం చేశారు. ఉప ముఖ్యమంత్రిగా నితిన్ పటేల్, మరో 18 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, ఆ పార్టీ అగ్రనేత ఎల్‌కే అద్వానీ, పలువురు కేంద్రమంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, బీహార్ సిఎం నితీశ్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

విదేశాంగ కార్యదర్శిగా విజయ్ గోఖలే

సీనియర్ దౌత్యవేత్త విజయ్ కేశవ్ గోఖలే భారత విదేశాంగ శాఖ కార్యదర్శిగా జనవరి 1న నియమితులయ్యారు. గోఖలే రెండేళ్లపాటు పదవిలో కొనసాగుతారు.

ఏపీ డీజీపీగా మాలకొండయ్య



ఆంధ్రప్రదేశ్ నూతన డీజీపీగా డాక్టర్. ఎం.మాలకొండయ్య డిసెంబర్ 31న బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ మాన్యువల్ ఆధారంగా నేర నియంత్రణకు కృషి చేస్తానన్నారు.

హిమాచల్ సిఎంగా ఠాకూర్ ప్రమాణస్వీకారం

హిమాచాల్‌ప్రదేశ్ 14వ ముఖ్యమంత్రిగా జైరాం ఠాకూర్ డిసెంబర్ 27న ప్రమాణస్వీకారం చేశారు. ఆయనతోపాటు 11 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానితోపాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

మణిపూర్ వర్శిటీలో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్

105వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌కు ఇంపాల్‌లోని మణిపూర్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ మేరకు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ డిసెంబర్ 27న ప్రకటన చేసింది. సైన్స్ కాంగ్రెస్ మార్చిలో జరగనుంది.

సూపర్‌సోనిక్ క్షిపణి పరీక్ష విజయవంతం



స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన అడ్వాన్స్‌డ్ ఎయిర్ డిఫెన్స్ (ఏఏడీ) సూపర్‌సోనిక్ క్షిపణిని భారత్ డిసెంబర్ 28న ఒడిశాలోని బాలాసోర్ నుంచి విజయవంతంగా పరీక్షించింది. దీనికి 30 కిలోమీటర్ల ఎత్తులో శత్రుక్షిపణిని నేలకూల్చే సామర్థ్యం ఉంది.

ఏపీ పోలీస్ యాక్ట్‌ను సవరిస్తూ ఆర్డినెన్స్

డీజీపీని ఎంపిక చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉండేలా ఆంధ్రప్రదేశ్ పోలీస్ యాక్ట్‌ను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 26న ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ (రిఫార్మ్స్ అండ్ అడ్మినిస్ట్రేటివ్) ఆర్డినెన్స్ నవంబర్ 4–2017 జారీ అయ్యింది. ఆర్డినెన్స్‌కు డిసెంబర్ 25న గవర్నర్ నరసింహన్ ఆమోదముద్ర వేసినట్లు ప్రభుత్వం పేర్కొంది.

హిజ్రాలకు ప్రత్యేక విధానం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిసెంబర్ 30న హిజ్రా (ట్రాన్స్‌జెండర్స్)ల కోసం ప్రత్యేక విధానం ప్రకటించింది. ఈ విధానంలో భాగంగా 18 సంవత్సరాలుపైబడిన హిజ్రాలకు నెలకు రూ.1500 అందించనుంది.

రంజీ ట్రోఫీ గెలుచుకున్న విదర్భ

విదర్భ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ విజేతగా నిలిచింది. ఇండోర్‌లో జనవరి 1న జరిగిన ఫైనల్లో ఢిల్లీపై విదర్భ విజయం సాధించింది. ప్రైజ్‌మనీగా విదర్భకు రూ.2 కోట్లు దక్కింది.

★

తెలుసుకోండి మీ నాలెడ్జ్

1. 2017కి గానూ 'రాయల్‌కప్' ఏషియన్ టూర్ టైటిట్ విజేత శివకుమార్. అతడు ఏ క్రీడకు సంబంధించిన వ్యక్తి ?
ఎ. షూటింగ్ బి. బిలియర్డ్స్
సి. గోల్ఫ్ డి. జిమ్నాస్టిక్స్

2. 78వ 'ఇండియన్ హిస్టరి కాంగ్రెస్-2017' సదస్సును ఎక్కడ నిర్వహించారు ?
ఎ. ఉస్మానియా యూనివర్శిటీ (హైదరాబాద్)
బి. జాదవ్‌పూర్ యూనివర్శిటీ (కోల్‌కతా)
సి. షేర్–ఎ–కశ్మీర్ యూనివర్శిటీ (శ్రీనగర్)
డి. బర్కతుల్లా యూనివర్శిటీ (భూపాల్)

3. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ కల్చర్ రిలేషన్స్‌కు నూతన అధ్యక్షుడు ?
ఎ. వినయ్ సహస్ర బుద్దే బి. లోకేశ్ చంద్ర
సి. ప్రతిష్టశర్మ డి. నజ్మా హెప్తుల్లా

4. 2018 మార్చిలో 105వ సైన్స్ కాంగ్రెస్ సమావేశానికి ఆతిధ్యమిస్తున్నది ?
ఎ. ఉస్మానియా యూనివర్శిటీ (హైదరాబాద్)
బి. మణిపూర్ యూనివర్శిటీ (ఇంఫాల్)
సి. శ్రీవెంకటేశ్వర యూనివర్శిటీ (తిరుపతి)
డి. ఫిజికల్ రీసెర్చ్ లేబరేటరీ (అహ్మదాబాద్)



5. 2018 జనవరి 12న కార్టోశాట్-2 సహా -31 ఉపగ్రహ ప్రయోగాలకు ఇస్రో ఉపయోగిస్తున్న వాహక నౌక ?
ఎ. పిఎస్‌ఎల్‌వి–సి36 బి. పిఎస్‌ఎల్‌వి–సి40
సి. పిఎస్‌ఎల్‌వి–సి342 డి. పిఎస్‌ఎల్‌వి–సి39

6. హిమాచల్ ప్రదేశ్ నూతన ముఖ్యమంత్రి ?
ఎ. జయప్రకాశ్ నడ్డా బి. ప్రేమ్‌కుమార్ దుమాల్
సి. జైరామ్ ఠాకుర్ డి. సత్పాల్ సింగ్ సాధి

7. సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని ఇటీవల ఏ రాష్ట్రంలో ఆరు నెలలపాటు పొడిగించారు?
ఎ. త్రిపుర బి. నాగాలాండ్
సి. మణిపూర్ డి. మేఘాలయ

8. దేశ చరిత్రలో తొలిసారి ప్రపంచ చెస్ టోర్నీకి ఆతిధ్యం ఇవ్వడం ద్వారా ప్రాచుర్యం పొందిన దేశం?
ఎ. లిబియ బి. ఖతార్
సి. సౌదీ అరేబియా డి. ఘనా

9. 2018 జనవరి 1 నుంచి విఎటి (వాల్యూ ఆడెడ్ ట్యాక్స్‌ను ప్రవేశ పెట్టిన దేశాలు?
ఎ. సౌదీ అరేబియా, యుడి
బి. కెన్యా, దక్షిణాఫ్రికా
సి. గ్రీసు, వెనిజులా
డి. ఇతియోఫియా, గ్రీసు


10. జింబాబ్వే నూతన ఉపాధ్యక్షుడు ?
ఎ. అబ్దుల్లాహి ఫర్మాజో బి. ఒమర్ ఆల్ బషీర్
సి. సెబాస్టియన్ పినెం డి. కాన్‌స్టాంటిన్ చివేగా

11. మాలి నూతన ప్రధాని ?
ఎ. ఇబ్రహీం జయితా బి. బొబయ్‌మైగా
సి. మిచెల్లి బాబ్‌లెట్ డి. సెబాస్టియన్ పినెరా

సమాధానాలు : 1.సి, 2.బి, 3.ఎ, 4.బి, 5.బి, 6.సి, 7.బి, 8.సి, 9.ఎ, 10.డి, 11.బి,

బిట్ బ్యాంక్

1. 2017కి గానూ పురుషుల విభాగంలో ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ విజేత **- విశ్వనాథన్ ఆనంద్ (ఇండియా)**
2. 2017కి గానూ మహిళల విభాగంలో ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ విజేత **- జువెన్‌జున్ (చైనా)**
3. గ్లోబ్ సాకర్ అవార్డ్స్–2017 ఉత్తమ సాకర్ ఆటగాడిగా ఎవరు ఎంపికయ్యారు **- క్రిస్టియానా రొనాల్డో**
4. ఢిల్లీపై గెలుపొంది 2017–18 రంజీ ట్రోఫీ చాంపియన్‌గా నిలిచిన జట్టు **- విదర్భ**
5. రంజీ ట్రోఫీ ఫైనల్లో హ్యాట్రిక్ సాధించిన రెండో బౌలర్ రజనోస్ గుర్బాని (విదర్భ). అయితే 1972–73లో ఈ ఘనత సాధించిన తొలి బౌలర్ **- కళ్యాణ సుందరం (తమిళనాడు)**
6. క్రికెట్ చరిత్రలో తొలిసారిగా నాలుగు రోజుల టెస్ట్ మ్యాచ్‌ను ఏ రెండు దేశాల మధ్య నిర్వహించారు **- దక్షిణాఫ్రికా - జింబాబ్వే**
7. 2018 జనవరి 12–16 వరకూ 22వ జాతీయ యువజన ఉత్సవాలు ఏ నగరంలో వేదికగా నిర్వహించనున్నారు **- జైపూర్ (రాజస్థాన్)**
8. 2017 డిసెంబర్ 27–31 వరకూ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఆతిథ్యం ఇచ్చిన నగరం **- గాంధీనగర్ (గుజరాత్)**
9. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2018 సంవత్సరాన్ని ఏ విధంగా ప్రకటించింది **- తెలుగు అభివృద్ధి సంవత్సరం**
10. 2017 డిసెంబర్ 29న నిర్మలా సీతారామన్ సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆపర్చునిటీస్ అండ్ లెర్నింగ్ కేంద్రాన్ని ఎక్కడ ప్రారంభించారు **- మంగళూరు (కర్ణాటక)**
11. 2017కి గానూ పిఇటిఎ 'పర్సన్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపికైన బాలీవుడ్ నటి అనుష్క శర్మ **- పిఇటిఎను విస్తరించండి- పీపుల్ ఫర్ ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్**
12. పాసింజర్ రైళ్లకు ఎప్పటిలోగా బయోటాయ్‌లెట్లను 100 శాతం అమర్చాలని కేంద్రం నిర్ణయించింది **- 2019 మార్చి**



13. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ 2017కుగానూ వెలువరించిన 'శాంతి అనుకూల సూచి'లో తొలి మూడు స్థానాలు పొందిన దేశాలు వరుసగా **- స్వీడన్, స్విట్జర్లాండ్, ఫిన్లాండ్**
14. 2017 డిసెంబర్ 31న బహిరంగ మలవిసర్జన రహిత రాష్ట్రంగా దేన్ని ప్రకటించారు **- అరుణాచల్‌ప్రదేశ్**
15. కూరగాయలకు కనీస మద్దతు ధర ప్రకటించడం ద్వారా ఆ ప్రత్యేకత పొందిన తొలిరాష్ట్రంగా నిలిచింది **- హర్యాన**
16. 2018 జనవరి 1న తెలంగాణ పోలీస్ శాఖ ప్రవేశపెట్టిన టిఎస్‌కాప్ యాప్ ద్వారా ఎన్నిరకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి **- 54**
17. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ 2017కిగానూ వెలువరించిన శాంతి అనుకూల సూచిలో భారత్ ర్యాంకు **- 90**
18. ఆంధ్రప్రదేశ్ నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) **- మాలకొండయ్య**
19. లైబిరియా నూతన అధ్యక్షుడు **- జార్జివా**
20. 2017 డిసెంబర్ 26న భారత్ ఏ దేశానికి ఒక మిలియన్ డాలర్ల మానవతాపరమైన వైద్య సహాయం అందించాలని నిర్ణయించింది **- యెమన్**

విద్యుత్ కాంట్రాక్టు వర్కర్లపై నిర్లక్ష్యం తగదు : బాలకాశి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వం విద్యుత్ కాంట్రాక్టు వర్కర్లపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకాశి విమర్శించారు. రెండు రోజులపాటు గుంటూరులో నిర్వహించే వర్కర్ల రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు బుధవారం స్థానిక బ్రాడీపేటలోని కొరటాల మీటింగ్ హాల్లో ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా బాలకాశీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 24 వేల మంది విద్యుత్ కాంట్రాక్టు వర్కర్లున్నారని తెలిపారు. మూడు న్నరేళ్ల రాష్ట్ర ప్రభుత్వ పాలనలో కార్మికులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు.



సత్యాగ్రహ దీక్ష
పశ్చిమగోదావరి జిల్లా పోలవరంలోని స్థానిక భాను థియేటర్ ఆవరణలో బుధవారం నిర్వహించిన సత్యాగ్రహ దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి

అమృత విశ్వవిద్యా పీఠంకు ఫిబ్రవరిలో శంకుస్థాపన

రాజధాని పనులపై సిఎం సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిలో అమృత విశ్వవిద్యా పీఠం నిర్మాణ పనులకు ఫిబ్రవరి మొదటి వారంలో శంకుస్థాపన చేయాలని నిర్ణయించారు. బుధవారం ఉండవల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధాని పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అమృత యూనివర్శిటీ ఆకృతులు, మాస్టర్‌ప్లాన్‌ను సిఎం పరిశీలించారు. సుమారు 200 ఎకరాల్లో నిర్మించే ఆ యూనివర్శిటీలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ విభాగాలుంటాయి. ఆగస్టు నుంచి తరగతులు మొదలు కానున్నట్టు సిఆర్‌డిఏ అధికారులు సిఎంకు వివరించారు. ఈ సందర్భంగా అమృత విశ్వవిద్యా పీఠం ప్రతినిధులు శంకుస్థాపన కార్యక్రమానికి సిఎంను ఆహ్వానించారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి, ఇండో యూకే ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్, బ్రహ్మకుమారీ విశ్వశాంతి కేంద్రం ప్రతినిధులు సిఎంను కలిసి అమరావతిలో నిర్మించే భవనాల ఆకృతులను, పనుల వివరాలను వివరించారు. అందరికీ క్యాంపస్‌లు, భవనాలు ఐకానిక్‌గా ఉండాలని, షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేయాలని సిఎం వారికి స్పష్టం చేశారు. అమరావతిలో నిర్మించే కళాగ్రామానికి సంబంధించిన ప్రజంటేషన్‌ను కూడా సిఎం పరిశీలించారు. ఎన్టీఆర్ కళావేదిక అమ్యూజ్‌మెంట్ పార్క్, ప్రదర్శన కేంద్రం, నదీ తీర అభివృద్ధిని చేపట్టనున్నారు. ఏప్రిల్ రెండో వారంలో నిర్వహించే అర్బన్ ఇన్నోవేషన్ సమ్మిట్ గురించి అధికారులు సిఎంకు వివరించారు. పట్టణ ప్రణాళిక, సాంకేతికతకు సంబంధించిన ఆలోచనలను అధికారులు వివరించారు.

టిడిపి ప్రభుత్వాన్ని దిగ్బంధిస్తాం

- జన్మభూమి పేరుతో రాక్షస కమిటీలు పని చేస్తున్నాయి
- వెనుకబడిన ప్రాంతాల హామీ అమలు చేయాల్సిందే
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు



కర్నూలు జిల్లా ఆలూరులో బహిరంగసభకు హాజరైన ప్రజలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర విభజన నేపథ్యంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే టిడిపి ప్రభుత్వాన్ని దిగ్బంధిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు హెచ్చరించారు. కడప ఉక్కు పరిశ్రమ, కర్నూలు జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణంలో ఇచ్చిన హామీల కోసం ఆందోళనలు చేసినా ప్రభుత్వం స్పందించలేదని పేర్కొన్నారు. సిపిఎం కర్నూలు జిల్లా 21వ మహాసభలు బుధవారం ఆలూరులో ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ మహాసభలలో తొలిరోజు భారీ ప్రదర్శన నిర్వహించారు. తొలుత ఆలూరులోని సాయిబాబా దేవాలయం నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన కొత్తబస్టాండ్, పాతబస్టాండ్, గుంతకల్లు రోడ్డు మీదుగా జూనియర్ కళాశాల మైదానం వరకూ సాగింది. అనంతరం సిపిఎం జిల్లా నాయకులు పి.హనుమంతు అధ్యక్షతన బహిరంగసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పి.మధు మాట్లాడారు. రాయలసీమ సమస్యలు పరిష్కరించాలని గతేడాది బంద్‌కు పిలుపునిచ్చామని, జాతాలు నిర్వహించినా పాలకులు స్పందించలేదని చెప్పారు. ఈ ఏడాదైనా జిల్లాలో వెనుకబడిన ఆదోని, ఆలూరు, ఆస్పరి, పత్తికొండ ప్రాంతాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పేదలు, దళితుల భూములు లాక్కొని కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెడుతున్నారని విమర్శించారు. పింఛన్, రుణం ఏది కావాలన్నా జన్మభూమి కమిటీలను అడగాలని చెబుతున్నారని, అవి రాక్షస కమిటీలుగా పని చేస్తున్నాయని చెప్పారు. ఈ ప్రభుత్వానికి పోయే కాలం దగ్గరకొచ్చిందని విమర్శించారు. సోలార్, పవన విద్యుత్ పేరుతో జిల్లాలో కూడా వేలాది ఎకరాలు లాక్కున్నారని తెలిపారు. రైతులకు అంతో ఇంతో రక్షణగా ఉండే 2013 భూసేకరణ చట్టాన్ని సవరించి భూములు కొల్లగొడుతున్నా ప్రతిపక్షం చోద్యం చూస్తోందని విమర్శించారు. రైల్వేజోన్, సెంట్రల్ యూనివర్సిటీ, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, వెనుకబడిన రాయసీమకు ప్రత్యేక ప్యాకేజీ లాంటి విభజన చట్టంలో ఉన్న వాటిని ఇంతవరకు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వంలో దళితులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మైనార్టీలు, క్రైస్తవులపై దాడులు పెరిగిపోయాయని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకూ సిపిఎం అండగా ఉంటుందన్నారు. అనంతరం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ మాట్లాడారు. రూ.50 వేల కోట్లతో సాగునీటి ప్రాజెక్టులు చేపట్టామని సిఎం చంద్రబాబునాయుడు చెబుతున్నారని, తాగేందుకు నీరు లేని నగరడోణ లాంటి ప్రాంతాల్లో రిజర్వాయర్‌ను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. దశాబ్దాల తరబడి ఆలూరు ప్రాంతానికి అన్యాయం జరుగుతోందన్నారు. ఈ ప్రాంతంలో పది రోజులకోసారి తాగునీరు వస్తాయని తెలిపారు. వేదవతి, నగరడోణ రిజర్వాయర్లు చేపడితే ఈ ప్రాంతం సస్యశ్యామలవుతుందని చెప్పారు. నాలుగేళ్లలో వేదవతిని ఎందుకు చేపట్టలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజల కోసం కాకుండా కేవలం ధనవంతుల కోసం పని చేస్తున్నారని విమర్శించారు. ఈ ప్రాంత సమస్యలపై ఉద్యమించాలని కోరారు. రాష్ట్ర కమిటీ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల రైతులు కూలీలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతానికే చెందిన ఏడుగురు కూలీలు నల్గొండకు బతుకుదెరువు కోసం వెళ్లి తిరిగొస్తూ ప్రమాదానికి గురై మృతి చెందినా, వారి గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి టిడిపి, వైసిపి కలిసి రావాలని ఎర్రజెండా పిలుస్తోందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, స్థానిక నాయకులు మల్లేష్ మాట్లాడారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.షడ్రక్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు, రమేష్‌కుమార్, గౌస్‌దేశాయ్, బళ్లారి జిల్లా కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు అలివేలమ్మ పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

చట్ట ప్రకారం కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు

ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

ప్రజాశక్తి - గాంధీనగర్ (విజయవాడ)

విజయవాడ రైల్వే స్టేషన్‌లో పని చేస్తున్న పారిశుధ్య కాంట్రాక్టు కార్మికులకు చట్ట ప్రకారం వేతనాలు చెల్లించాలని ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిఆర్ఎం కార్యాలయం వద్ద రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన బుధవారం ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, రైల్వే బోర్డు జిఒ ప్రకారం రోజుకు ఒక్కో కార్మికునికి రూ.448 వేతనం ఇవ్వాల్సి ఉందని, అయితే రోజుకి రూ.200 చొప్పున నెలకు రూ.ఆరు వేలు మాత్రమే చెల్లిస్తున్నారని చెప్పారు. రెండు నెలలు బకాయిపడ్డ వేతనాలను తక్షణమే మంజూరు చేయాలన్నారు. ప్రతి నెలా ఏడో తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, ఇఎస్ఐ, పిఎఫ్ కార్మికుల ఖాతాలో జమ చేసి పే స్లిప్స్, ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వివిఎల్.రసింహులు మాట్లాడుతూ.. కార్మికులకు పనిముట్లు, యూనిఫారాలు పంపిణీ చేయాలన్నారు. కాంట్రాక్ట్ మారిన ప్రతిసారీ కార్మికులను తొలగించకుండా వారినే కొనసాగించేలా చట్ట భద్రత కల్పించాలన్నారు. నిబంధనలు పాటించని కాంట్రాక్టరుపై రైల్వే యాజమాన్యం చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలన్నారు.

గుంటూరు చానల్ పొడిగించాలని దీక్ష

ప్రజాశక్తి - పెదనందిపాడు (గుంటూరు)

గుంటూరు ఛానల్‌ను ప్రకాశం జిల్లా పర్చూరు వరకు పొడిగించి 50 గ్రామాలకు తాగునీరు, 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘాలు గుంటూరు జిల్లా పెదనందిపాడులో బుధవారం దీక్షలు చేపట్టారు. దీక్షలో నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు మాట్లాడుతూ.. గుంటూరు ఛానల్ పొడిగింపు అంశంలో ఎన్నో ఏళ్లుగా విజ్ఞప్తులు చేస్తున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదని, ఇంకెన్నేళ్లు ఎదురు చూడాలని ప్రశ్నించారు. కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొత్తా శివనాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వాల తీరుతో ఈ ప్రాంత ప్రజల దుస్థితి రోజురోజుకూ దిగజారుతోందని ఆవేదన వెలిబుచ్చారు. దీక్షలను సందర్శించిన ఎంపిపి నగరాజకుమారి మాట్లాడుతూ.. రైతుల సమస్యలు వినడానికి ఇరిగేషన్ శాఖ మంత్రి త్వరలోనే అవకాశం కల్పిస్తారని, ఈ మేరకు తమకు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం దీక్షలను వైస్ ఎంపిపి ఎన్.బాలకృష్ణ విరమింపజేశారు. దీక్షల్లో పలు సంఘాల నాయకులు ఎం.మధుసూదనరావు, రావి జగన్నాథం, ఎంఎస్.బాబు, వై.అంకమ్మచౌదరి, ఎం.రాఘవయ్య, హరిబాబు పాల్గొన్నారు.

లిక్కర్ యాజమాన్యంతో సిఐటియు చర్చలు విఫలం

కార్మికుల సమ్మె కొనసాగింపు

ప్రజాశక్తి-గంపలగూడెం (కృష్ణాజిల్లా)

కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ కృష్ణాజిల్లా గంపలగూడెం మండలం చింతల నర్వలో ఉన్న శర్వాణి ఆల్కో బ్రో లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం నాటికి ఆరో రోజుకు చేరింది. ఈ నేపథ్యంలో నాయకుల బెదిరింపులతో 30 మంది కార్మికులు ఫ్యాక్టరీలోకి వెళ్లారు. మిగిలిన 180 మంది కార్మికులు విధులను బహిష్కరించి ఫ్యాక్టరీ ముందు బైటాయించారు. వేతనాల కోసం కంపెనీ కాంట్రాక్టర్లతో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు ఎన్‌సిహెచ్ సుప్రజ చర్చలు జరిపారు. కార్మికుల తరపున రూ.230 వేతనం పెంచాలని డిమాండ్‌ను యాజమాన్యం ముందుంచారు. అయినప్పటికీ యాజమాన్యం ముందు నుంచి చెబుతూ వస్తున్నట్లుగా రూ.200 వేతనం ఇచ్చేందుకు అంగీకరించింది. మరికొంత పెంచాలని వారి దృష్టికి తీసుకెళ్లగా తిరస్కరించారు. దీంతో కార్మికులు సమ్మెను కొనసాగించాలని నిర్ణయానికి వచ్చారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కుటుంబ రావు, తదితరులు కార్మికులకు సంఘీభావంగా పాల్గొన్నారు.


ప్రజ్ఞ
జవాబులు
1. 7.3 శాతం, 2. మతుంగ రైల్వే స్టేషన్ (ముంబయి డివిజన్), 3. ఏ.ఆర్. రెహమాన్ 4. జనవరి 10, 5. ఢిల్లీ

ప్రకాశం, విజయనగరం : సిపిఎం నూతన కమిటీల ఎన్నిక

విజయనగరం జిల్లా కార్యదర్శిగా సూర్యనారాయణ



తమ్మినేని సూర్యనారాయణ



శ్రీరామ్మూర్తి

విజయనగరం జిల్లా కార్యదర్శిగా తమ్మినేని సూర్యనారాయణ మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా రెడ్డి శంకరరావు, టివి.రమణ, వి.లక్ష్మి ఎన్నికయ్యారు. 15 మందితో జిల్లా కమిటీ ఏర్పాటైంది.

విజయనగరం(పార్వతీపురం) జిల్లా కార్యదర్శిగా శ్రీరామ్మూర్తి

విజయ నగరం (పార్వతీపురం) జిల్లా కార్యదర్శిగా రెడ్డి శ్రీరామ్మూర్తిని మహాసభ ఎన్నుకుంది. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా కోలక లక్ష్మణమూర్తి, వి.ఇందిర, రెడ్డి వేణు, కోలక అవినాష్ ఎన్నికయ్యారు. 19 మందితో జిల్లా కమిటీ ఎన్నికైంది.

ప్రకాశంజిల్లా కనిగిరిలో నిర్వహిస్తున్న సిపిఎం 12వ జిల్లా మహాసభలు, విజయనగరం జిల్లా పార్వతీపురంలోని పర్స సత్యనారాయణ నగర్‌లో జరిగిన 8వ జిల్లా మహాసభలు బుధవారం స్ఫూర్తిదాయకంగా ముగిశాయి. రెండు జిల్లాలకు నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కనిగిరి మహాసభలో రెండు రోజులపాటు కార్యదర్శి నివేదికపై జరిగిన చర్చల్లో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. భవిష్యత్‌లో ప్రజాసమస్యలు పరిష్కారానికి, సిపిఎం బలోపేతానికి అవసరమైన కార్యాచరణను రూపొందించుకున్నారు. గ్రూపులుగా చర్చించిన అంశాలను 36 మంది కార్యకర్తలు మహాసభకు ప్రజంటేషన్ ఇచ్చారు. ఉద్యమ అవసరాలు రీత్యా రెండు జిల్లాల్లోనూ రెండు భాగాలుగా విభజించి నూతన కమిటీలను ఎన్నుకున్నారు. మహాసభలు పలు తీర్మానాలను ఆమోదించాయి.

విజయనగరం మహాసభ తీర్మానాలు..

జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి, మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని, కనీస వేతనాలు రూ.18 వేలు ఇవ్వాలని, ఉపాధి పనుల్లో యంత్రాలను రద్దు చేసి అడిగిన వారందరికీ పనులు కల్పించాలని, బలవంతపు భూ సేకరణను రద్దు చేయాలని, రైతు, శ్రామిక మహిళల సమస్యలు పరిష్కరించాలని, జిల్లాలో సంగీత కళాశాలను సాంస్కృతిక విశ్వవిద్యాలయంగా ఏర్పాటు చేయాలని తదితర తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ నర్సింగరావు, ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ప్రజాపునాదిని బలోపేతం చేసుకొని, ఉద్యమాలను తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రజలతో మరింత మమేకం కావాలని, పోరాటాల్లో వారిని భాగస్వామ్యం చేయాలని అన్నారు.

తూర్పు ప్రకాశం జిల్లా కార్యదర్శిగా పూనాటి ఆంజనేయులు



పునాటి ఆంజనేయులు



సయ్యద్ హనీఫ్

తూర్పు ప్రకాశం జిల్లా నూతన కమిటీ కార్యదర్శిగా పూనాటి ఆంజనేయులు తిరిగి ఎన్నికయ్యారు. 27 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శివర్గ సభ్యులుగా.. జాలా అంజయ్య, జివి.కొండారెడ్డి, పెంట్యాల హనుమంతరావు, షేక్ మాబు, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులును నూతన జిల్లా కమిటీ ఎన్నుకుంది. కమిటీ సభ్యులుగా పమిడి వెంకట్రావు, యంయల్‌వి ప్రసాద్, ఎస్‌కె.మున్వర్ సుల్తానా, జి.వెంకటేశ్వర్లు, కాలం సుబ్బారావు, పూసపాటి వెంకట్రావు, జి.రమేష్, మోంద్రు ఆంజనేయులు, సిహెచ్.గంగయ్య, ఎస్ఎ.గౌస్, టి.రాము, ఉబ్బా ఆదిలక్ష్మీ, జి.శ్రీనివాసులు, బి.రఘురామ్, దామా శ్రీనివాసులు, యన్.వెంకటేశ్వర్లు, ఎన్.బాబురావు, ఆర్.వినోద్‌బాబు, కెజి.మస్తాన్‌ను మహాసభ ఎన్నుకున్నారు.

పశ్చిమ ప్రకాశం జిల్లా కార్యదర్శిగా సయ్యద్ హనీఫ్

పశ్చిమ ప్రకాశం జిల్లా కార్యదర్శిగా సయ్యద్ హనీఫ్‌ను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. 17 మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శివర్గ సభ్యులుగా గాలి వెంకట్రామిరెడ్డి, పివి.శేషయ్య, ఎం.రమేష్, డి.సోమయ్య, వి.ఆంజనేయులును నూతన జిల్లా కమిటీ ఎన్నుకుంది. కమిటీ సభ్యులుగా టి.రంగారావు, ఊసా రాజ్యలక్ష్మీ, మాలకొండారెడ్డి, జి.బాలనాగయ్య, కొమ్మాలపాటి మాల్యాద్రి, పిసి.కేశవరావు, పిల్లి తిప్పారెడ్డి, ఊసా వెంకటేశ్వర్లు, టి.ఆవులయ్య, డికెఎం రఫిని మహాసభ ఎన్నుకుంది.

ప్రకాశం జిల్లాలో పలు తీర్మానాలు ఆమోదం

బలవంతపు భూసేకరణ ఆపాలని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులందరికీ పరిహారం ఇవ్వాలని, చట్టసవరణ యత్నాలు మానుకోవాలని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి సాగు, త్రాగునీటి సమస్యలు పరిష్కరించాలని, ప్రకాశం డెయిరీని కాపాడుకోవాలని, ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకోవాలని, జిల్లాలోని 1.50 లక్షల మందికి అసంఘటిత కార్మికుల కనీసవేతనాలు, ఉద్యోగ భద్రత, సాంఘీక భద్రత కల్పించి వారి సంక్షేమానికి సమగ్రచట్టం చేయాలని, దళితులపై దాడులు, వివక్షపై చర్యలు తీసుకోవాలని, ఆక్రమణకు గురైన స్మశానాలు ఇవ్వాలని, ఆక్రమణలో స్మశానాలు జిఓనెం 1235ను అమలు చేయాలనే తీర్మానాలతో పాటు మరికొన్ని తీర్మానాలను ఆమోదించారు.

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్/విజయనగరం ప్రతినిధులు



విజయవాడలోని ప్రకాష్‌నగర్‌లో నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న బిల్డింగ్ వర్కర్స్

అక్రమ అరెస్టులకు ప్రజాసంఘాల నిరసన

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

జన్మభూమి-మావూరు కార్యక్రమంలో కార్మికులకు ఇళ్లు మంజూరు చేయాలని ప్రజా ప్రతినిధులను కలిసి మాట్లాడటానికి వెళ్లుతున్న నాయకులను అక్రమంగా అరెస్టు చేయటాన్ని వివిధ ప్రజాసంఘాలు ఖండించాయి. ఈ మేరకు బుధవారం విజయవాడలోని పలు ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు చేసి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాయి. సిఐటియు సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో గాంధీనగర్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి ఎంవి.సుధాకర్, అధ్యక్షుడు కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్‌లో నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకించారు. కార్యక్రమంలో నగర నాయకులు పి.మాధవ్, బి.రమణ, సిహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సిఐటియు మున్సిపల్ కార్పోరేషన్ యూనియన్ ఆధ్వర్యంలో 54వ డివిజన్ శానిటరీ కార్యాలయం వద్ద, 55వ డివిజన్ అయిత రాములు పాఠశాల ప్రాంగణంలోని శానిటరీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.డేవిడ్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్

ఎఫ్ఆర్‌డిఐ బిల్లుపై అవగాహన కల్పించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ - బిల్లు ఉపసంహరించుకోవాలని తీర్మానం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎఫ్ఆర్‌డిఐ బిల్లు బ్యాంకు ఉద్యోగులకు మాత్రమే నష్టం కాదని, ప్రజలందరికీ నష్టమేనని, దీనిపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ అన్నారు. ఎంబి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'ఎఫ్ఆర్‌డిఐ బిల్లు-ప్రజలపై భారం' అనే అంశంపై బుధవారం సాయంత్రం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బిల్లును ప్రత్యేకం చేసి చూస్తే అర్థం చేసుకోలేమన్నారు. ప్రజల సొమ్మును ప్రయివేటు సంస్థలు కొల్లగొట్టడం ప్రారంభమైందని, వేల కోట్ల విలువ చేసే కెజి బేసిన్ గ్యాస్‌ను కూడా అప్పట్లోనే కారుచౌకగా ప్రయివేటుకు కట్టబెట్టారన్నారు. ప్రజల ఉమ్మడి ఆస్తుల్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వా నిదేనన్నారు. ప్రభుత్వ ఆస్తి మనది కాదనే భావన ప్రజల్లో ఉందని, ఆ భావాన్ని ప్రజలు తొలగించుకుని ప్రభుత్వ సంపదంతా మన ఆస్తేనన్న భావనకు రావాలన్నారు. బ్యాంకులపై ఉన్న నమ్మకాన్ని దెబ్బతీయడం, నష్టాల్లో ఉన్నాయని చెప్పడం ద్వారా ప్రభుత్వం ప్రయివేటీకరణకు ప్రయత్నం చేస్తోందన్నారు. పోరాటాల ద్వారా బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాల్ని కాపాడుకున్నామని, ప్రస్తుతమున్న రక్షణ చట్టాలు చెల్లకుండా ఎఫ్ఆర్‌డిఐ బిల్లు చేస్తుందన్నారు. ఉద్యోగుల్ని తొలగించే ప్రమాదం కూడా ఏర్పడుతుందన్నారు. ఈ బిల్లు ద్వారా ప్రస్తుతం హామీదారుని పాత్ర పోషిస్తున్న ఆర్బీఐ మధ్యవర్తి పాత్రకే పరిమితమవుతుందని, ఇది చాలా అభ్యంతరకరమన్నారు. బ్యాంకు డైరెక్టర్లెవరూ రిస్క్ తీసుకునేందుకు సిద్ధంగా లేరన్నారు. ఎఫ్ఆర్‌డిఐ బిల్లు నుంచి బ్యాంకుల్ని కాపాడుకునేందుకు ప్రజలు తిరగబడడమే సరైన పరిష్కారమన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగించే ఎఫ్ఆర్‌డిఐ బిల్లును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సమావేశంలో తీర్మానం చేశారు. సమావేశంలో ఎంబి విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కెఎస్‌సి బోస్, కార్యదర్శి మురళీకృష్ణ, ఎఐబిఇఎ అధ్యక్ష, కార్యదర్శులు కెవి రంగారావు, వై శ్రీనివాసరావు, టిపిఎ అధ్యక్షులు వి సాంబిరెడ్డి, ఎఐఐఇఎ నాయకులు గిరిధర్, కళాధర్, ఎఐఐపిఎ నాయకులు కనకారావు, ఎపిఆర్‌పిఎ నాయకులు ప్రభుదాస్, విఇఇవి నాయకులు రాజు, బిఇఎఫ్ఐ నాయకులు ఆర్ అజయ్‌కుమార్, ఎపి పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఎ గాంధీ, ఎన్ఎస్‌బిఇ పిసి ప్రకాష్, ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి వైవి ఈశ్వరరావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిలానీ బాషా, సిహెచ్ సుందరయ్య, ఎపి యుటిఎఫ్ నాయకులు మనోహర్, ఎపిఎంఎస్ఆర్‌యు నాయకులు యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు సిబ్బందిని కేటాయించండి

పిఆర్ సర్వీసెస్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన సిబ్బందిని కేటాయించాలని పంచాయతీరాజ్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. పిఆర్సీ బకాయిలు, డిఎ వెంటనే విడుదల చేయాలని అసోసియేషన్ చైర్మెన్ వీరయ్య, ప్రధాన కార్యదర్శి బుచ్చిరాజు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అమరావతి సమీపంలో, జిల్లా కేంద్రాలలో పంచాయతీరాజ్ ఉద్యోగులకు స్థలం కేటాయించాలని, క్రీడల నిర్వహణకు అనుమతి, నియోజకవర్గ అభివృద్ధి అధికారి పోస్టుల మంజూరు, తిరుమలలో పంచాయతీరాజ్ ఉద్యోగుల భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

జన్మభూమిలో 9.49 లక్షల వినతులు

పరకాల ప్రభాకర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జన్మభూమిలో ఇప్పటి వరకూ 80,203 గ్రామసభలు నిర్వహించగా, 9,49,592 వినతులందాయని, 51,48739 మంది హాజరయ్యారని ప్రభుత్వ సలహాదారు పకరాల ప్రభాకర్ తెలిపారు. జన్మభూమి కార్యక్రమంలో తొమ్మిదో రోజు అన్ని జిల్లాలూ సి గ్రేడ్‌నే సాధించాయన్నారు. సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రేడింగ్‌లో కర్నూలు జిల్లా 28 మార్కులతో ముందుంటే కడప జిల్లా 21 మార్కులతో చివరి స్థానంలో ఉందన్నారు.. 1,58,241 రేషన్ కార్డులు, 95,097 పింఛన్లు, 42,174 కళ్లజోళ్లు పంపిణీ చేశామన్నారు. బుధవారం సాయంత్రం వరకు అందిన సమాచారం మేరకు 38645 వినతులు రాగా, 1,83912 మంది ప్రజలు హాజరయ్యారన్నారు. 5592 రేషన్ కార్డులు 3,978 పింఛన్లు, 1,003 ఇళ్లస్థలాలు 728 టూల్ కిట్లు, 1,115 కళ్లజోళ్లు అందజేశారన్నారు.

ఎన్ని ఉద్యోగాలిచ్చారో స్పష్టం చేయాలి

ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వం ఎంతమందికి ఉద్యోగాలిచ్చిందో స్పష్టమైన ప్రకటన చేసి, ప్రజల్లో ఏర్పడిన గందరగోళాన్ని పోగొట్టాలని సిఐటియు రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ నరసింగరావు, ఎంఎ గఫూర్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చిత్తూరు జిల్లాలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మూడేళ్ల కాలంలో తమ ప్రభుత్వం రూ.3.65 లక్షల కోట్ల పెట్టుబడులు, 7.70లక్షల మందికి ఉద్యోగాలు కల్పించినట్లు ముఖ్యమంత్రి చెప్పినట్లు వార్తలొచ్చాయని తెలిపారు.

ఉపాధి అవకాశాలెక్కడ వచ్చాయని కొందరు ప్రశ్నిస్తున్నారని, కళ్లు తెరిచి చూస్తే ఎక్కడ వచ్చాయో తెలుస్తుందని కూడా సిఎం అన్నట్లు వార్తలొచ్చాయని పేర్కొన్నారు. ప్రభుత్వం దగ్గరున్న లెక్కలకు, సిఎం చెప్పిన దానికి ఎక్కడా పొంతన కుదరడం లేదన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోకి ఎన్ని పరిశ్రమలొచ్చాయో, ఎక్కడెక్కడ వచ్చాయో, ఎంతమందికి ఉద్యోగాలొచ్చాయో స్పష్టమైన ప్రకటన చేసి, ప్రజల్లో ఏర్పడిన గందరగోళాన్ని పొగొట్టాలన్నారు. ప్రభుత్వ ఆర్థిక సర్వే గణాంకాల ప్రకారం మొదటి నుంచి ఇప్పటివరకు 13 జిల్లాల మొత్తం చరిత్రలో 2016 డిసెంబర్ నాటికి భారీ, మధ్యతరహా, చిన్న పరిశ్రమలు అన్నీ కలిపితే వచ్చిన పెట్టుబడులు రూ.93,383 వేల కోట్లని, 6,57,291 మందికి ఉపాధి కల్పించారని వివరించారు. ఈ మూడేళ్ల కాలంలో రూ.3.65లక్షల కోట్ల పెట్టుబడులు ఏలా వచ్చాయో, 7.70లక్షల మందికి ఉద్యోగాలు ఎక్కడ కల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రపంచంలో కెల్లా అత్యంత ధనికుడు
అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్

వాషింగ్టన్: ఆన్‌లైన్‌లో ప్రముఖ వ్యాపార సంస్థ అయిన అమెజాన్ అధినేత జెఫ్ బిజెస్ ప్రపంచంలోకెల్లా అత్యంత ధనికుడిగా రికార్డులకెక్కారు. ఈ ఏడాది అమెజాన్ ద్వారా ఆన్‌లైన్ కొనుగోళ్లు 89 శాతం మేర పెరగటంతో ఆయన సంపద మొత్తం 10,500 కోట్ల డాలర్ల స్థాయికి చేరింది. వ్యాపారం పెరుగుదలతో అమెజాన్ సంస్థ షేర్ ధర కూడా 6.6 శాతం మేర పెరగటం ఈ సంపద పెరుగుదలకు మరో కారణంగా చెబుతున్నారు. గడచిన 12 నెలల కాలంలో ఆన్‌లైన్ మార్కెట్‌లో అమెజాన్ సంస్థ 57 శాతం వాటాను సాధించుకున్నట్లు తెలుస్తోంది. 1999లో ప్రపంచంలో అత్యంత సంపన్నుడిగా రికార్డులకెక్కిన బిల్ గేట్స్ తరువాత మళ్లీ ఆ ఘనతను సాధించిన వ్యక్తి బిజోస్ కావటం విశేషం.



డేర్ డెవిల్స్ । రిపబ్లిక్ డే పరేడ్ కోసం బోర్డర్ సెక్యూరిటి ఫోర్స్‌కు చెందిన మహిళా మోటార్ సైకిల్ రైడర్స్ డేర్ డెవిల్స్ ఢిల్లీలో బుధవారం ఉదయాన్నే తీవ్రమైన చలిని సైతం లెక్క చేయకుండా రిహార్సల్స్ నిర్వహిస్తున్న దృశ్యం

మెరుగైన ఆర్థిక వ్యవస్థ కోసమే..!
హెచ్1బి వీసా ఆంక్షలపై అమెరికన్ ఎంపిల ఉవాచ

వాషింగ్టన్: అమెరికా ప్రభుత్వం హెచ్-1బి వీసా హోల్డర్ల పట్ల కఠినంగా వ్యవహరించటం వెనుక ప్రధాన లక్ష్యం అమెరికా ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చటమేనని అమెరికా చట్టసభల సభ్యులు చెబుతున్నారు. హెచ్-1బి వీసాలపై ఆంక్షల ఉద్దేశం ఎవరినీ బలవంతంగా దేశం నుండి పంపివేయటం కాదని వారు స్పష్టం చేస్తున్నారు. దేశంలో స్థిరపడిన ఇతర దేశీయులెవరినీ బలవంతంగా వెనక్కి పంపే ప్రతిపాదనేదీ ప్రభుత్వ పరిశీలనలో లేదని బైపార్టిజన్ కాంగ్రెషనల్ కాకస్ ఆన్ ఇండియా, ఇండియన్ అమెరికన్స్ సహాధ్యక్షురాలు, డెమొక్రాటిక్‌పార్టీ నేత తులసీ గబ్బర్డ్ వివరించారు. హెచ్-1బి వీసా హోల్డర్లెవరినీ వారి దేశాలకు వెనక్కి పంపే ప్రతిపాదనేదీ తమ పరిశీలనలో లేదంటూ అమెరికా వలస వ్యవహారాల విభాగం ప్రకటించిన మరుసటి రోజే ఆమె ఈ వ్యాఖ్యలు చేయటం గమనార్హం. అమెరికన్లకు వృత్తినైపుణ్యం పెంచి వారికి ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నప్పటికీ దేశంలో కొనసాగుతున్న వృత్తి నిపుణుల కొరతను విదేశీయులతో భర్తీ చేయటాన్ని తాము కొనసాగిస్తామని ఆమె వివరించారు. అమెరికన్ పౌరసత్వం కోసం ఎదురుచూస్తున్న హెచ్-1బి వీసా హోల్డర్లను వెనక్కి పంపే ప్రతిపాదనను విరమించుకోవాలని అధ్యక్షుడు ట్రంప్‌ను కోరుతూ గత శుక్రవారం నాడు గబ్బర్డ్‌తో పాటు కాంగ్రెస్ మరో సభ్యుడు కెవిన్ యోడర్ తదితరులు లేఖ రాసిన విషయం తెలిసిందే. వ్యాపార, రాజకీయ వర్గాల నుండి వత్తిడి పెరగటంతో ట్రంప్ ప్రభుత్వం ఈ ప్రతిపాదనను ప్రస్తుతానికి విరమించుకున్నదని ఈ ఇద్దరు నేతలూ ఒక ప్రకటనలో వివరించారు.

సిట్‌తో కల్బుర్గి హత్య కేసు దర్యాప్తు
భార్య ఉమాదేవి దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలిస్తామన్న సుప్రీం

న్యూఢిల్లీ : ప్రముఖ హేతువాది, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఎం.ఎం. కల్బుర్గి హత్యకేసును సుప్రీం లేదా హైకోర్టు రిటైర్డ్ జడ్జి పర్యవేక్షణలో సిట్‌తో దర్యాప్తు చేయించాలని ఆయన భార్య ఉమాదేవి చేసుకున్న అభ్యర్థనను పరిశీలించేందుకు సుప్రీం కోర్టు బుధవారం అంగీకరించింది. కల్బుర్గిని బెంగళూరులోని ఆయన నివాసంలో ఆగస్టు 30, 2015న పట్టపగలు దుండగులు కాల్చి చంపిన సంగతి తెలిసిందే. ఉమాదేవి అభ్యర్థనపై ఆరు వారాల్లోగా స్పందించాలని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఎ), సిబిఐ, కర్ణాటక, మహారాష్ట్ర, గోవా రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీం కోర్టు ధర్మాసనం కోరింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని జస్టిస్ ఎఎం ఖన్విల్కర్, డివై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు నోటీసులు జారీ చేసింది. కల్బుర్గి హత్య సమాజంలోని ప్రతి ఒక్క ఆలోచనాపరుడ్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని ఈ సందర్భంగా ఉమాదేవి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పలు హామీలు ఉన్నప్పటికీ కర్ణాటక పోలీసులు దర్యాప్తును మూడు సంవత్సరాలుగా సాగదీస్తున్నారని ఆమె వాదించారు. ఇక రాష్ట్ర సిఐడి విభాగం అతి పెద్ద అన్వేషణ జరుపుతున్నదని వ్యాఖ్యానించారు. కొల్హాపూర్‌లో ఫిబ్రవరి 16, 2015న గోవింద పన్సారేను, పూనెలో ఆగస్టు 20, 2013న నరేంద్ర దభోల్కర్‌ను హత్య చేసిన వారే తన భర్తను కూడా హత్య చేసి ఉంటారని తాను విశ్వసిస్తున్నట్లు ఆమె తెలిపారు. సమాజంలోని కొన్ని వర్గాల నుంచి ఈ ముగ్గురు బెదిరింపులను ఎదుర్కొన్నారని చెప్పారు. పన్సారే హత్యకు ఉపయోగించిన ఆయుధాన్నే కల్బుర్గి హత్యకూ ఉపయోగించారని ఉమాదేవి తన పిటిషన్‌లో పేర్కొన్నట్లు చెప్పారు. అడ్వకేట్ కృష్ణ కుమార్, అభ్య నేవగిలు ఉమాదేవి తరుపున ప్రాతినిధ్యం వహిస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గోవాలో 2009లో జరిగిన బాంబు పేలుళ్ళలోకూడా తన భర్తను చంపిన హంతకుల ప్రమేయముందని ఆమె తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న దర్యాప్తు చాలా విచారకరంగా ఉన్నదని పేర్కొన్నారు. రిటైర్డ్ సుప్రీం కోర్టు లేదా హై కోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో కర్ణాటక పోలీసులకు చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందంతో దర్యాప్తు జరిపేలా తనకున్న అసాధారణ రాజ్యాంగ అధికారాలతో ఉత్తర్వులు జారీ చేయాలని ఆమె కోరారు.

సిక్కు ఘర్షణల దర్యాప్తుకు కొత్త సిట్ : సుప్రీం

న్యూఢిల్లీ : దేశంలో 1984లో చోటు చేసుకున్న సిక్కు వ్యతిరేక ఘర్షణలకు సంబంధించి దాదాపు 186 కేసులను దర్యాప్తు చేసేందుకు సుప్రీం కోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్)ను నియమించింది. సిక్కు ఘర్షణలకు సంబంధించి ఎటువంటి దర్యాప్తు లేకుండా 186 కేసులను మూసివేసినట్లు కోర్టు నియమించిన పర్యవేక్షణ కమిటీ నివేదికను సమర్పించిన తరువాత సుప్రీం కోర్టు సిట్‌ను ఏర్పాటు చేసింది. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తులు జెఎం పంచల్, కెఎస్‌పి రాధాకృష్ణన్‌లతో గత ఏడాది సుప్రీం కోర్టు ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ 293 కేసులను పరిశీలించింది. దర్యాప్తు జరపని 186 కేసులలో దర్యాప్తు జరిపేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో ఢిల్లీకి చెందిన సిక్కు గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు ఎస్.గుర్లాద్ సింగ్ కహ్లాన్ కోర్టును ఆశ్రయించారు. అంతకుముందు దర్యాప్తు బృందం ఈ కేసుల్లో దర్యాప్తు పూర్తి చేయలేదు, చార్జిషీటు దాఖలు చేయలేదని ఆయన ఆరోపించారు. అంతకుముందు 2015లో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందానికి ఐపిఎస్ అధికారి ప్రమోద్ అస్థాన నేతృత్వం వహించారు. మాజీ జిల్లా న్యాయమూర్తి రాకేష్ కపూర్, అదనపు డిసిపి కుమార్ జ్ఞానేష్‌లు అందులో సభ్యులుగా ఉన్నారు. సుప్రీం కోర్టు బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు కొత్తగా ఏర్పాటు చేసే బృందంలో రిటైర్డ్ హై కోర్టు జడ్జి, పదవిలో ఉన్న ఒక ఐపిఎస్ అధికారి, రిటైర్డ్ ఐపిఎస్ అధికారి సభ్యులుగా ఉన్నారు.

జెఎన్‌యు నుంచి మరో విద్యార్థి అదృశ్యం

న్యూఢిల్లీ : జెఎన్‌యు నుంచి మరో విద్యార్థి అదృశ్యమయ్యాడు. మంగళవారం మధ్యాహ్నం నుంచి లైఫ్ సైన్స్ స్కూల్‌కు చెందిన పిహెచ్‌డి స్కాలర్ ముకుల్ జైన్ కనిపించకుండా పోయాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. ముకుల్ జైన్ చివరిసారిగా జెఎన్‌యు ప్రాంగణం తూర్పు ద్వారం వద్ద మధ్యాహ్నం 12:30 గంటలకు కనిపించాడు. అయితే ఈ అదృశ్యమైన విద్యార్థి జెఎన్‌యుకు చెందిన విద్యార్థి కాదని, ఐజిఎన్ఓయుకు చెందిన విద్యార్థని, తన రిసెర్చ్ గైడ్‌ను కలుసుకోవడానికి జెఎన్‌యుకు వచ్చాడని అంటున్నారు. జైన్ వ్యక్తిగత సమస్యలతో బాధపడుతున్నాడని సౌత్-వెస్ట్ జిల్లాకు చెందిన పోలీస్ అధికారి తెలిపారు. కాగా, 2016లో జెఎన్‌యు విద్యార్థి నజీబ్ అహ్మద్ అదృశ్యమయ్యాడు. ఎబివిపి సభ్యులు క్యాంపస్‌లోనే నజీబ్‌పై దారుణంగా దాడి చేశారు. తరువాత నుంచి నజీబ్ కనిపించడం లేదు. అతని ఆచూకీని ఢిల్లీ పోలీసులు ఇప్పటి వరకూ కనుగొనలేకపోయారు. ఈ కేసును సిబిఐకు బదిలీ చేశారు.

పోలీసుల కాల్పుల్లో యువకుని మృతిపై స్థంభించిన కాశ్మీర్ అసెంబ్లీ
ముఖ్యమంత్రి ప్రసంగాన్ని బహిష్కరించిన ప్రతిపక్షాలు

జమ్మూ : పోలీసు కాల్పుల్లో ఒక యువకుడు మృతి చెందిన సంఘటనపై జమ్మూకాశ్మీర్ అసెంబ్లీలో ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి), కాంగ్రెస్, సిపిఎం, స్వతంత్ర అభ్యర్థులు వెల్‌లోకి వెళ్లి తన నిరసన వ్యక్తం చేశారు. 'అమాయకుల హత్యలు ఆపండి' అనే బ్యానర్ ప్రదర్శించారు. సిపిఎం ఎమ్మెల్యే ఎం వై తరిగామి, ఎన్‌సి, కాంగ్రెస్‌కు చెందిన కొంత మంది ఎమ్మెల్యేలు తమ బెంచ్‌లపై నిలబడి నిరసన తెలిపారు. సభ్యులు ఆందోళన విరమించాలని, తమ సీట్లలో వెళ్లి కూర్చోవాలని స్పీకర్ కవిందర్ గుప్తా కోరారు. ప్రశ్నోత్తరాల సమయం తరువాత దీనిపై ప్రభుత్వం ఒక ప్రకటన చేస్తుందని తెలిపారు. కానీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. గవర్నర్‌కు ధన్యవాదాలు చెబుతూ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ చేయాల్సిన ప్రసంగాన్ని ప్రతిపక్షాలు బహిష్కరించాయి. ఈ ఘటనపై న్యాయ విచారణ జరిపిస్తామని, చట్ట ప్రకారం దోషులను శిక్షిస్తామని ప్రభుత్వం అంటుంది. మాజీ ముఖ్యమంత్రి, ఎన్‌సి నేత ఓమర్ అబ్దుల్లా మాట్లాడుతూ 'కేవలం దినపత్రికల్లోనే ముఖ్యమంత్రి ఆందోళనలను చదువుతాం. కానీ ఆమె ఎప్పుడూ క్షేత్రస్థాయిలోకి వెళ్లరు' అని తెలిపారు. మంగళవారం కుల్గాం జిల్లాలో పోలీసు కాల్పుల్లో ఖాలిద్ హుస్సేన్ దార్ అనే యువకుడు మృతి చెందాడు.

పాట్నా-మొకమా పాసింజర్ రైలుకు ప్రమాదం
మంటల్లో చిక్కుకున్న నాలుగు బోగీలు

పాట్నా : పాట్నా-మొకామా పాసింజర్ రైలు బోగీలలో మంగళవారం రాత్రి భారీగా మంటలు చెలరేగాయి. పాసింజర్ రైలుకు చెందిన నాలుగు బోగీలు మంటల్లో చిక్కుకున్నాయి. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. పాట్నాకు తూర్పున 90 కిలోమీటర్ల దూరంలో మొకామా రైల్వే యార్డ్ లో ఆగిఉన్న పాసింజర్ రైలు బోగిలలో అర్థరాత్రి 1 గంట సమయంలో మంటలు చెలరేగాయని రైల్వేకు చెందిన ప్రతినిధి ఒకరు తెలిపారు. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ దురదృష్ట వశాత్తు అవి మరో రెండు బోగీలకు విస్తరించాయని చెప్పారు. దీని ఫలితంగా మొత్తం నాలుగు బోగీలు పూర్తిగా మంటలలో చిక్కుకున్నాయన్నారు. ఈ ప్రమాదం కారణంగా ఆ మార్గంలో నడిచే రైళ్ళకు ఎటువంటి అంతరాయం కలగలేదని చెప్పారు. ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే అడిషన్ డివిజనల్ రైల్వే మేనేజర్ అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బోగిలో మంటలు వ్యాపించడానికి గల కారణంపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రిటైల్ ట్రేడింగ్‌లో 100 శాతం ఎఫ్‌డిఐలకు కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ : సింగిల్ బ్రాండ్ రిటైల్ ట్రేడింగ్, నిర్మాణ అభివృద్ధిలలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు కేంద్ర మంత్రి వర్గం బుధవారం ఆమోదం తెలిపింది. ఈ పెట్టుబడులకు ప్రభుత్వ అనుమతి అవసరం లేదని కూడా పేర్కొంది. అంతేకాక ఆమోదించిన మార్గాలలో ఎయిరిండియాలో 49 శాతం వాటాలను సొంతం చేసుకునేందుకు విదేశీ విమానయాన సంస్థలను అనుమతిస్తూ ఎఫ్‌డిఐ నిబంధనలలో మార్పులు చేయడానికి కూడా అనుమతించింది. ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని విదేశీ విమాన యాన సంస్థలతో సహా విదేశీ పెట్టుబడులు 49 శాతం మించరాదని, ఎయిరిండియా యొక్క గణనీయమైన యాజమాన్యం, సమర్థవంతమైన నియంత్రణలు భారత్‌లోనే కొనసాగుతాయన్న రెండు షరతులను పేర్కొంటూ ఒక అధికారిక ప్రకటనను విడుదల చేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు వాణిజ్యాన్ని సరళతరం చేసేందుకు ఈ నిర్ణయాలు తోడ్పడతాయని ఆ ప్రకటన పేర్కొంది. అంతేకాక పెద్ద ఎత్తున వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతో పెట్టుబడి, ఆదాయం, ఉపాధిలో వృద్ధి చోటుచేసుకుంటుందని ఆ ప్రకటన పేర్కొంది. రియల్ ఎస్టేట్‌లో జరిగే మధ్యవర్తిత్వ సేవలు రియల్ ఎస్టేట్‌వ్యాపారం కిందకురావు. అందువల్ల ఆటోమేటిక్ మార్గంలో 100 శాతం ఎఫ్‌డిఐలను ఈ రంగంలో అనుమతిస్తున్నట్లు తెలిపింది.



పవర్ ఎక్స్ఛేంజ్‌లో పెట్టుబడులు

ప్రాథమిక మార్కెట్ ద్వారా పవర్ ఎక్స్ఛేంజ్‌లో పెట్టుబడులకు ఎఫ్ఐఐఎస్/ఎఫ్‌పిఐలను అనుమతించాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. పవర్ ఎక్స్ఛేంజ్‌లలో ఆటోమాటిక్ మార్గంలో ఇప్పటి వరకు 49 శాతం ఎఫ్‌డిఐలకు అనుమతి ఉంది. అది కూడా 2010 నాటి సెంట్రల్ ఎలక్ట్రిసిటి రెగ్యులేటరి కమిషన్ (పవర్ మార్కెట్) చట్టం కింద నమోదైన పవర్ ఎక్స్ఛేంజ్‌లకు మాత్రమే ఈ పెట్టుబడుల వర్తిస్తాయని తెలిపింది. అయితే ఎఫ్ఐఐఎస్/ఎఫ్‌పిఐల కొనుగోలుకు సంబంధించి సెకండరీ మార్కెట్‌కు మాత్రమే పరిమితం చేసినట్లు ప్రభుత్వ ప్రకటన పేర్కొంది.

తమిళనాట కొనసాగుతున్న
రవాణా కార్మికుల సమ్మె

- ఏడో రోజుకు చేరుకున్న సమ్మె
- లేబర్ కమిషన్ కార్యాలయాల ఎదుట ధర్నా
- ప్రయాణీకులకు తీవ్ర అసౌకర్యం
- సంక్రాంతి అడ్వాన్స్ బుకింగ్‌లపై అనిశ్చితి

చెన్నై : తమిళనాడులో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన ఉద్యోగులు చేస్తున్న సమ్మె బుధవారానికి ఏడో రోజుకు చేరింది. తమ నిరవధిక సమ్మెలో భాగంగా ఉద్యోగులు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లేబర్ కమిషనర్ కార్యాలయాల ఎదుట ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. వేతన సవరణ కోరుతూ ఉద్యోగులు సమ్మె చేస్తున్నారు. లేబర్ ప్రోగ్రెసివ్ ఫెడరేషన్ (ఎల్‌పిఎఫ్) ప్రధాన కార్యదర్శి ఎం. షణ్ముగం నేతృత్వంలో పలువురు ఉద్యోగులు చెన్నైలోని లేబర్ కమిషన్ కార్యాలయం ఎదుట ఘెరావ్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రంలో వివిధ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్లకు చెందిన డివిజనల్ కార్యాలయాల ఎదుట మంగళవారం ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా నిర్వహించారు. తమిళనాడు ప్రభుత్వం ప్రతిపాదించిన వేతనాల పెంపును వ్యతిరేకిస్తూ కొన్ని ఉద్యోగ సంఘాలకు అనుబంధంగా ఉన్న కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చారు. రోడ్డు రవాణా ఉద్యోగుల సమ్మె ప్రయాణీకులపై తీవ్ర ప్రభావం చూపింది. తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లతోపాటు సమ్మెలో లేని కార్మికులతో బస్సులు నడపాలన్న ప్రభుత్వ ప్రయత్నాలన్నీ బెడిసికొట్టాయి. బస్సులు చాలా తక్కువగా నడవడంతో ప్రయాణీకులు అసౌకర్యానికి లోనయ్యారు. ఉద్యోగుల సమ్మెతో సంక్రాంతి పండగ సందర్భంగా నడిపే ప్రత్యేక బస్సులకు సంబంధించి అడ్వాన్స్ బుకింగ్‌లపై రెండు రోజులుగా అనిశ్చితి నెలకొంది. చెన్నై గ్రామీణ బస్సు టెర్మినస్ వద్ద బుకింగ్ కౌంటర్లు మూసి ఉండటంతో ప్రయాణీకులు అడ్వాన్స్ టిక్కెట్లు బుక్ చేసుకోలేక పోయారు.

బస్సులు బంద్ కారణంగా పలు మార్గాలలో అదనపు రైళ్ళను నడిపారు. . రైళ్ళన్నీ జనసమ్మర్థంతో నడిచాయి. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులకు తమ ప్రభుత్వం 2.44 రెట్లు వేతనం పెంచాలని నిర్ణయించిందని ముఖ్యమంత్రి కె.పళనిస్వామి మంగళవారం తెలిపారు. "వేతనాలు పెంచాం. మరింత పెంచాలని కోరడం సరైంది కాదు. వెంటనే విధుల్లో చేరాలని ఉద్యోగులకు విజ్ఞప్తి చేస్తున్నాను." అని పళనిస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల5న మద్రాస్ హై కోర్టు ఇచ్చిన తీర్పును గుర్తు చేశారు. ఆ తీర్పును గౌరవిస్తూ ఉద్యోగులు విధుల్లో చేరాలని కోరారు.



రిటైర్మెంట్ బకాయిల చెల్లింపునకు రూ.750 కోట్లు

సమ్మెలో ఉన్న రవాణా ఉద్యోగులను ఉపశమింప చేసేందుకు తమిళనాడు ప్రభుత్వం రిటైరైన ఉద్యోగులకు బకాయిలు చెల్లించేందుకు రూ.750 కోట్లు విడుదల చేస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి పళని స్వామి అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఈ మొత్తాన్ని సంక్రాంతి పండగకు ముందే చెల్లిస్తామన్నారు. దీనివల్ల నవంబరు 30, 2017 వరకు పదవీ విరమణ చేసిన వారికి లబ్ది చేకూరుతుందన్నారు. బకాయిలు చెల్లింపు కూడా సమ్మె చేస్తున్న ఉద్యోగుల డిమాండ్లలో ఒకటి.

వేతనాల రెట్టింపు కోరిన ఎమ్మెల్యేలు

తమిళనాడు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులు వేతనాల పెంపు కోరుతూ సమ్మె చేస్తున్న నేపథ్యంలో తమ వేతనాలను కూడా 100 శాతం పెంచాలంటూ శాసన సభ్యులు డిమాండ్ చేశారు. శాసన సభ్యులు చేసిన ఈ ప్రతిపాదనను ప్రతిపక్షాలు, కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఎమ్మెల్యేల వేతనాలు రెట్టింపు చేయాలని కోరుతూ రూపొందించిన ప్రతిపాదనల బిల్లును ఉప ముఖ్యమంత్రి ఓ. పన్నీర్ సెల్వం బుధవారం అసెంబ్లీ ముందుంచారు. ప్రస్తుతం ఒక్కొక్క ఎమ్మెల్యే వేతనం రూ.55 వేలుగా ఉంది. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యను రవాణా కార్మికులు తప్పు పట్టారు.

కేంద్రీయ విద్యాలయాలలో ప్రార్థన మతాన్ని ప్రోత్సహిస్తుందా?

- కేంద్ర ప్రభుత్వం, కేంద్రీయ విద్యాలయాల వివరణ కోరిన సుప్రీం

న్యూఢిల్లీ : దేశంలోని కేంద్రీయ విద్యాలయాలలోనూ, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాఠశాలల్లోనూ ఉదయం సమయాలలో విద్యార్థులతో హిందీ, సంస్కృత భాషలలో చేయిస్తున్న ప్రార్థన హిందూ మతాన్ని ప్రోత్సహిస్తుందా? అనే అంశాన్ని సుప్రీం కోర్టు పరిశీలిస్తోంది. దీనిపై బుధవారం కేంద్ర ప్రభుత్వం అభిప్రాయాన్ని కోరింది. దీనిని తీవ్రంగా పరిగణించాల్సిన రాజ్యాంగ సమస్యగా పేర్కొంది. పాఠశాలల్లో ఉదయం సమయాల్లో చేయిస్తున్న ప్రార్థన రాజ్యాంగ విరుద్ధమని, అది ఒక ప్రత్యేక మతాన్ని ప్రోత్సహిస్తున్నదని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌పై రెండు వారాలలోగా స్పందించాలని, అటు కేంద్ర ప్రభుత్వాన్ని, ఇటు కేంద్రీయ విద్యాలయాలను సుప్రీం కోర్టు కోరింది.

దేశంలోని దాదాపు 1100 కేంద్రీయ విద్యాలయాలలో ఉదయం జరిగే అసెంబ్లీలో హిందీలో ప్రార్థన చేస్తారు. 1964 నుంచి ఈ పద్ధతి కొనసాగుతోంది. అందులో సంస్కృత పదాలు కూడా ఉన్నాయి. ఇది రాజ్యాంగ ఉల్లంఘనే అంటూ వినాయక్ షా అనే న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. ఆయన పిల్లలు కూడా కేంద్రీయ విద్యాలయాలలో చదవడం విశేషం. పాఠశాలలో ఉదయం అసెంబ్లీ సమయంలో విద్యార్థులు కళ్ళుమూసుకుని, చేతులు రెండు జోడించి ప్రార్థనను ఆలపించడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ ప్రార్థన హిందీ, సంస్కృత పదాలలో ఉంటుందని, ఇతర మతాలకు చెందిన విద్యార్థులు కూడా అసెంబ్లీలో తప్పనిసరిగా దానిని వల్లెవేయాల్సి వస్తోందని వినాయక్ షా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ ప్రార్థన వల్ల విద్యార్థులు ప్రయోజనం పొందుతారనడానికి తగిన శాస్త్రీయ కారణాలు ఏమీ లేవని, అందువలన దీనిని రద్దు చేయాలని న్యాయవాది కోరారు.

ట్రిబ్యూన్ జర్నలిస్టుపై ప్రభుత్వ కక్షసాధింపు చర్య
ఖండించిన సిఐటియు

న్యూఢిల్లీ (ఇండియా న్యూస్ నెట్‌వర్క్) : ఆధార్ లీకేజ్‌కు సంబంధించి వ్యవస్థాగత లోపాలను ఎత్తిచూపిన ట్రిబ్యూన్ పత్రిక జర్నలిస్టు రచనాఖైరాపై కక్షసాధింపు చర్యగా ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని సిఐటియు బుధవారం ఖండించింది. వాస్తవానికి యుఎఐడిఐ వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపినందుకు జర్నలిస్టుకు రివార్డు ఇవ్వడానికి బదులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని సిఐటియు తప్పు పట్టింది. ప్రజల వ్యక్తిగత గోప్యత హక్కుపై అనధికారిక చొరబాట్లను నివారించి వ్యక్తిగత డేటాను రక్షించేందుకు యుఎఐడిఐ వ్యవస్థలోని లోపాలపై విజయవంతంగా దర్యాప్తు చేసిన జర్నలిస్టును అభినందించాలని తెలిపింది. జర్నలిస్టుపై కక్షసాధింపు చర్య ప్రభుత్వ అధికార గర్వాన్ని ప్రతిబింబిస్తున్నదని పేర్కొంది. ప్రభుత్వం అలా చేయడం మీడియాపై దాడి చేయడమేనని వెల్లడించింది. జర్నలిస్టులు, వార్తా పత్రికల ఉద్యోగుల సంఘాలతో సహా పలు ప్రజా సంఘాలు, సంస్థలు ప్రభుత్వం అనుసరిస్తున్న ఇటువంటి కక్షసాధింపు చర్యలను పెద్ద ఎత్తున నిరసించడాన్ని స్వాగతిస్తున్నట్లు సిఐటియు తెలిపింది. ఈ విషయమై ప్రభుత్వం తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కోరింది. వాస్తవాలను వెలికితీసే హక్కును పరిరక్షించేందుకు ప్రభుత్వం తక్షణమే జర్నలిస్టుపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలని సిఐటియు డిమాండ్ చేసింది.



వివాహ ఆహ్వాన పత్రికపై ప్రభుత్వ లోగో
బిజెపి ఎమ్మెల్యే నిర్వాకం

న్యూఢిల్లీ : ఉత్తరాఖండ్‌లో ఒక బిజెపి ఎమ్మెల్యే అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాడు. వ్యక్తిగతంగా నిర్వహిస్తున్న ఒక వివాహ వేడుక ఆహ్వాన పత్రికపై రాష్ట్ర ప్రభుత్వ లోగోను ముద్రించాడు. ఇది ఏమిటని ప్రశ్నిస్తే.. 'ఇది ఏమీ నేరం కాదు. నేను కూడా ప్రభుత్వంలో భాగమే' అని సమాధానం ఇస్తున్నాడు. రాష్ట్రంలోని హరిద్వార్ జిల్లాలోని జ్వాలాపూర్ నియోజకవర్గం నుంచి సురేష్ రాథోడ్ (బిజెపి) ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. తాను జరిపిస్తున్న వివాహ ఆహ్వాన పత్రికపై ప్రభుత్వ లోగోను ముద్రించాడు.'నా సొంత కుమార్తె మాదిరిగా ఒక పేద అమ్మాయికి వివాహం చేస్తున్నాను. దీనిని ప్రజలు ఎందుకు చూడకూడదు? నేను ప్రభుత్వంలో భాగం కాబట్టే లోగోను కార్డుపై ముద్రించాను. ఇది ఏమీ నేరం కాదు. గతంలో అనేక మంది ఇలా చేయడం నేను చూశాను' అని సురేష్ రాథోడ్ విలేకరులకు తెలిపాడు.ప్రభుత్వ అధికార చిహ్నాల చట్టం 2005 ప్రకారం ఏ వ్యక్తి కూడా ప్రభుత్వ చిహ్నాలను, వాటికి అనుకరణగా వుండే చిహ్నాలను ఉపయోగించకూడదు. ప్రభుత్వానికి సంబంధించిందనే అభిప్రాయం కలిగించే విధంగా చిహ్నాలను ఉపయోగించకూడదు.

ప్రత్యేకం

విచ్చలవిడి పశువులతో పంటలు నాశనం

- కరువుకు తోడవుతున్న విధ్వంసం
- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని యోగి సర్కార్

బుందేల్‌ఖండ్ : ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్ ఖండ్ దశాబ్దాల కాలంగా నీటి కొరతను ఎదుర్కొంటున్న ఒక కరువు ప్రాంతం. ఇప్పుడా ప్రాంతాన్ని మరో సమస్య కూడా పట్టి పీడిస్తున్నది. అది విచ్చల విడిగా తిరిగే పశువులు పంట పొలాలను నాశనం చేస్తుండటం. దీని వల్ల ఆ ప్రాంతంలో ఘర్షణలు జరుగుతున్నాయి. రైతులలో ఆందోళన పెరుగుతున్నది.

ఇటీవల మాజీ ప్రధాని అతల్ బీహారి వాజ్‌పేయి పుట్టిన రోజు సందర్భంగా గోసేవ పేరుతో విచ్చలవిడిగా సంచరించే పశువులకు ఉచితంగా దాణా ఏర్పాటు చేస్తానని రాత్ నగరంలోని బిఎన్‌వి ఇంటర్ కాలేజి డైరెక్టర్ ఉమాకాంత్ ప్రకటించారు. ఆయన ప్రకటించడమే కాకుండా ఈ విషయాన్ని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. రాత్ ప్రాంతానికి చెందిన 300 ఆవులను తమ వద్దకు తీసుకు వచ్చి వదులుతారని ఆయన భావించాడు. కాని ఆ మరుసటి రోజు ఉదయానికి దాదాపు 7 వేల ఆవులు వాటి యజమానులతో సహా ఆయన ఎదుట ప్రత్యక్షమయ్యాయి. ఇవి కేవలం రాత్ ప్రాంతానికి చెందినవే కావు. ఆ పరిసర జిల్లాలైన హమీర్‌పూర్, జలోన్, ఝాన్సీ తదితర ప్రాంతాలకు చెందినవి. కళాశాల గ్రౌండ్‌కు వెళ్తున్న మరో 15 వేల ఆవులను చూసి తీవ్ర భయాందోళనలకు గురైన పోలీసులు, పాలనాధికారులు వాటిని వెనక్కి పంపించేశారు.

గత ఏడాది డిసెంబరు 31 జలోన్ గ్రామానికి చెందిన కొంతమంది విచ్చల విడిగా తిరిగే పశువులను ఓరాయ్ ప్రాంతంలో జరుగుతున్న ఒక కార్యక్రమానికి తోలుకు వచ్చి, ఆ కార్యక్రమానికి హాజరైన ముగ్గురు ఎమ్మెల్యేలను ఘెరావ్ చేశారు. ఈ పశువులకు సంబంధించి గత ఏడాది రాష్ట్ర అసెంబ్లీలో తీవ్రమైన చర్చ జరిగినా ఎటువంటి ఫలితం రాలేదు.

గత దశాబ్ద కాలంగా కరువు, రుణభారం, పేదరికాన్ని ఎదుర్కొంటున్న బుందేల్ ఖండ్ ప్రాంతాన్ని మూడు సంవత్సరాలుగా విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువుల సమస్య పట్టి పీడిస్తున్నది. ఇవి అక్కడ తీవ్రమైన సంక్షోభాన్ని సృష్టిస్తూ రబీ పంటకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఇది శాంతి భద్రతల సమస్యగా కూడా మారింది. ఈ సమస్య తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నది. ఈ పశువుల కారణంగా గ్రామస్తుల మధ్య తగాదాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వ విధానం వలన పెంచిపోషించిన పశువులే వారికి పీడకలగా మారాయి. పంటలను కాపాడుకోవటం కోసం రైతులందరూ రాత్రిళ్ళు ఇళ్ళు వదిలి పొలాలకు కాపలా కాస్తున్నారు. విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులు మాటలలో వర్ణించ వీలులేని విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయి.

పశువులను వధ్యశాలలకు విక్రయించడాలపై నిషేధం విధించిన కారణంగానే వాటి సంఖ్య పెరిగిపోతున్నదని హమీర్‌పూర్ అడిషనల్ డిప్యూటి మెజిస్ట్రేట్ కుంజ్ బిహారి అగర్వాల్ ఆరోపించారు. అంతేకాకుండా గ్రామస్తులు, గో సంరక్షణ పేరుతో చేసే దాడులు కూడా ఈ పరిస్థితికి కారణమని ఆయన తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో పశువులను కొనేవారు కూడా లేరని, హమీర్‌పూర్‌లో ఉన్న ఏడు బ్లాక్‌లలోనూ మూడేసి షెల్టర్ల చొప్పున ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు చెప్పారు.

విచ్చలవిడిగా సంచరించే పశువుల కారణంగా మగ్రౌల్-చ్చిబౌలి గ్రామస్తుల మధ్య ఘర్షణలు కూడా చోటు చేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో పెద్దసంఖ్యలో గ్రామస్తులు గాయపడగా, 10 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

పశువులు విచ్చలవిడిగా సంచరించడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని హమీర్‌పూర్ ఎస్‌పి దినేష్ కుమార్, ఎమ్మెల్యే అనురాగిలు అంగీకరించారు.

సంక్షిప్తం

సైనిక నియామకాల్లో తొక్కిసలాట

డెహ్రి ఆన్ సోనె : బీహార్‌లోని రోహతాస్ జిల్లా డెహ్రి ఆన్ సోనెలో సైనిక నియామకాల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఒకరు మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. ఈ సంఘటన బుధవారం తెల్లవారు ఝామున 3 గంటల సమయంలో జరిగింది. గత ఐదు రోజులుగా ఇక్కడ బిఎంపి గ్రౌండ్‌లో సైనిక నియామకాలు జరుగుతున్నాయి. ఉదయం సమయంలో పోలీస్ లైన్స్ గేట్ ద్వారా రన్నింగ్ చేయాల్సి ఉంది. దీంతో అభ్యర్థులందరూ ఒక్కసారిగా రావడంతో తోపులాట జరిగిందని పోలీసు సూపరింటెండెంట్ ఎంఎస్ ధిల్లాన్ తెలిపారు.

వరుసగా నాల్గో రోజూ బిట్‌కాయిన్ పతనం

సియోల్ : అత్యంత విలువైన డిజిటల్ కరెన్సీగా భావిస్తున్న బిట్‌కాయిన్ వరుసగా నాల్గవ రోజూ పతనమైంది. డిసెంబరు 17వ తేదీన రికార్డుస్థాయిలో 20వేల డాలర్లు పలికిన ధర 30శాతం క్షీణించింది. బుధవారం నాడు బిట్‌కాయిన్ 14,400 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది. అంతకుముందు రోజు కన్నా ఐదు శాతం విలువ క్షీణించింది. క్రిప్టో కరెన్సీ మార్కెట్‌పై గల ఆధిపత్యాన్ని కూడా పోగొట్టుకుంది. ప్రస్తుతం కేవలం 34శాతం డిజిటల్ మనీ బిట్‌కాయిన్‌ల రూపంలో వుంది. గతేడాది ఇదే రోజుకు 85శాతం వుంది.

అజ్మర్ ఉప ఎన్నికకు అభ్యర్థుల నామినేషన్

జైపూర్ : రాజస్థాన్‌లోని అజ్మర్ లోక్‌సభ నియోజక వర్గానికి ఈ నెల 29న జరగనున్న ఉప ఎన్నికకు బిజెపి, కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. బిజెపి అభ్యర్థి రామ్ స్వరూప్ లాంబా, కాంగ్రెస్ అభ్యర్థి రఘుశర్మలు బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్‌లు దాఖలు చేసే సమయంలో అభ్యర్థుల వెంట ఆయా పార్టీలకు చెందిన సీనియర్ నేతలున్నారు. అజ్మర్ లోక్‌సభ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహించి, గుండెపోటుతో గత ఏడాది మృతి చెందిన సన్‌వార్ లాల్ జాత్ కుమారుడు లాంబా కాగా, రఘు శర్మ మాజీ కాంగ్రెస్ ఎమ్మెల్యే.

ట్రంప్ సర్కారుకు మరో ఎదురుదెబ్బ

'డాకా' చట్టం రద్దు ఆదేశాలపై కాలిఫోర్నియా కోర్టు 'స్టే'

వాషింగ్టన్: చట్ట వ్యతిరేకంగా బాల్యంలోనే అమెరికాకు వచ్చి అక్కడే పెరిగి ఉద్యోగావకాశాలు పొందిన యువతను క్రమబద్ధీకరించేందుకు గత ఒబామా సర్కారు అమలుచేసిన డాకా (డిఫర్డ్ యాక్షన్ ఆన్ చైల్డ్‌హుడ్ అరైవల్స్) చట్టాన్ని రద్దు చేయాలన్న ట్రంప్ ప్రభుత్వ నిర్ణయంపై కాలిఫోర్నియా ఫెడరల్ న్యాయమూర్తి స్టే విధించారు. ఈ స్టే దేశవ్యాప్తంగా వర్తిస్తుందని, పాత చట్టాన్ని యధాతథంగా అమలు చేయాలని ఆయన తన ఆదేశాలలో పేర్కొన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలన్న ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయం అక్రమమని న్యాయమూర్తి విలియం అల్సప్ తన ఆదేశాలలో పేర్కొన్నారు. ట్రంప్ ప్రభుత్వ నిర్ణయంతో దెబ్బతినే దాదాపు 8 లక్షల మందికి పైగా వలసదారులకు సాంత్వన చేకూర్చే అంశంపై అధికార రిపబ్లికన్, డెమోక్రాట్స్ సభ్యుల మధ్య తీవ్ర స్థాయి చర్చ జరిగింది.



నిరసన

పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్రంలోని కసూర్ జిల్లాలో ఎనిమిది సంవత్సరాల బాలికపై అత్యాచారం చేసి హత్యచేయటాన్ని నిరసిస్తూ పెద్దసంఖ్యలో ప్రజలు ఆందోళన చేస్తున్నారు.

అమెరికాకు సహకరించబోమన్న పాక్

కొట్టిపారేసిన అమెరికా

ఇస్లామాబాద్: గత వారం తమకు భద్రతాపరమైన సాయాన్ని నిలిపివేస్తూ అమెరికా తీసుకున్న నిర్ణయానికి ప్రతీకారంగా తాము ఆ దేశంతో అన్ని రకాల సహకారాన్ని నిలిపివేస్తున్నట్లు పాకిస్తాన్ ప్రకటించింది. అమెరికాతో ఇంటెలిజెన్స్, రక్షణ పరమైన సహకారాన్ని సస్పెండ్ చేస్తున్నట్లు పాక్ రక్షణ మంత్రిని ఉటంకిస్తూ మీడియా తన వార్తా కథనాలలో వెల్లడించింది. అయితే మంత్రి వ్యాఖ్యలు అధికారికమైనవా? కాదా? అన్న విషయంలో స్పష్టత వెల్లడి కాలేదు. పాక్ మీడియా ప్రచురించిన వార్తా కథనాలను ఇస్లామాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయం తోసిపుచ్చినట్లు వాయిస్ ఆఫ్ అమెరికా రేడియో ప్రకటించింది. ఆఫ్ఘన్‌కు చెందిన ఉగ్రవాదులకు తాము ఆశ్రయం కల్పిస్తున్నట్లు అమెరికా పదేపదే తమను నిందించటం దారుణమని, అమెరికాతో అర్ధరహితమైన చర్చలకు తెరదించాల్సిన సమయం వచ్చిందని పాక్ రక్షణ మంత్రి ఖుర్రం దస్తగిర్ వ్యాఖ్యానించినట్లు పాకిస్తాన్‌కు చెందిన ది న్యూస్ పత్రిక తన వార్తా కథనాలలో పేర్కొంది. అమెరికా తమకు భద్రతాపరమైన సాయాన్ని నిలిపివేయటానికి ప్రాధాన్యత లేదని, తాము ఇప్పటి వరకూ అమెరికాకు అందిస్తున్న ఇంటెలిజెన్స్, రక్షణ పరమైన సహకారాన్ని నిలిపివేస్తున్నామని ఆయన చెప్పారు. ఈ అంశాలపై ఆచరణయోగ్యమైన పరిష్కారం లభించే వరకూ అమెరికాతో ఉన్నత స్థాయి చర్చలకు తావులేదని ఆయన స్పష్టం చేశారు.

ఆఫ్ఘనిస్తాన్‌లో తీవ్రవాద నిరోధక స్థావరం

బీజింగ్ : సరిహద్దులు దాటి ఉగ్గైర్ తీవ్రవాదులు లోపలకు చొరబడకుండా నిలువరించేందుకు ఉత్తర ఆఫ్ఘనిస్తాన్‌లోని బాద్ఖాన్ ప్రావిన్స్‌లో తీవ్రవాద నిరోధక స్థావరాన్ని నిర్మించడానికి చైనా నిధులు అందచేయనుంది. అయితే ఎక్కడ ఈ స్థావరాన్ని నిర్మించాలన్నది ఇంకా ఖచ్చితంగా నిర్ణయం తీసుకోలేదని ఆఫ్ఘన్ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన జనరల్ దావ్‌లత్ వజిరి తెలిపారు. ఈ స్థావర నిర్మాణానికి అవసరమైన పాదార్థిక, సాంకేతిక తోడ్పాటు అంటే ఆయుధాలు, సైనికుల యూనిఫారాలు, సైనిక పరికరాలు, మొత్తంగా స్థావరం పనిచేయడానికి అవసరమైన ప్రతి దాన్ని చైనా అందచేస్తుందని చెప్పారు. గత నెల్లో ఆఫ్ఘన్ రక్షణ మంత్రి తారిక్ షా బహ్రమి చైనాలో పర్యటించినపుడు ఈ స్థావరం ఏర్పాటు నిర్ణయం తీసుకున్నారు.

ఇరాన్ ఆందోళనల్లో 3700మంది అరెస్టు

దుబాయ్ : గత రెండు వారాల్లో ఇరాన్‌లో నిరసనలు, ఆందోళనల సందర్భంగా దాదాపు 3700 మందిని అరెస్టు చేసినట్లు ఇరాన్ ఎంపి తెలిపారు. అధికారులు గతంలో వెల్లడించిన దానికన్నా ఈ సంఖ్య ఎక్కువగా వుందని చెప్పారు. మంగళవారం ఇరాన్ పార్లమెంట్ అధికార వెబ్‌సైట్‌లో పెట్టిన నివేదికలోని ఈ వివరాలను పేర్కొన్నారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థ, సమస్యలపై డిసెంబరు 28న ఈ ఆందోళనలు ప్రారంభమయ్యాయి. 21మంది ఘర్షణల్లో మరణించారు. మానవ హక్కుల కార్యకర్తలు మాట్లాడుతూ, తామేమీ ఈ సంఖ్య చూసి ఆశ్చర్యపడడం లేదన్నారు. గతంలో నిరసనల్లో పాల్గొనని విద్యార్థులను కూడా అధికారులు ముందు జాగ్రత్తగా అరెస్టు చేశారని 2009 నిరసనల్లో దాదాపు 4వేల మంది అరెస్టయ్యారని తెలిపారు.

జర్నలిస్టులపై మయన్మార్ కేసు

అధికార రహస్యాల చట్టాన్ని ఉల్లంఘించారని అభియోగాలు



బ్యాంకాక్ : రాయిటర్స్‌కి చెందిన ఇద్దరు జర్నలిస్టులు మయన్మార్ చట్టాన్ని ఉల్లంఘించారంటూ బుధవారం అభియోగాలు నమోదయ్యాయి. వారు ఉల్లంఘించింది మయన్మార్ అధికార రహస్యాల చట్టమని ప్రాసిక్యూటర్లు పేర్కొంటూ అంతర్జాతీయంగా ఖండనలు ఎదురైనా ఈ కేసు కొనసాగుతుందనే సంకేతాలు వెలువరించారు. డిసెంబరు 12వ తేదీన వా లోనె, కియా సో ఓలను అరెస్టు చేశారు. ఇద్దరు పోలీసుల నుండి అతి ముఖ్యమైన రహస్య పత్రాలను జర్నలిస్టులు సేకరించడం ద్వారా వలసవాద కాలం నాటి చట్టాన్ని ఉల్లంఘించారని పోలీసులు పేర్కొన్నారు. రోహింగ్యా ముస్లింలపై పోలీసులు అణచివేత చర్యలు తీసుకోవడంతో దాదాపు ఆరున్నర లక్షల మంది రోహింగ్యాలు బంగ్లాదేశ్‌కు పారిపోయిన రాఖినె రాష్ట్రంలో ఇది జరిగింది. కాగా తమ సహచరులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ పలువురు జర్నలిస్టులు బుధవారం కోర్టు వెలుపల నిరసన ప్రదర్శన నిర్వహించారు. "ఇది ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదు. వాస్తవాలను తెలుసుకోకుండా ఎవరూ మమ్మల్ని అడ్డుకోలేరు." అని వా లోనె వ్యాఖ్యానించారు. ఒకవేళ వీరు దోషులని తేలినట్లైతే 14ఏళ్ళ జైలుశిక్ష పడుతుందని జర్నలిస్టుల తరపు లాయర్ తెలిపారు. బెయిల్‌పై విడుదల చేసేందుకు న్యాయమూర్తి నిరాకరించారని, తదుపరి విచారణ ఈ నెల 23న జరుగుతుందని లాయర్ తెలిపారు.

లంక పార్లమెంట్‌లో బాహాబాహీ



కొలంబో: శ్రీలంక పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్ష సభ్యులు బుధవారం నాడు పరస్పరం అవినీతి ఆరోపణలు చేసుకుంటూ బాహాబాహీ తలపడ్డారు. ప్రభుత్వం బాండ్లు జారీ చేసిన వ్యవహారంలో అవినీతి చోటు చేసుకోవటంతో ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతిన్నదంటూ ఇరుపక్షాల సభ్యులు ఆరోపనణలు చేసుకున్నారు. బాండ్ల జారీ అంశంపై ప్రధాని రణిల్ విక్రమ సింఘె ప్రసంగిస్తున్న సమయంలో ప్రతపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేయటంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. బాండ్ల జారీ వ్యవహారంలో అంతర్గత సమాచారం లీక్ కావటం ద్వారా కేంద్ర బ్యాంకు మాజీ గవర్నర్ అల్లుడు ప్రయోజనం పొందారంటూ ఇటీవల జరిగిన విచారణలో బయటపడిన అంశాన్ని ప్రతిపక్ష సభ్యులు ప్రస్తావించారు. ఆ మాజీ గవర్నర్‌ను గతంలో ఆ పదవిలో ప్రధాని విక్రమ సింఘె నియమించారని, లాభాలు, ప్రయోజనాలు ఆయనకి దక్కగా ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిందని ప్రతిపక్ష సభ్యులు విమర్శించారు. మాజీ గవర్నర్ అల్లుడు దాదాపు 7.2 కోట్ల డాలర్ల మేర లబ్ది పొందారని, ప్రభుత్వ ఖజానాకు 5.5 కోట్ల డాలర్ల మేర నష్టం వాటిల్లిందని ఈ వ్యవహారంపై విచారణ జరిపిన కమిటీ తన నివేదికలో పేర్కొంది.

ఉభయ కొరియాల మధ్య మెరుగైన సంబంధాలు

- చైనా హర్షం



బీజింగ్ : ఉభయ కొరియాల మధ్య సంబంధాలు మెరుగుపడడంపై చైనా సంతోషం వ్యక్తం చేసింది. ఉన్నత స్థాయిలో ఉభయ పక్షాలు చర్చలు జరిపిన అనంతరం స్పందిస్తూ, ఇటువంటి ప్రయత్నాలకు తమ మద్దతు, తోడ్పాటు ఎప్పుడూ వుంటుందని స్పష్టం చేసింది. దక్షిణ కొరియాలోని పెంగ్‌చాంగ్‌లో జరిగే వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు తమ ప్రతినిధి బృందాన్ని పంపడానికి ఉత్తర కొరియా మంగళవారం అంగీకరించింది. రెండేళ్ళకాలంలో మొదటిసారిగా ఉన్నత స్థాయి సమావేశం జరగడం ఇదే. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లూ కాంగ్ మాట్లాడుతూ, ఈ చర్చలు ఉభయ కొరియాలకు మంచిదని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇరు దేశాలు సంబంధాలను మరింత మెరుగుపరుచుకుని, సహకారాన్ని పెంచుకుని, ఉద్రిక్తతలు తగ్గించుకుని సామరస్యంగా వ్యవహరించేందుకు ఇది ఆరంభమని వ్యాఖ్యానించారు. చైనా సామాజిక శాస్త్రాల అకాడమీలో అంతర్జాతీయ వ్యూహాల జాతీయ సంస్థకి చెందిన నిపుణుడు పియావో జియాని మాట్లాడుతూ, చర్చలు చాలా సాఫీగా కొనసాగాయని, ఈ విషయంలో మరింత పురోగతి కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని వ్యాఖ్యానించారు. సాధారణంగా ఒక పక్షం ఒక ప్రతిపాదన చేస్తే రెండోపక్షం దాన్ని తిరస్కరిస్తుందని అన్నారు.

సమీప భవిష్యత్తులో డ్రోన్ల ద్వారా ఆహార సరఫరా : చైనా ఆశాభావం

బీజింగ్ : సమీప భవిష్యత్తులో డ్రోన్ల ద్వారా ఆహార సరఫరా అనేది వాస్తవం కాబోతుందని చైనా భావిస్తోంది. చైనా బెడియూ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ ఖచ్చితత్వాన్ని మెరుగుపరిచేందుకు ఇటీవలే చాంగ్‌కింగ్‌లోని బెడియూ బహిరంగ ప్రయోగశాలను నెలకొల్పారని చాంగ్‌కింగ్ ఈవినింగ్ న్యూస్ పేర్కొంది. ల్యాబ్ డైరెక్టర్ మాట్లాడుతూ, స్థాన ఖచ్చితత్వాన్ని (పొజిషనింగ్ ఆక్యూరసీ) మరింత మెరుగుపరిచేందుకు గానూ బెడియూ కమ్యూనికేషన్, నావిగేషన్ సాంకేతికతలను ఆగ్‌మెంటేషన్ వ్యవస్థతో మిళితం చేయనున్నట్లు తెలిపారు. డ్రోన్‌ల ద్వారా ఆహారం, పార్శిల్‌లను అందచేయడం ఇకపై సాంకేతికంగా కూడా సాధ్యమేనని చెప్పారు. అయితే అందుకు గానూ మరిన్ని పరీక్షలను చేయాల్సిన అవసరం వుందని తెలిపారు. బెడియూ సమాచార సాంకేతిక పరిజ్ఞానం ప్రాతిపదికన ప్రపంచంలోనే మొట్టమొదటి ఐఓటి (ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్) మాడ్యూల్స్‌ను అభివృద్ధిపరచనున్నట్లు తెలిపారు.

సెంట్రల్ అమెరికాలో తీవ్ర భూకంపం

కరీబియన్ తీర ప్రాంతంలో సునామీ హెచ్చరిక జారీ

హోండూరస్: సెంట్రల్ అమెరికాలోని హోండూరస్, కేమాన్ దీవుల్లో మంగళవారం రాత్రి తీవ్ర భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 7.6 పాయింట్ల తీవ్రతను నమోదు చేసిన ఈ ప్రకంపనల ధాటికి సునామీ సంభవించే అవకాశాలున్నట్లు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అయితే ఈ ప్రకంపనల వల్ల ప్రధాన భూభాగంలో ఎటువంటి నష్టమూ వాటిల్లినట్లు సమాచారం అందనప్పటికీ హోండూరస్‌లోని కోలోన్, అట్లాంటిడా ప్రావిన్స్‌ల్లో, తూర్పు తీర ప్రాంతంలోని ఒలాంచో ప్రావిన్స్‌లోనూ కొన్ని ఇళ్లు బీటలు వారినట్లు వార్తలందాయి. ఈ ప్రకంపనల ధాటికి సముద్ర నీటి మట్టం పెరిగి సునామీ సంభవించే అవకాశం వుందని హెచ్చరికలు జారీ కావడంతో పోర్టారికో, కేమాన్ దీవులు, క్యూబా,జమైకా తదితర కరీబియన్ దేశాల ప్రజలను అప్రమత్తం చేసినట్లు అధికారులు వివరించారు. సముద్రపు అలలు మూడడుగుల ఎత్తున ఎగసిపడే అవకాశాలున్నాయని పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. ఇదిలా వుండగా ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుగా అత్యవసర యంత్రాంగాన్ని సర్వసన్నద్ధం చేసినట్లు హోండూరస్ అధ్యక్షుడు ఆర్నాల్డో హెర్నాండెజ్ ప్రకటించారు.

ప్రయివేటు మెడికల్ కాలేజీలకు పండగ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజల ప్రాణాలు కాపాడే వైద్య విద్యను అభ్యసించడం రానున్న రోజుల్లో సామాన్యులకు అందని ద్రాక్షలా మారే ప్రమాదమేర్పడుతోంది. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) స్థానంలో జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసి)ను తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఎన్‌ఎంసి బిల్లును వ్యతిరేకిస్తూ ఇప్పటికే దేశవ్యాప్తంగా వైద్యులు ఆందోళనలు చేశారు. ఎంసిఐ తనిఖీల్లో లోపాలు, పలు అవినీతి ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో దానిని రద్దు చేసి, ఎన్‌ఎంసిని తీసుకొస్తామని కేంద్రం చెబుతోంది. ఈమేరకు క్యాబినెట్‌లో కూడా ఆమోదించింది. అయితే ఎన్‌ఎంసి ముసాయిదా

బిల్లులో పొందు పరిచిన అంశాల్ని పరిశీలిస్తే ఎంసిఐ కంటే మరింత అవినీతికి ఆస్కారమున్నట్లు పలువురు వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఎన్‌ఎంసిలో వైద్య రంగం కంటే ప్రభుత్వం నామినేట్ చేసిన సభ్యులే ఎక్కువగా ఉండడం ప్రధాన లోపంగా కనిపిస్తోంది. దీంతో వైద్యరంగం నాణ్యత మరింత తగ్గుతుందని వైద్య సంఘాలు ఆందోళన వక్తం చేస్తున్నాయి. ప్రతి ఏటా వైద్య కళాశాలలకు అడ్మిషన్లు ఇచ్చే ప్రక్రియలో ఆయా కాలేజీల్ని ఎంసిఐ తనిఖీ చేసి తగిన సదుపాయాలున్నాయా, తగినంత మంది బోధనా సిబ్బంది ఉన్నారా లేదా అనే అంశాల్ని పరిశీలించి అనుమతులిస్తుంది. అయితీ కేంద్రం తీసుకువచ్చే ఎన్‌ఎంసి ద్వారా అసలు మెడికల్ కాలేజీలకు తనిఖీ, లైసెన్సు రెన్యువల్ లేకుండానే ఒకేసారి అనుమతులొస్తాయి. దీని ద్వారా వైద్య విద్య నాణ్యత మరింత తగ్గుతుందని పలువురు నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ఎన్‌ఎంసితో ప్రయివేటు మెడికల్ కాలేజీల్లో ఫీజుల్ని ఆయా యాజమాన్యాలు తమ ఇష్ట ప్రకారం నిర్ణయించుకోవచ్చు. దీంతో ప్రయివేటు కాలేజీలు ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడీకి మార్గం సులువవుతుంది.

బ్రిడ్జి కోర్సుతో ప్రజల ప్రాణాలకు ముప్పు

సంప్రదాయ వైద్య విధానాలైన ఆయుష్ (ఆయుర్వేదం, యోగ, సిద్ధ, యునాని, హోమియోపతి) వైద్య విద్యను అభ్యసించేవారు అల్లోపతి (ఆధునిక వైద్యం) చేసేందుకు అర్హులుగా బ్రిడ్జి కోర్సును కేంద్రం ఈ బిల్లులో ప్రతిపాదించింది. అయితే అల్లోపతి వైద్యులంతా ఈ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చట్టం సెక్షన్ 15 ప్రకారం ఈ నిర్ణయం విరుద్ధమని పలువురు నిపుణులు చెబుతున్నారు. సంప్రదాయ వైద్య కోర్సు చేసిన వారికి రిజిస్ట్రేషన్ అర్హత పరీక్ష ద్వారా వారికి లైసెన్స్ ఇచ్చి ఆధునిక వైద్యం చేసేందుకు అనుమతులివ్వడం ప్రజల ప్రాణాలకే ముప్పు అని చెబుతున్నారు. ఇప్పటికే పలువురు హోమియో, ఆయుర్వేద వైద్యులు అనధికారికంగా ఎలాంటి రిజిస్ట్రేషన్లు లేకుండానే ఆధునిక వైద్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి. వాటి పై ఇప్పటివరకు ప్రభుత్వ పరంగా ఎలాంటి పర్యవేక్షణ, నియంత్రణ లేదు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అనధికారిక ప్రాక్టీస్‌కు ప్రభుత్వమే అధికారికంగా చేసుకునే వెసులుబాటు కల్పించే ప్రయత్నం చేస్తోందని విమర్శిస్తున్నారు.

ఎన్‌ఎంసిలో ప్రధానాంశాలు:

- సంప్రదాయ వైద్య విద్య అభ్యసించిన గ్రాడ్యుయేట్లు బ్రిడ్జి కోర్సుతో రిజిస్ట్రేషన్ చేసుకుని అధికారికంగా ఆధునిక వైద్యం చేసుకునేందుకు వెసులుబాటు
- ప్రయివేటు కళాశాలల్లో కేవలం 40 శాతం సీట్లపై మాత్రమే ప్రభుత్వ నియంత్రణ ఉంటుంది. మిగిలిన సీట్ల ఫీజుల్ని ఆ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా నిర్ణయించుకోవచ్చు.
- ప్రస్తుతం ఎంసిఐ నిబంధనల ప్రకారం విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు మన దేశంలో ప్రాక్టీస్ చేయాలంటే ఎంసిఐ రిజిస్ట్రేషన్ కోసం తప్పనిసరిగా పరీక్ష పాసవ్వాలి. కానీ ఎన్‌ఎంసి వస్తే ఈ నిబంధనకు స్వస్తి చెప్పనున్నారు. దీంతో ఇతర దేశాల్లో వైద్య విద్యార్థులు కూడా మన దేశంలో ఇష్టమొచ్చినట్లు మెడికల్ ప్రాక్టీస్ చేసుకోవచ్చు.
- ఎన్‌ఎంసిలో ప్రభుత్వం నామినేట్ చేసే వారంతా వైద్యరంగానికి చెందినవారు కాకుండా న్యాయ శాఖ, చార్టర్డ్ అకౌంట్ వంటి ఇతర రంగాలకు సంబంధించిన వారు ఉంటారు.
- వైద్యులు తమ రంగం నుంచి నామినేట్ చేసి, సభ్యుల్ని ఎన్నుకునే హక్కును కోల్పోయే అవకాశం ఉంది. ఎందుకంటే ఎన్‌ఎంసిలో 25 మంది సభ్యులుంటే కేవలం ఐదుగురే వైద్య రంగం నుంచి ఎన్నికైన వారుంటారు.
- వైద్య విద్య, సీట్ల విషయంలో రాష్ట్రాలు తమ హక్కును కోల్పోయే ప్రమాదముంది.
- రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ స్వతంత్రతను కోల్పోయి పూర్తిగా ఎన్‌ఎంసి కింద పనిచేయాల్సి వస్తుంది.
- రాష్ట్రాల్లోని ఆరోగ్య విశ్వవిద్యాలయాలు స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే హక్కు లేకుండా నామమాత్రమైన వైద్య సలహా మండలిలో మాత్రమే చోటు ఉంటుంది. ఎన్‌ఎంసిలో హెల్త్ యూనివర్శిటీలకు ప్రాతినిధ్యం లేదు.

చైనా మాదిరి అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. ఇప్పటికే లక్ష మందికి ఇవ్వడం జరిగిందన్నారు. భవిష్యత్తులో హార్టికల్చర్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు.

కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం పట్టణాలతోపాటు జిల్లాలోని అన్ని పట్టణాలను అభివృద్ధి చేస్తామన్నారు. సామాజిక భద్రత, ఆహార భద్రత కల్పిస్తామన్నారు. మత్స్యకారుల్లో ఎస్‌సిల్లో చేర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. తన దృష్టిలో రెండే కులాలు ఉన్నాయని, ఒకటి ధనవంతుల కులం, మరొకటి పేదవాని కులమన్నారు. ధనవంతుల కోసం చేయాల్సింది ఏమీ లేదని, పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు చేయాల్సి ఉందని, అవన్నీ చేస్తామని చెప్పారు. సుమారు గంట 20 నిమిషాల పాటు ఏకధాటిగా సిఎం ప్రసంగించి చెప్పిందే పదేపదే చెప్పడంతో ప్రజల్లో అసహనం కనిపించింది. సభ అనంతరం లబ్ధిదారులకు వివిధ పథకాల్లోని కార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, సుజయ్ కృష్ణ రంగారావు, ఎంపీ పండుల రవీంద్రబాబు, ఎంఎల్‌ఎలు దాట్ల బుచ్చిబాబు, వంతల రాజేశ్వరి, పులపర్తి నారాయణమూర్తి, గొల్లపల్లి సూర్యారావు, ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ కారెం శివాజీ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికగా తీర్చిదిద్దాలి
- కాకినాడలో టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించిన సిఎం

కాకినాడలో నిర్మించిన టిడిపి జిల్లా కార్యాలయాన్ని ప్రజా సమస్యల పరిష్కార వేదికగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కచేరిపేటలో నిర్మించిన టిడిపి జిల్లా నూతన కార్యాలయాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ 35 ఏళ్ల తర్వాత అతి పెద్ద జిల్లా, టిడిపికి కంచుకోటగా ఉంటే తూర్పుగోదావరిలో పార్టీ కార్యాలయం నిర్మించడం శుభ పరిణామన్నారు. తూర్పు ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సహకారంతో కార్యాలయం నిర్మించుకోవడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా అభివృద్ధికి ఇక్కడే విజన్ తయారు కావాలన్నారు. ప్రణాళికలు తయారు చేసి వాటిని అమలు చేసే సమర్ధవంతులైన నాయకత్వాన్ని తయారు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఉన్న వనరులను, సంపదను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధికి ప్రణాళికలు తయారు కావాలన్నారు. కష్టపడి పనిచేసే మనుషులు కూడా ఈ జిల్లాలో ఉన్నారని చెప్పారు. 35 ఏళ్లపాటు ఎన్నో త్యాగాలు చేసిన నాయకులు ఈ జిల్లాకు పెద్ద ఆస్తి అని అన్నారు. జన్మభూమి సభలను గ్రామ సభలకే పరిమితం కాకుండా అభివృద్ధి గురించే చర్చించే వేదికలుగా మార్చామన్నారు.

ఒకప్పుడు జన్మభూమి కార్యక్రమంలో రచ్చ రచ్చ ఉండేదని, ఇప్పుడు స్వాగతం పలికేలా, కృతజ్ఞతలు తెలిపేవిగా మారాయని చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత అనేక సమస్యలను అధిగమించి నాలెడ్జ్ పరంగానూ, టెక్నాలజీపరంగానూ ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. అనంతరం కాంట్రాక్టర్ శ్రీనివాస్, కార్యాలయ ఇన్‌ఛార్జి మందాల గంగ సూర్యనారాయణతోపాటు పలువురిని సిఎం సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి, హోంశాఖమంత్రి చినరాజప్ప, ఆర్థికశాఖమంత్రి యనమల రామకృష్ణుడు, ఇన్‌ఛార్జి మంత్రి కళా వెంకట్రావు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎస్‌వియూలో అవినీతి తిమింగలం

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశాలతో తిరుపతి, నెల్లూరుల్లోని రుద్రకుమార్ బంధువులకు చెందిన ఆరు ప్రాంతాల్లో దాడులు చేశారు. ఎసిబి డిఎస్‌పి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి ఎల్‌ఎస్ నగర్‌లోని రుద్రకుమార్ ఇంటితో పాటు, నగరంలోని అతని సోదరి, సోదరుల ఇళ్లతో పాటు, నెల్లూరులోని మరో సోదరుని ఇంట్లోనూ తెల్లవారుజామున సోదాలు నిర్వహించారు. నిందితుని భార్య వాణిశ్రీ పేరుతో 7 ఇళ్లతో పాటు 13 ఇళ్ల స్థలాలు, పాటు మూడు ప్రాంతాల్లో వ్యవసాయ భూములను గుర్తించారు. రుద్రకుమార్ పేరుతో తిరుపతిలో రెండంతస్తుల భవనం ఉంది. రూ.9.63 లక్షల నగదు, 350 గ్రాములు బంగారు ఆభరణాలు, 2.8 కేజీల వెండి వస్తువులతో పాటు ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు రూ. 11 లక్షలు ఎల్‌ఐసి ప్రీమియం పాలసీలు, 5 లక్షలకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. నగరంలోని వివిధ బ్యాంకుల్లో ఉన్న నాలుగు లాకర్లను గురువారం తెరవనున్నట్లు ఏసీబీ డిఎస్‌పి శంకర్‌రెడ్డి వెల్లడించారు. లాకర్‌లతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన సోదాల్లో వెలుగు చూసిన అంశాలను పరిగణనలోకి తీసుకుంటే బహిరంగ మార్కెట్లో వీటి విలువ సుమారు రూ.100 కోట్లు వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ దాడుల్లో ఏసీబీ సిఐలు చంద్రశేఖర్, గిరిధర్, ప్రసాద్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

ట్రేసర్‌గా విధుల్లోకి...

1994లో ఎస్వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగంలో ట్రేసర్‌గా విధుల్లో చేరిన రుద్రకుమార్ 2005లో డ్రాఫ్ట్‌మ్యాన్ గ్రేడ్-2గా పదోన్నతి పొందారు. అనంతరం ఏడాదికే అసిస్టెంట్ ఇంజనీర్‌గా ప్రమోషన్ రావడం గమనార్హం.

వర్సిటీలోని అక్రమార్కుల్లో ఆందోళన

ఎస్వీయు చెందిన అసిస్టెంట్ ఇంజనీర్ రుద్రకుమార్ ఇంట్లో ఎసిబి అధికారులు దాడులు నిర్వహించడంతో ఇతర విభాగాలలోని అవినీతి అధికారుల్లోనూ ఆందోళన మొదలయ్యింది. వర్సిటీపై ఎసిబి నిఘా ఉంచిందని సమాచారం రావడం చర్చానీయాంశమైంది. మరికొంత మంది అవినీతి ఉద్యోగులపైనా దాడులు జరిగే అవకాశం ఉందని సమాచారం రావడంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు మొదలయ్యింది.

నెల్లూరులోనూ ఎసిబి దాడులు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

నెల్లూరులో రుద్రకుమార్ వియ్యంకుడు టీచర్ గోపాల్‌రెడ్డి ఇంట్లో ఎసిబి సిఐ శ్రీహరి నేతృత్వంలో దాడులు నిర్వహించారు. స్థానిక లక్ష్మీపురంలో నివాసముంటున్న ఆయన ఇంట్లో ఉదయం నుంచి జరిగిన దాడుల్లో కొన్ని డాక్యుమెంట్లు, సమాచారం దొరికి నట్లు ఎసిబి శ్రీహరి బాబు తెలిపారు.

భార్య వనితశ్రీ పేరుతో...

ఇళ్లు - 7

- తిరుపతి అర్బన్, ఎమ్మార్‌పల్లిలో రెండస్తుల భవనం(244 గజాలు)
- తిరుపతి రూరల్, పేరూరులో రెండస్తుల భవనం(357 గజాలు)
- తిరుపతి అర్బన్, ఎమ్మార్‌పల్లిలో ఆర్‌సిసి భవనం(1125)
- తిరుపతి అర్బన్, ఎమ్మార్ పల్లిలో భవనం(244 గజాలు)
- తిరుపతి రూరల్, పేరూరులో సిమెంట్ రేకుల షెడ్డు(122 గజాలు)
- తిరుపతి రూరల్, తుమ్మలకుంటలో రేకుల షెడ్డు (120 గజాలు)
- తిరుపతి చంద్రగిరి మండలం సిమెంట్ షెడ్డు (142 గజాలు)



స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి నగలు

ఇళ్ల స్థలాలు - 13

- తిరుపతి రూరల్, వడ్డిపల్లిలో 120 గజాలు
- తిరుపతి రూరల్, కుడిపట్లలో 223 గజాలు
- తిరుపతి రూరల్, పేరూరులో 122 గజాలు
- తిరుపతి రూరల్, తిరుచానూరులో 100 గజాలు
- తిరుపతి రూరల్, తుమ్మలకుంటలో 165 గజాలు
- తిరుపతి రూరల్, పేరూరులో 621, 416, 416 గజాలు (మూడు)
- తిరుపతి రూరల్, చంద్రగిరి మండలం, కోటలో 142 గజాలు
- తిరుపతి రూరల్, మిట్టపాళ్యంలో 194 గజాలు
- తిరుపతి అర్బన్, ఎమ్మార్‌పల్లిలో 244, 127 గజాలు (రెండు)

వ్యవసాయ భూములు - 3

- రేణిగుంట మండలం, గాజుల మాద్యంలో 50 సెంట్లు
- పుత్తూరు మండలం, గోవిందపాలెంలో 70 సెంట్లు
- పుత్తూరు మండలం, గోవిందపాలెంలో ఒక ఎకరం

రోడ్డు ప్రమాదాల్లో సగటున రోజుకు 400 మంది బలి

(మొదటిపేజీ తరువాయి)

తీస్తుందని ఈ సంస్థ హెచ్చరిస్తోంది. రోడ్డు భద్రతకు సంబంధించిన చర్యలు మన దేశంలో గతంలో కన్నా ఇప్పుడు ఏ మాత్రం పెరగనప్పటికీ ఈ చర్యలను ఎంత ఖచ్చితంగా అమలు చేస్తున్నారన్న అంశంపైనే ఇవి విజయవంతం కావటం ఆధారపడి వుంటుందన్నది నిర్వివాదాంశం. వాహనాల తయారీలో భద్రతా చర్యలను తప్పని సరి చేసే అంశంపై మన దేశంలో ఇప్పటికే 20 ఏళ్ల జాప్యం జరిగిందని నోయిడాలోని శివనాడార్ యూనివర్శిటీకి చెందిన ప్రొ.దినేష్ మోహన్ అభిప్రాయపడ్డారు. ఈ భద్రతా చర్యలను ప్రభుత్వాలు చట్టపరంగా తప్పనిసరి చేసేంత వరకూ వాహనతయారీ సంస్థలు ఎక్కడా అందుబాటులోకి తెచ్చిన దాఖలాలు కన్పించలేదన్నారు. ఇందుకు సంబంధించి కొత్త చట్టాన్ని తగిన సమయ ఇచ్చే అంశాన్ని రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ ప్రతినిధి తోసిపుచ్చారు.

జోయలుక్కాస్ దుకాణాలపై ఐటి దాడులు

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణా, గుజరాత్, మహారాష్ట్ర, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్‌ల్లోని దుకాణాలపైన దాడులు జరిగాయని ఐటి అధికారులు తెలిపారు.

విజయవాడలో షోరూమ్ మూసివేత

రాష్ట్ర వ్యాప్తంగానూ జోయాలుక్కాస్ శాఖల్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగానే విజయవాడలోని మహాత్మాగాంధీ రోడ్డులో గల జోయాలుక్కాస్ షోరూంలోనూ బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ తనిఖీలు చేపట్టారు. షోరూంలో గల పలు విభాగాలను పరిశీలించి కీలకమైన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఐటి శాఖ అధికారుల దాడుల కారణంగా బుధవారం షోరూంను మూసివేసి ఉంచారు. గురువారం ఉదయం యథావిధిగా షోరూం కార్యాకలాపాలను నిర్వహించనున్నట్లు విజయవాడ బ్రాంచి నిర్వాహకులు ప్రకటించారు. ఆదాయపు పన్ను శాఖకు కట్టాల్సిన పన్ను కట్టనందున సంస్థ వ్యాపార కార్యకలాపాలు ఏ విధంగా ఉన్నాయి, వ్యాపార నిర్వహణ ఎంత జరుగుతుందో తెలుసుకునేందుకు దాడులు నిర్వహిస్తున్నట్లు ఐటి శాఖ అధికారి ఒకరు తెలిపారు. అయితే దేశ వ్యాప్తంగా సంస్థ కార్యాలయాల్లో దాడులు జరుగుతున్నాయని, గురువారం సాయంత్రం నాటికి పూర్తి వివరాలను తెలియచేస్తామని అధికారులు చెపుతున్నారు.

నెల రోజుల నిరీక్షణ

'బాహుబలి' తర్వాత ప్రభాస్ చేస్తున్న సినిమా 'సాహో'. సుమారుగా రూ.200 కోట్లతో నిర్మిస్తున్నారు. యువీ క్రియేషన్స్ బ్యానర్‌లో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు 'రన్ రాజా రన్' ఫేమ్ సూజీత్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం కొత్త షెడ్యూల్‌ను దుబాయ్‌లో చేద్దామని చిత్రబృందం ప్రభాస్‌కు ముందు చెప్పింది. ఆ పిలుపు కోసం నెల రోజులుగా అన్ని పనులు మానుకొని ఎదురు చూస్తూనే ఉన్నాడు ప్రభాస్. పిలుపొచ్చింది కానీ దుబాయ్‌కు కాదు...మళ్లీ హైదరాబాద్‌లోనే షూటింగ్ చేద్దామని...ఈ కొత్త షెడ్యూల్‌లో భాగంగా హైదరాబాద్‌లోనే బుధవారం నుంచి చిత్రీకరణ ప్రారంభించారు. ప్రభాస్, శ్రద్ధా కపూర్, నాయిల్ నితిన్ ముఖేష్ షూటింగ్‌లో పాల్గొన్నారు. నెల రోజులు పాటు ఇక్కడే రెగ్యులర్‌గా చిత్రీకరణ జరగనుంది. హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్ కెనీ బేట్స్ ఇందులో స్టంట్స్‌ను కంపోజ్ చేస్తున్నాడు. ఈ చిత్రం కోసం ప్రభాస్ చాలా సన్నబడ్డాడు. ఆ ఫొటోలను తన ట్విట్టర్‌లో ఖాతాలో కూడా పెట్టాడు ఈ డార్లింగ్. అవి అభిమానులకు అలరిస్తున్నాయి.


ప్రభాస్


హృతిక్

క్రిస్మస్ 2020కి 'క్రిష్ 4'

'క్రిష్' ఫ్రాంచైజ్ రూపొందిస్తామని ఆ చిత్రాన్ని 2020 క్రిస్మస్‌కి విడుదల చేస్తామని హృతిక్ రోషన్ తండ్రి రాకేష్ రోషన్ ప్రకటించారు. బుధవారం హృతిక్ జన్మదినం సందర్భంగా ట్విట్టర్‌లో రాకేష్ ఈ ప్రకటన చేశారు. ఇప్పటి వరకూ వచ్చిన మూడు క్రిష్ ఫ్రాంచైజీల్లోనూ హృతిక్ రోషనే హీరోగా చేశాడు. 2003లో ప్రారంభమైన ఈ సైన్స్ ఫిక్షన్‌కు దర్శకత్వం, నిర్మాణం, కథా రచన అన్నీ రాకేష్ రోషనే చూసుకున్నారు. ప్రియాంక చోప్రా, రేఖ, నజరుద్దీన్ షా ముఖ్య పాత్రల్లో నటించారు. ప్రస్తుతం హృతిక్ 'సూపర్ 30' చిత్రం చేస్తున్నాడు. పేద పిల్లలకు ఐఐటీల ప్రవేశానికి ఉచితంగా శిక్షణ ఇచ్చే మేథమెటిక్స్‌లో జీనియస్ ఆనంద్ కుమార్ జీవిత కథ ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది.


విజయ్ దేవరకొండ

సమ్మర్‌లో వస్తున్నా

విజయ్ దేవరకొండ...పరిచయం అక్కర్లేని పేరు. 'అర్జున్ రెడ్డి'లో తన నటనతో యువ హృదయాలను తాకాడు. ఈ సినిమా తర్వాత భారీ సంఖ్యలో ఆయన సినిమా ఆఫర్లు వచ్చాయి. ఆయన ప్రస్తుతం పరశురామ్ దర్శకత్వంలో జీఏ2 బ్యానర్‌లో ఓ సినిమా చేస్తున్నాడు. ఈ చిత్రం సమ్మర్‌కు విడుదల చేయాలని భావిస్తున్నారు. కన్న భామ 'ఛలో' ఫేమ్ రష్మిక మండన్నా కథానాయికగా చేస్తుంది. ఈ సినిమాను ప్రేమకథా చిత్రంగా తెరకెక్కిస్తున్నారు. మే నెలలో విడుదల చేసి మరో హిట్‌ను కొట్టాలని యోచిస్తున్నాడు విజయ్. ఈ హీరో చేతి నిండా సినిమాలు ఉన్నాయి. ఈ ఏడాది మూడు సినిమాలు చేయాలని భావిస్తున్నాడు.

అభిమానులకైతే ఓకే

పవన్ కల్యాణ్, త్రివిక్రమ్ కాంబినేషన్ గురించి ప్రత్యేకంగా విశ్లేషించాల్సిందేమీ ఉండదు. మాటలతో మంత్రం వేసేవారు ఒకరైతే...నటనతో మెస్మరైజ్ చేసేవారు ఇంకొకరు. స్నేహితుడు కష్టాలో ఉంటే తానున్నానంటూ వచ్చి ఆదుకుంటాడు.. అతనే త్రివిక్రమ్. అలా చేసినవే 'అత్తారింటికి దారేది', 'జల్సా'. ఈ చిత్రాలు పవన్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్స్ కూడా. ఇప్పుడు కూడా 'సర్దార్ గబ్బర్ సింగ్', 'కాటమరాయుడు'...వరుస ఫ్లాప్స్ తర్వాత హిట్ ఇవ్వాలని వచ్చాడు మాటల మాంత్రికుడు. వీరి కాంబినేషన్‌లో చేసిన మూడో చిత్రమే 'అజ్ఞాతవాసి'. భారీ అంచనాలతో విడుదలైన చిత్రం ఈ కాంబినేషన్‌కు హ్యాట్రిక్ హిట్ ఇచ్చిందా? లేదా? చూద్దాం.



కథ : పారిశ్రామిక వేత్త, మిలియనీర్ గోవింద్ భార్గవ్ (బొమన్ ఇరానీ), తన కొడుకు ఒకేసారి హత్యకు గురవుతారు. ఈ తరుణంలో అతని భార్య ఇంద్రాణి (ఖుష్బూ) అజ్ఞాతంలో ఉన్న గోవింద్ మొదటి భార్య కొడుకు అభిషిక్త్ భార్గవ్ (పవన్ కల్యాణ్)ను రంగంలోకి దించుతుంది. తన తండ్రిని చంపిందెవరో తెలుసుకోవడం కోసం గోవింద్ భార్గవ్ ఆఫీస్‌లోనే మారు పేరుతో ఉద్యోగంలో చేరతాడు. అక్కడ అతడికి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? అభిషిక్త్ అనుమానించిన వాళ్లే అతడి తండ్రిని చంపారా?. కుట్రను ఛేదించి తండ్రిని చంపిన వాళ్లను ఎలా శిక్షించాడు? తండ్రి వ్యాపార సామ్రాజ్యాన్ని ఎలా తన అధీనంలోకి తీసుకున్నాడు అన్నది మిగతా కథ.

విశ్లేషణ :

త్రివిక్రమ్ సినిమాలో హీరో ఓ కుటుంబానికి వారసుడో, రక్షకుడో లేకపోతే సమాజాన్ని కాపాడేవాడో అయి ఉంటాడు...అతడు, ఖలేజా, సన్నాఫ్ సత్యమూర్తి, అత్తారింటికి దారేది వంటి చిత్రాలన్నీ ఆ తరహావే. ఈ చిత్రమూ ఆ కోవలోనే తీశాడు. ఈ చిత్రానికి పవన్ కల్యాణే మూలస్తంభం. ఓ దశలో ఆయన హీరోయిజం పైస్థాయికి వెళ్ళిపోయి ఆకస్మాత్తుగా ఎంటర్‌టైన్‌మెంట్ వేలో టర్న్ కావడంతో చిత్రంలో డెప్త్ పోతుంది. సినిమా మొత్తం లాజిక్ లేకుండా ఉంటుంది. వేల కోట్లకు అధిపతి అయిన హీరో అలా రోడ్డుకు అడ్డంగా నడిచొస్తుంటాడు. అసిస్టెంట్లు అతను నడిచే మార్గంలో ఏ అడ్డంకీ రాకుండా చూస్తుంటారు. పైగా అదే దారిలో బైక్ మీద ఒక కుర్రాడు దూసుకొస్తుంటాడు. హీరో తన పాటికి తాను నడుచుకుంటూ పోతుంటాడు. హీరో అసిస్టెంట్లు ఆ బైకు మీది నుంచి కుర్రాడిని లాగి విసిరికొడతారు. బైక్ ఎక్కడో ఎగిరి పడుతుంది...ఇదేం లాజిక్కో అర్థంకాదు. ఇలా సినిమా అంతా లాజిక్ లెస్‌గా సాగుతుంది. అదేవిధంగా సెకండాఫ్‌లో కంపెనీ సీఈవో పవన్ అని అందరికీ తెలుస్తుంది కానీ అతన్ని బోర్డుమీటింగ్‌కు రానీయకుండా అసిస్టెంట్లే అడ్డుకుంటారు. ఇదీ అలాంటి సన్నివేశమే.

తండ్రిని కోల్పోయిన వ్యక్తి... తన తండ్రిని చంపిందెవరో తెలుసుకోవడానికి తన ఆఫీసులోనే వేరే పేరుతో ఉద్యోగంలో చేరిన వ్యక్తి చేసే చేష్టలు, వచ్చిన పనికి సంబంధం ఉండదు. బాధ్యతలను విస్మరించి అతను చేసే పనులు.. హీరోయిన్లతో సయ్యాటలు.. అందరితో పరాచికాలు. త్రివిక్రమ్ ఎంతటి చమత్కారి అయినా తండ్రిని కోల్పోయిన బాధ చూపించకపోవడం.. అతడితో అన్నీ కామెడీ వేషాలే వేయించడంలో ఆంతర్యమేంటో అర్థం కాదు. అంతా పేలవంగా ఆడిన 'ఖలేజా'లో కూడా ఎంటర్‌టైన్‌మెంట్‌కు ఏమాత్రం ఢోకా ఉండదు. మళ్లీ మళ్లీ చూసి ఎంజాయ్ చేసేలా ఉంటుంది అందులోని వినోదం. 'సన్నాఫ్ సత్యమూర్తి'లో కూడా ఆసక్తి రేకెత్తించే సన్నివేశాలకు లోటుండదు. కథ బలహీనంగా ఉన్నా.. తనదైన సెన్సాఫ్ హ్యూమర్‌తో సన్నివేశాల్ని నడిపించి ప్రేక్షకుల్ని వినోదంలో ముంచెత్తడం త్రివిక్రమ్ బలం. అవేవీ ఈ చిత్రంలో కనిపించకపోవడం తీవ్రమైన లోటు. కథానాయికల పాత్రలకు ప్రాధాన్యం లేదు. కథానాయికలిద్దరనీ లేడీస్ టాయ్‌లెట్‌లోనే హీరో కలుసుకుని ప్రేమించడం విడ్డూరంగా అనిపిస్తుంది.

హీరోకి తగ్గ విలన్‌ని కూడా ఎంపిక చేయలేదు. పవన్ ఒక్కడే చిత్రాన్ని నడిపించాలన్నట్టు ఆలోచించాడు త్రివిక్రమ్. సినిమా అంతా అతనే నడిపించేలా చేశాడు. పవన్ మాత్రం తన అభిమానుల్ని అలరించే చేష్టలతో, తన మార్కు మేనరిజాన్ని ప్రదర్శించాడు. ప్రతినాయకుడు బలవంతుడైతేనే నాయుకుడు సత్తా తెలుస్తుంది. ఈ చిత్రం అది ప్రధాన లోపం. ఈ చిత్రం కథాంశంలోనూ కొత్తదనం లేక తేలిపోయింది. కార్పొరేట్ కంపెనీలో జరిగే ఆధిపత్య పోరు మినహా కథలో నావెల్టీ లేకపోవడం ప్రధాన లోపం. చాలా సన్నివేశాలు గ్రిప్పింగ్‌గా లేవు.

సంగీత దర్శకుడు అనిరుధ్ కూడా ఆకట్టుకోలేకపోయాడు. పవన్ పాడిన 'కొడకా కోటీశ్వరావు.. ఎంట్రీ సాంగ్ వినడానికి బాగుంది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను హెవీ సన్నివేశాల్లో బాగా చేశాడు. ముగింపులో సవతితల్లి కొడుకు ఏడుస్తూ ఉండే సీన్ సెంటిమెంట్‌ను పండించలేదనే చెప్పాలి. ఫ్లాష్‌బ్యాక్ కూడా అంతే. పవన్ ఎవరో ఓ పోలీసు ఆఫీసర్ ఊహలోంచి సమాధానం వస్తుంది. గోవింద్ భార్గవ్‌ను ఎవరు చంపారనేది కనిపెట్టలేకపోతారు. ఇక ఖుష్బూ పర్సనాలిటీ తగ్గట్లు సింపుల్ పాత్ర సరిపోయింది. మిగిలిన నటుల నుంచి చక్కని నటనను రాబట్టుకోలేకపోయాడు త్రివిక్రమ్. నిర్మాణపు విలువలు, కెమెరా పనితనం హైలైట్‌గా ఉంది. "విచ్చలవిడిగా చేస్తే విధ్వంసం.. విచక్షణతో చేస్తే ధర్మం" వంటి తత్వానికి చెందిన డైలాగుల్లో త్రివిక్రమ్ మార్కు కనిపిస్తుంది. టైటిల్ ఏంటో చెప్పడం కోసం పాండవుల కథ చెబుతాడు కానీ అదీ అర్థం కాదు. మొత్తానికి అభిమానుల కోసం తీసిన చిత్రంగా ఉందనిపిస్తుంది.

నటీనటులు : పవన్ కల్యాణ్, కీర్తి సురేశ్, అను ఇమ్మాన్యుయేల్, ఆది పినిశెట్టి, ఖుష్బూ, బొమన్ ఇరానీ, రావు రమేష్, మురళీ శర్మ, తనికెళ్ల భరణి, వెన్నెల కిషోర్, రఘుబాబు, పవిత్ర లోకేష్, జయప్రకాష్, సమీర్, అజయ్ తదితరులు
సాంకేతికత : సంగీతం : అనిరుధ్ రవిచందర్, ఛాయాగ్రహణం : మణికందన్, నిర్మాత : సూర్యదేవర రాధాకృష్ణ, రచన : దర్శకత్వం: త్రివిక్రమ్.

– పెండ్యాల మురళి

మహిళా దర్శకుల సంఖ్య పెరగాలి

ఇండస్ట్రీలో మహిళా దర్శకులు ఇద్దరు, ముగ్గురే ఉన్నారు. ఇంకా ఎంతోమంది స్ఫూర్తి పొంది మంచి సినిమాలు తీయాలి. మహిళా దర్శకుల సంఖ్య మరింత పెరగాలి. వారందరికీ నా స్వాగతం. వెబ్‌సిరీస్ చేసే ఆలోచన లేదు. నా ఫోకస్ అంతా సినిమాల మీదే. సినిమాకి ఉన్నంత క్రేజ్ వెబ్ సిరీస్‌కి ఉండదు" అని దర్శకురాలు జయ బి. అన్నారు. గురువారం ఆమె పుట్టినరోజు సందర్భంగా బుధవారం విలేకరులతో మాట్లాడారు.

దర్శకురాలు జయ బి.



'వైశాఖం' చిత్రం పూర్తిగా నాకు సంతృప్తిని కలిగించింది. మంచి సినిమా తీశారని అభినందలు వచ్చాయి. ప్రస్తుతం మా ఆర్.జె. సినిమాస్ బేనర్‌లో 'లక్కీఫెలో' చిత్రాన్ని రూపొందిస్తున్నాం. జూన్‌లో సినిమా స్టార్ట్ చేసి మూడు నాలుగు నెలల్లో షూటింగ్ కంప్లీట్ చేస్తాం. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. ఓ యంగ్ హీరో ఈ చిత్రంలో నటిస్తున్నారు. ఆ హీరో ఎవరనేది త్వరలోనే ఎనౌన్స్ చేస్తాం. జనరల్‌గా కొంతమందికి అన్‌ఎక్స్‌పెక్టెడ్‌గా, విచిత్రంగా ఒక ఛాన్స్ వస్తుంది. అది రాగానే అందరూ వాడు 'లక్కీఫెలో'రా అని చెప్తారు. అతను ఆ ఛాన్స్ కోసం ట్రై చేయకపోయినా గొప్ప ఛాన్స్ వస్తుంది. అది చాలా రేర్‌గా జరుగుతుంది. అది హీరో క్యారెక్టరైజేషన్. ఆ ఛాన్స్‌ని హీరో ఎలా తీసుకుంటాడు? మిస్ యూజ్ చేసుకుంటాడా? ఇంకా హైట్స్‌కి వెళ్తాడా? అనేది కాన్సెప్ట్. హ్యూమన్ సైకాలజీని బేస్ చేసుకుని సబ్జెక్ట్ రెడీ చేస్తున్నాం. సమాజంలో ఆడవాళ్లకి చిన్న చిన్న ఇబ్బందులు ఎదురవుతుంటాయి. అవి మానసికంగా చాలా అల్లకల్లోలం చేస్తుంటాయి. ఆ పాయింట్ ఇంతవరకూ ఎవరూ టచ్ చేయలేదు. జనరల్‌గా టెన్త్, ఇంటర్మీడియేట్, డిగ్రీ చదివే అమ్మాయిలు బస్సుల్లో ప్రయాణించేటప్పుడు మగవాళ్ళు కావాలని కొంతమంది, అనుకోకుండా కొంతమంది అమ్మాయిల్ని టచ్ చేస్తారు. ఆ టైమ్‌లో అమ్మాయిలు చాలా ఎలర్జీకి గురవుతారు. ఆ టచ్ వాళ్లని చాలాకాలం వెంటాడుతుంది. ఇలాంటి కొన్ని సెన్సిటివ్ అంశాలని హీరోయిన్ డీల్ చేస్తుంది. పాటలకి, రొమాన్స్‌కే కాకుండా హీరోయిన్ క్యారెక్టర్‌కి ఓ పర్పస్ ఉండాలని ట్రై చేస్తున్నాం. ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటూనే అండర్ కరెంట్‌లో కొంత మెస్సేజ్ ఉంటుంది. నా ఫస్ట్ సినిమా 'చంటిగాడు' నుండి 'వైశాఖం' వరకు ఎంటర్‌టైన్‌మెంట్‌ని మిస్ కాలేదు. బేసిగ్గా ఎంటర్‌టైన్‌మెంట్ బాగా ఇష్టపడ్తాను. నా సినిమాల్లో ఇది కచ్చితంగా ఉండేలా చూస్తా.


అనుష్క శర్మ

'పారి'..సాహస గాథ కాదు

అనుష్క శర్మ వివాహం తర్వాత మళ్లీ కెమెరా ముందుకు రెండు రోజుల క్రితమే వచ్చిన సంగతి తెలిసిందే. అనుష్కను ఇప్పటి వరకూ ఎప్పుడూ చూడని అవతారంలో చూడబోతున్నాం. ఈమె 'పారి' అనే హారర్ చిత్రంలో నటిస్తుంది. బుధవారం తన ట్విట్టర్ ఖాతా ద్వారా "స్వీట్ డ్రీమ్స్ గాయిస్" అని పేర్కొంటూ టీజర్‌ను విడుదల చేసింది. "పారి' సాహస గాథ కాదు' అని ట్యాగ్‌లైన్‌లో చెప్పింది. అందులో అనుష్క ముఖం నిండా గాయాలతో కనిపించింది. కల్లు మాత్రం ఎర్రగా ఉన్నాయి. దీంతో పాటు మరో వింత ఫొటోనూ పోస్టు చేసింది. కొద్ది భయంకరంగా ఉంది. ప్రోసిత్ రాయ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మార్చి రెండో తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

మనసుకు నచ్చింది


'మనసుకు నచ్చింది' చిత్రంలో సందీప్ కిషన్, అమైరా దస్తూర్

ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, ఇందిరా ప్రొడక్షన్స్ పతాకాలపై సంజయ్ స్వరూప్, పి.కిరణ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మనసుకు నచ్చింది'. సందీప్ కిషన్, అమైరా దస్తూర్ జంటగా నటించిన ఈ చిత్రం ట్రైలర్‌ను మహేష్ బాబు ఫేస్ బుక్, ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు. ఈ చిత్రం ఈనెల 26న విడుదల కానుంది.

దర్శకనిర్మాతలు మాట్లాడుతూ "ట్రైలర్‌కి విశేషమైన స్పందన లభించింది. రొమాంటిక్ డ్రామాగా రూపొందిన ఈ చిత్రం ట్రైలర్ అందరికీ నచ్చుతుందన్న నమ్మకం ఉంది. రాధన్ సంగీత సారథ్యంలో రూపొంది ఇప్పటివరకూ విడుదలైన పాటలకు కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది. త్వరలోనే ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహిస్తామ'ని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం : రాధన్, ఎడిటర్: సతీష్ సూర్య, కళ : హరివర్మ, సినిమాటోగ్రఫీ : రవి యాదవ్, మాటలు : సాయిమాధవ్ బుర్రా, నిర్మాతలు : పి.కిరణ్–సంజయ్ స్వరూప్.

సంగమం

ప్రజాశక్తి

www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

విజయవాడ | గురువారం 11 జనవరి 2018 | 11

సంస్కృతి, కళలపై రచనలకు ఆహ్వానం!

ఇది కళలు, సంస్కృతి, రంగస్థలం తదితర అంశాలపై ప్రత్యేక పేజీ. మీ ప్రాంత సంస్కృతి, జానపద కళలు, వాటి ప్రత్యేక విశేషాలు; నాటకం, చిత్రకళా ప్రదర్శనలపై మీరూ వ్యాసాలూ, నివేదికలూ రాసి పంపవచ్చు. సాంస్కృతిక రంగంలో వస్తున్న మార్పుల మంచిచెడ్డలపై విశ్లేషణాత్మక వ్యాసాలు రాయవచ్చు.

మా చిరునామా : సంగమం, ప్రజాశక్తి, ఎంబి విజ్ఞానకేంద్రం, గవర్నరుపేట, విజయవాడ- 2.

ప్రదర్శన

మళ్ళీ కళ్ళకు కట్టిన 'కళ్ళు'

గతం గతః.. అంటాంగానీ, నిజానికి అవసరమైనప్పుడు గతాన్ని తవ్వుకోవాలి. మనసుపెట్టి చాలా ఇష్టంగా తవ్వాలి. అందులో దొరికే కాసిన్ని వజ్ర వైఢూర్యాలు వంటి గుప్త నిధులూ ఏరుకోవాలి. అలా ఏరుకున్నవాటిని.. వర్తమానం, భవిష్యత్తు తరాలకోసం పదిలంగా దాచిపెట్టాలి. అలాంటి నిత్యచేతనమైన గుప్తనిధిలాంటిదే 'కళ్ళు' నాటిక. ఈ.. ఉపమానం విడ్డూరంగా ఉండొచ్చుకానీ.. పాతకాలపు సాహిత్యాన్ని పట్టుబట్టి, మనసంతా పూసుకుని, రాసుకోవాలంటే ఇలాంటి అక్షర నిక్షేపాల జోలికి వెళ్ళక తప్పదు. తెలుగునాట 'కళ్ళు' నాటిక, ఈ నాటిక ప్రేరణతో వచ్చిన 'కళ్ళు' సినిమా అలాంటివే!





ఇటీవల విజయవాడ కేంద్రంగా మాకినేని బసవపున్నయ్య కళావేదికపై– నాటక రచయిత, ప్రయోక్త, నటుడు, రచయిత గొల్లపూడి మారుతీరావు రచన చేసిన 'కళ్ళు' సినిమాకు మూడు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా ముఖీమీడియా ప్రధాన భూమికతో ప్రత్యేక ప్రదర్శనా వేడుక నిర్వహించారు.

కళ్ళు.. ఓ ప్రత్యేకం

దశాబ్దాల పండగలు నిర్వహించుకోవడం షరా మామూలే. కానీ, రెండు వేర్వేరు మాధ్యమాలకు చెందిన నాటకం, సినిమా అనే కళలను ఒకే వేదికపై ప్రదర్శించడం ఇక్కడ విశేషం. దీనివల్ల కళ్ళు అనే రచనలోని గొప్పతనాన్ని, ఆ రచనలోని సైద్ధాంతిక, ప్రతీకవాద అంశాలను.. నేటితరమూ తెలుసుకునే అవకాశం దక్కింది. మాధ్యమాల విస్తృతి, సాంకేతిక మార్పులు, నూతన ఆవిష్కరణలు, కొత్త జీవన విధానాల కారణంగా గత కాలపు సాంస్కృతిక వైభవాన్ని మర్చిపోతున్న పరిస్థితి నేడు ఉంది. అలాంటి తరుణంలో నాటి, నేటితరాన్ని ఒకచోట కూర్చోబెట్టి.. పాతకాలపు జ్ఞాపకాలను 'కళ్ళు' అనే రూపంలో పన్నీటిలా చల్లాలనుకోవడం ఒకింత సాహసమే! ఈ విషయంలో ముఖీమీడియా, ఇతర సహకార సంస్థలను మనసారా మెచ్చుకోవాల్సిందే.



అప్పట్లో సంచలనం

రచయిత గొల్లపూడి కలంలో నలభై ఏళ్ల క్రితమే పుట్టిన 'కళ్ళు' నాటిక రచన.. అప్పట్లో ఓ సంచలనం. నాటకకళ నాటి సమాజాన చైతన్యభరితమైన సాధనంగా ప్రజలు ఆదరిస్తున్న సమయాన ఆ నాటిక అనేకానేక ప్రశంసలు పొందింది. పరివర్తనమైన రంగస్థలాల దగ్గర నుంచి.. కాలేజీ క్యాంపస్‌ల వరకూ ఆ నాటికను విపరీతంగా ఆడేవారు. అలా ఆడినవారిలో తర్వాత కాలంలో వెండితెరను ఏలినవారూ ఉన్నారు. ఉదాహరణకు నటుడు కోట శ్రీనివాసరావు, ఆయన తమ్ముడు శంకర్రావు.. ఇంకా అనేకం. ఇంచుమించు దశాబ్దకాలంపాటు పరిషత్ నాటక పోటీల్లో 'కళ్ళు' నాటికకు బహుతులు వెల్లువెత్తేవి. అవార్డులు, బహుమతులకు మించి నాటికలోని ఆలోచనా తీవ్రతపై పదేపదే చర్చించుకునేలా చేసిందన్నది నాటి నాటకరంగపు పెద్దలమాట. ఇలా తెలుగు, తెలుగేతర రంగస్థలాలపైనా ఎన్నో ప్రదర్శనలు జరుపుకొని, అనేక బహుమతులను పొందిన 'కళ్ళు' నాటిక రచనకు 1975లో సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

కళ్లు కథలో ఏముందంటే ...

అది తోడూ నీడాలేని ఓ ఐదుగురు మనుషుల ఓ అంధ ప్రపంచం. ఎక్కడ పుట్టారో, ఎలా పెరిగారోగానీ భిక్షాటన వృత్తిలో ఒక్కటిగా కలిశారు. కష్టం, నష్టం, సంతోషం, బాధ, ఆకలి, ఆటాపాటా ... ఏదైనా సమంగానే పంచుకుంటారు. ఓదార్చుకుంటారు. ఒకరికోసం ఒకరు త్యాగం చేసుకునేంత పెద్ద మనసు వారిది.

పెద్దయ్య, కరీం, రాజీగాడు, రంగడు, సీతాలు జానెడు పొట్ట నింపుకునేందుకు చేసే ఆకలి పోరాటంలో ఒకరికి మరొకరు అండగా ఉంటారు. వీళ్ల అంధత్వాన్ని ఆసరాగా చేసుకొని, వారిని తెలివిగా దోపిడీ చేస్తారు పూజారి బసవయ్య, సింహాచలం. ఇలా నాటికలోని పాత్రలన్నీ నాటి, నేటి సమాజపు పోకడల్ని కళ్ళకు కడతాయి.

భిక్షాటనతో వచ్చిన డబ్బులతో తమలోని ఒకరికి కళ్లు తెప్పించాలని, అలా ఒకరికి కళ్ళు వచ్చాక, కొత్తగా ప్రపంచాన్ని చూసినవారు మిగిలిన జీవితాలను ఆదుకోవాలని, నియమం పెట్టుకుని ఓ నిర్ణయం తీసుకుంటారు... ఆ ఐదుగురూ. అందులో ప్రతి ఒక్కరూ తమకు కాకుండా తోటివారికి కళ్లు రావాలని కోరుకుంటారు. అలా ఒకరిపై ఒకరు తమ ప్రేమను, అభిమానాన్ని ప్రకటించుకునే క్రమంలో ఒక్క రంగడికి తప్ప మిగిలిన వారెవరికి కళ్లు వచ్చే అవకాశమే లేదని, వచ్చినా లాభం ఉండదని తెలుస్తుంది. తమలో యువకుడైన రంగడికి కళ్లు తెప్పించడానికి వారంతా ఓ నిర్ణయానికి వస్తారు.

భిక్షాటన చేసి, దాచుకున్న డబ్బులతో కంటి ఆపరేషన్ చేయిస్తే రంగడికి కళ్లు వస్తాయి. అలా చూపు వచ్చిన రంగడి దృష్టి చుట్టూ ఉన్న ప్రపంచంపై పడుతుంది. తాము బతికే స్థితి, తిండి, దారిద్ర్యం తాండవిస్తున్న దీనస్థితిని చూసి అసహ్యపడతాడు. ఇన్నాళ్లూ ఏ మనుషులతో సహజీవనం చేశాడో, ఆ మనుషుల బాహ్యమైన స్థితి అతడికి ఏవగింపు కలిగిస్తుంది. అదే సమయంలో పూజారి బసవయ్య చేస్తున్న మోసాన్ని చూసి రంగడిలో స్వార్థం మొలకెత్తుతుంది. కళ్లున్న రంగడు కళ్లులేని తమవారిని, మరికొందరిని అడ్డం పెట్టుకొని వ్యాపారం మొదలెడతాడు. అహంకారం ఒంటికి పడుతుంది. తోబుట్టువులాగా కష్టసుఖాల్లో తోడుగా ఉన్న సీతాలపై అత్యాచారం చేయబోతాడు. సీతాలు తనను తాను రక్షించుకునే క్రమంలో గుడిలోని అమ్మవారి చేతిలోని శూలాన్ని రంగడిపై విసురుతుంది. ఫలితంగా రంగడు తిరిగి గుడ్డివాడైపోతాడు. చివరికి ఆత్మపరిశీలన చేసుకున్న రంగడిని తన అంధ స్నేహితులు క్షమించి కలిసిపొమ్మని కోరినాగానీ, వారిలోని మంచితనం, మానవత్వాన్ని భరించలేని రంగడు వారి నుంచి శాశ్వతంగా విడిపోతాడు. ఇదీ సూక్ష్మంగా నాటిక సారాంశం.

భిక్షాటన చేస్తూ బతుకు సాగించే జీవితాలను ఇతివృత్తంగా చేసుకుని రాసిన ఈ నాటికలోని పాత్రల సంభాషణలు, పాత్రల వ్యక్తిత్వాలు, స్వభావాలు సమాజపు పోకడలపై చెంపపెట్టులా సాగుతుంటాయి. ప్రేక్షకులను ఆలోచనలో పడేస్తాయి. విశాఖపట్నానికి చెందిన నటుడు, దర్శకుడు సంగమేశ్వరరావు దర్శకత్వంలో ఈ నాటిక ప్రదర్శన రసస్ఫూర్తిని చాటింది. అనుభవంగల నటీనటులు పాత్రోచితంగా నటించారు.


సినిమాకు 30 ఏళ్ళు

'కళ్ళు' నాటిక ఆధారంగా 'కళ్ళు' సినిమా తీశారు. మగమహారాజు, స్వాతిముత్యం, సిరివెన్నెల, సితార, అన్వేషణ, మహర్షి వంటి జనాదరణ పొందిన పలు చిత్రాలకు కెమెరామెన్‌గా పనిచేసిన ఎంవి రఘు ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమయ్యారు. మహాశక్తి బ్యానర్‌పై శివాజీరాజా నటించిన ఈ చిత్రం 1988 విడుదలైంది. ఆ రోజుల్లో ఆరు సెంటర్లలో 100 రోజులు పూర్తి చేసుకున్న చిత్రమిది. అప్పట్లో 'కళ్ళు' నాటికను సినిమాగా తీయాలని దర్శకరత్న దాసరి, నిర్మాత రామానాయుడు వంటి వారూ ప్రయత్నించారు. కానీ, కాలేజీ చదివే రోజుల నుంచీ ఆ నాటికతో ఎంతో అనుబంధమున్న ఎంవీ రఘు.. తన చిరకాల వాంఛగా.. సినిమాగా తీసుకొచ్చారు. ఈ సినిమాలో శివాజీరాజాతో సహా చిదంబరం, భిక్షు వంటి ఎంతోమంది కొత్త నటులు పరిచయమయ్యారు. వీరందరికీ 'కళ్ళు' అనే ట్యాగ్ తమ పేరు ముందు స్థిరపడిపోయింది.

ఒకప్పుడు 'కళ్ళు' నాటిక చూసి.. ఆ నాటిక రచయితను సంతోషంతో భుజాన ఎత్తుకుని, జేజేలు పలికిన ఎంవీ రఘు.. 'కళ్ళు' నాటికను సినిమాగా మలచే విషయంలో ప్రాణంపెట్టి, ఎంతో ఇష్టంగా పెద్ద కసరత్తే చేశారు. మూలకథ ఆధారంగా కథ నిడివిని, ఇతర పాత్రలు, సన్నివేశాలు రూపొందించుకునే విషయంలో తన సినిమా అనుభవాన్నంతా రంగరించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంగీతం మరో ప్లస్ పాయింట్. గేయ రచయిత సిరివెన్నెల స్వీయ రచన 'తెల్లారింది లేవండోయ్ కొక్కొరొక్కో' పాట ఆయన గొంతులో ఇప్పటికీ కోడై కూస్తూనే ఉంది.

మొత్తానికి దశాబ్దాలు దాటుతున్నా 'కళ్ళు' నాటిక, సినిమా ఇప్పటికీ ఇంకా ఏదో కొత్తగా చెప్తూనే ఉంది. 'కళ్ళు' సినిమాకు ముప్పయ్యేళ్ళ పండగ చేసి.. ఆ సినిమాను, నాటికను కళ్ళకు కట్టినట్టు చేసిన ముఖీమీడియా, సుమధుర కళానికేతన్, ఇతర సహాయక పరివారం అభినందనీయులు.

- గంగాధర్ వీర్ల



ఎంతో కష్టపడ్డాం!

కళ్ళు ఉండీ మనసుతో చూడలేని వారు గుడ్డివారు.. అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా తీశా. ఇందులో క్యారెక్టర్ల కోసం చాలామందిని చూడాల్సి వచ్చింది. అంతా.. ఒక తపస్సులాగా ఈ సినిమా చేశాం. ఈ సినిమాకు నందితోపాటు సుమారు 30 అవార్డులు వచ్చాయి. ఈ తరం దర్శకులూ 'కళ్ళు' లాంటి చిత్రాలు తీస్తే మంచిదని నా ఉద్దేశం.

ఎంవీ రఘు
దర్శకుడు, సినిమాటోగ్రాఫర్



నేటితరం కోసం ...

'కళ్ళు' సినిమా.. తరాలు మారినా వెంటాడుతూనే ఉంటుంది. 'కళ్ళు' నాటిక.. అప్పట్లో ఎంతో సంచలనం. నాటికలానే 'కళ్ళు' సినిమా అంతే విమర్శలు, అవార్డులు దక్కించుకుంది. సమాజాన్ని ఆలోచింపచేసే 'కళ్ళు' నాటిక, సినిమాను నేటితరానికి చూపించాలనే తపనతో రచయిత, దర్శకుల మధ్య ముప్పయ్యేళ్ల వేడుక చేశాం. చాలా తృప్తి కలిగింది.

పావనీ ప్రసాద్
ముఖీమీడియా, ఫోన్ : 79970 79777

విమర్శ

నాటకీకరణలో తిలక్ కథకు తిలోదకాలు

స్థలం : గుంటూరు, వేదిక శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరం.
సందర్భం, తేదీలు : అజో –విభొ– కందాళం ఫౌండేషన్ వారి రజతోత్సవ నాటిక పోటీల సభల సమారోహం.. జనవరి 4 నుంచి 7 వరకూ.
విశేషం : కొన్ని వందల కథలను గత పాతికేళ్లుగా నాటికలుగా మార్చి పోటీ ప్రదర్శనలను అందిస్తున్న ఘనతగల సంస్థ అజో–విభొ–కందాళం ఫౌండేషన్. తుది ప్రదర్శనకు ఎంపికైన ఈ నాటికల సంపుటి కూడా గత పద్నాలుగేళ్లుగా ప్రచురిస్తోంది ఈ సంస్థ.

నాటికలుగా కథలని మార్చడానికి పూనుకుంటున్న వారిలో మూలకథ పట్ల నిబద్ధత, రచయిత చెప్పదల్చుకున్న విషయం పట్ల విధేయత చాలా అవసరం. ఇవి కొద్దిగా ప్రదర్శనలో మార్పులకు లోనైనా, ఆ కథ దృష్టికోణం, పరిధి, పరిమితి లేదా విశాలత, రాసిన కాల ప్రభావం, వీటిని దెబ్బతీసేలా మార్పులు చేయకూడదు. ఉదాహరణకు అరవై ఏళ్లనాటి కథ అంటూ, అందులో ఆ కాలపు పరిమితులను దాటి, నాటికగా మార్పులు చేయకూడదు. ఒక కథను ఆ కథా రచయిత ఇవాళ సజీవుడు కాకపోయినా, తాము చేసే మార్పులు, ఆయన స్ఫూర్తికి భంగం కలుగచేయకుండా చూసుకోవడం నాటిక రచయితల బాధ్యత.

ఎక్కువ శాతం ఈ నాటికలను వీటి మూల కథారచనలతో పాటు పోల్చి చూడవల్సి ఉంది. కథ చిన్నది అయితే, అందుకు ఒక ప్రారంభ దృశ్యం పొడిగించవచ్చు. కొన్నిసార్లు కథను రచయిత మొదలుపెట్టిన చోటి నుంచి కాక మధ్య నుంచి మొదలు పెట్టి, కొత్త ట్రీట్మెంట్‌తో నాటికగా రూపొందించవచ్చు.

అయితే ఈ కథా నాటికీకరణ ప్రయత్నాల పట్ల ఒకింత నిశిత శ్రద్ధ అవసరం. ఉదాహరణకు ఈ సంవత్సరం వేడుకల తొలిరోజు, తొలి ప్రదర్శనగా, కళాంజలి, ప్రగతినగర్, హైదారాబాద్ వారి నాటిక 'అనంతానంతం' పేరిట దేవరకొండ బాలగంగాధర తిలక్ కథ, 'ఊరి చివర ఇల్లు' ప్రదర్శించారు. ఈ కథను నాటికగా మలిచినది ఎ.భాస్కర చంద్ర. దర్శకత్వం కొల్లా రాధాకృష్ణ. కథాకాలం 56 ఏళ్ల కిందట, లాంతరు వెలుగులో ఈ కథ జరిగిందని గమనించాల్సిందిగా నాటిక ఆరంభంలో, తెర వెనుక నుంచి వారే కోరారు కూడా. అయితే ఈ స్పృహ, తెర లేచిన క్షణం నుంచే ప్రదర్శనలో లోపించింది.

★ ఇల్లు ఊరి చివర ఉన్న పాత కొంప. ఆ పాతదనం ఏమీ లేకుండా, తెల్లని యవనిక కట్టి, దానిపై, కొన్ని నాట్యభంగిమల బొమ్మలు పెట్టారు. వాడిన ఫర్నిచర్‌లో ఒక సోఫా అవసరం అనుకుంటే, ఒక కర్రసోఫా ఏర్పాటు చేసుకోకుండా, స్టీల్‌ఫ్రేమ్ సోఫా కొట్టొచ్చినట్టుగా ఉంచారు. కథకు అనుగుణంగా రంగస్థలి తీర్చడంలో ఏమీ శ్రద్ధ తీసుకోలేదని స్పష్టం చేస్తుంది.



★ కథలో మూడే పాత్రలు రాశారు తిలక్. ఒక ముసలి స్త్రీ, ఒక పాతికేళ్ళ లోపు మహిళ. వారి ఇంటికి వచ్చే, వానలో చిక్కుకున్న ఒక వ్యక్తి. నాలుగో పాత్ర కథలో వర్షం. ఈ వర్షం కష్టాలకు సంకేతం. ఈ మూడు పాత్రల జీవితాల్లో కూడా కష్టాల వర్షం ఉంది. తోడు లేని కష్టం యువతిది కాగా, ముసలితనంలో ఆలంబన లేకుండా దినదిన గండంగా, ఈ యువతిని ఆశ్రయించి బతుకుతున్నది ముసలి స్త్రీ. మూడవవారు ఒక సాంగత్యం కోసం బతుకులో అలమటిస్తున్న వ్యక్తి. వీరి లోపలి కడగండ్ల, బయటి వాన వడగళ్ళ భావావేశాల రంగభూమి ఈ కథ. ఈ విలువైన సృజనావరణ ఎరుక లేకుండా, దీన్ని వీరు నాటికగా తమ ఇష్టం వచ్చినట్టు మార్చారు.

★ ముసలి స్త్రీ పాత్రను ముసలి మగవాడి పాత్రగా మార్చారు. కథలో ఎంత ఊరి చివర ఇల్లు అయినా, ఇంటి లోపలికి సరాసరి తాగుబోతులు వచ్చేయడం, వారితో ఈ ముసలి వ్యక్తి, ప్రాక్టికల్ జోక్‌గా తాము మనుషులం కాదు, దెయ్యాలం అని చెప్పడం, అతనితో, ఆ ఇంట్లో ఉంటున్న ఆ యువతీ మాట్లాడడం, అటు కథలో లేదు సరికదా, నాటికకు కూడా, కొంత ప్రదర్శన సమయాన్ని పెంచడం తప్ప, ఎటువంటి విలువనూ జోడించలేదు. ముసలి పాత్ర జాషువా పద్యాలు పాడడం కూడా ఏ సెంటిమెంట్ మీద ఆడుకోవాలని వీరు భావించినా, నిక్షేపంగా మనుషులు జీవించే ఇంట్లో శ్మశానంలా 'ఇచ్చోటనే' అంటూ ముసలి పాత్ర పాడడం ఊహించిన, నాటికలో జోడించిన వీరి ఊహాశక్తి నిరసించదగ్గది.

★ కథలో తన చిన్ననాటి స్నేహితుడు, అప్పట్లో ఇష్టసఖుడు అయిన విజయ్ కోసం, యువతి ఎదురుచూస్తూ ఉంటుంది. ఈలోగా పరిస్థితుల ప్రాబల్యం వల్ల ఆమె శరీరాన్ని అమ్ముకునే వృత్తిలో ఉంటుంది. వాన పడుతున్న రోజున, ఆమె గర్భస్రావం అయిన లేతదశలో ఉంది. ఇదంతా కథను నాటిక చేసినవారికి పట్టలేదు. ఆమెను యవ్వనవతిగా చూపుతూ, ఇరవై ఏళ్ల కిందట పెళ్లి అయి దుబాయి వెళ్ళిపోయి అక్కడ నుంచి ఈ ఇరవై ఏళ్ళుగా రాని భర్త (నాటికలో రవీంద్ర) కోసం ఎదురు చూస్తున్నట్టుగా మార్చుకున్నారు. పేలవమైన సినిమా స్క్రిప్ట్‌లాగా చేశారు. (కథలో) యువతి ఎరిగిన పసికాలపు విజయ్ వేరు కాగా, (నాటికలో) ఆమె భర్తగా చెప్తున్న రవీంద్ర అనే పాత్ర స్టేజి పైకి రాగానే, భార్యను గుర్తించలేకపోవడం నాటికగా మార్చిన భాస్కరచంద్ర ఊహించిన మరొక విడ్డూరం. అతన్ని ఆమె, ఆమెను అతను సినిమా పద్ధతిలో గుర్తించి (కావలించుకున్నాక) వెంటనే వారి మధ్య శారీరక సాన్నిహిత్యం ఏర్పడ్డ దృశ్యం అయితే, అసలు తిలక్ కథలో ఉండదు. కేవలం ఇరువురు అపరిచితులు ఆ వానరోజున, తమ సన్నిహితుల గురించి ఒకరికి ఒకరు చెప్పుకుంటారు. వారొస్తారో, రారో తెలీని దశలో, తామే ఎందుకు జీవన సన్నిహితులుగా మిగలకూడదు అన్న ఆలోచన ఏర్పడుతున్న దశలో ఉంటారు. పై పై సాన్నిహిత్యమే తప్ప శారీరక సంబంధ సూచనేదీ కథలో ఉండదు.

★ ఈ కథలో ఏకంగా ఇరవయ్యేళ్ళ కిందటి భర్త తిరిగి రావడం, వారు మొదట (ఎన్నేళ్లయినా భార్యా, భర్త ఒకరిని ఒకరు గుర్తు పట్టుకోలేని వారుగా ఉంటారా) కొన్ని నిమిషాల దూరం, తరువాత ఒక రాత్రి సాన్నిహిత్యంగా వీరు మార్చిన క్రమం ఖండించదగ్గది. ఇక సంభాషణలైతే ఒకపక్క కరెంటు లేని వానాకాలం రాత్రి, యాభై ఆరేళ్ళ కిందటి కథ అంటూ తామే చెప్పి, నాటిక మధ్యలో, 'ఊరిలో వస్తుంటే ఇళ్లలోంచి వెక్కిళ్లూ, ఏడుపులూ వినిపించాయి' అని రవీంద్ర అనగా, ఆమె 'అవి టీవిలో వస్తున్న సీరియళ్ళలోవి. మా ఊళ్ళో ఎక్కువగా చూస్తారు ఇవే' – అని జవాబిచ్చి ఇద్దరూ నవ్వడం, ఈ కథను వీరు ఏ దశలో ఉండి నాటికగా రాసారా అన్న సందేహానికి తావిస్తోంది. అలాగే, ఆమె నాట్యకారిణిగా ఒక నాట్యం చేయగా, వెంటనే ఆయన ఒక మోడ్రన్ పాట కావాలని కోరగా, యువతి 'గ్రీకు వీరుడూ, నా రాకుమారుడూ' అని పాడుతూ, గిరగిరా తిరుగుతూ, అతన్ని కావిలించుకుంటుంది. ఇదీ తిలక్ 'ఊరిచివరి ఇల్లు' కథకు పట్టినగతి!

★ ఇక కథలో తన జీవన అభద్రతకు లోనైన ముసలి మహిళ, ఈ యువతిని నచ్చుకున్న ఆ వ్యక్తికి, 'ఈమెకు ఇదే పని. వచ్చిన వారిని ఇలానే మోసపుచ్చుతుంది, జాలి కథలు చెప్తుంది. ఇదంతా డబ్బు కోసమే చేస్తుంది' అని చెబుతుంది. ఈ యువతి ఎక్కడ తనను వదిలి ఆ వ్యక్తితో వెళ్ళిపోతుందోనన్నది ఆమె భయం. తిలక్ దర్శించిన మానవ మనస్తత్వ వైచిత్రి ఇది. దీనికి మనసు విరిగిన ఆ వ్యక్తి, వారి నడవడిక పట్ల నొచ్చుకున్నా, వారి ఆర్థికావసరాలను గుర్తించి, తన మనీపర్స్ అక్కడ విసిరేసి వెళ్ళిపోతాడు. యువతి నిద్ర లేచి, జరిగింది తెలుసుకుని, ఆ మనీపర్స్ తీసుకుని రైల్వేస్టేషన్‌కి వెళ్ళి, అక్కడ ఒక బోగీలో నిల్చుని ఉన్న తనని చూసి, ఆ పర్స్ అతని పైకి విసిరేస్తుంది. కదిలిపోతున్న రైలులో తను, కింద స్టేషన్లో ఆయాసంలో ఒగరుస్తూ ఈ అభాగిని. తీరా అతను చూసుకుంటే, పర్సులో డబ్బంతా ఉంటుంది తప్ప, అతని ఫోటో ఉండదు. అంటే, ఆమె, 'మా ఆర్థికావసరాల కోసం మిమ్మల్ని ప్రలోభ పెట్టలేదు. మీరంటే నాకే ప్రేమ కలిగింది' అన్నది తన వద్ద ఉంచుకున్న ఫొటో ద్వారా చెబుతోంది. ఇదీ కథకు తిలక్ ఇచ్చిన ముగింపు.

★ అవమానించిన భర్తను గెటవుట్ అని ఈ నాటికలో యువతి పంపించి వేయడం, ఏ విలువలకు న్యాయం చేస్తున్నదో, అసలు తిలక్ కథకు ఇలా తిలోదకాలు ఇచ్చి, పైపెచ్చు 'అనంతానంతం' అంటూ పేరు కూడా మార్చి (ఏమిటీ పేరుకు, కథకు గల అర్థ సంకేతమో, వీరే చెప్పాలి) కథను ఇంత ఘోరంగా నాటికీకరణ చేశారు వీరు. సరే! మరి నాటిక ప్రదర్శనల స్క్రూటినీ (ప్రాథమిక పరిశీలనకు) వెళ్ళిన వారు ఏం చేస్తున్నట్టు? ఎలా ఈ నాటికను తుది జాబితా కోసం ఎంపిక చేశారు?

★ గత వత్సరం తునిలో ఈ ప్రదర్శనల సందర్భంలోనూ తిలక్ కథ 'నల్లజర్ల రోడ్డు' నాటికీకరణలో సెల్ ఫోన్ ప్రవేశపెట్టి, ఇంకొన్ని నాటికల్లో కూడా సెల్‌ఫోన్ ఆధారిత పొడుగాటి దృశ్యాలు నడిపిన తీరు చూస్తే, ఉత్తమ సాహితీ విలువలుగల కథల నాటికీకరణలో తమ బాధ్యత చాలా తక్కువని నాటికలుగా మారుస్తున్న కొందరు భావిస్తున్నట్టుగా అనిపిస్తోంది. కాబట్టి ఇటువంటి నాసిరకం నాటికీకరణలు, పోటీ ప్రదర్శనల తుది జాబితాలోకి రాకుండా ఉండాలి అంటే, ప్రాథమిక పరిశీలనలు ఇంకా క్షుణ్ణంగా జరగాలి. ఏ కథను వీరు నాటిక చేస్తున్నారో అన్న ఎరుక పూర్తిగా, స్క్రూటినీకి వెళ్ళే పరిశీలకులకు ఉండాలి. అప్పుడే, ఎన్నో శ్రమదమాదులకోర్చి అజో –విభొ కందాళం ఫౌండేషన్ చేస్తున్న కృషికి సంపూర్ణ సార్థకత.

- రామతీర్థ
98492 00385

సెమీస్‌కు ఢిల్లీ



ఎస్‌జె.హుయాన్ (ఢిల్లీ)

నార్త్ ఈస్ట్‌పై సంచలన విజయం

హైదరాబాద్ : ఢిల్లీ డాషర్స్ జట్టు నార్త్ ఈస్ట్‌పై సంచలనం విజయంతో సెమీఫైనల్‌కు చేరింది. బుధవారంనాడిక్కడ జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 4-1 పాయింట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ట్రంప్ మ్యాచ్‌లు రెండూ గెలుపొందడంతో పాటు పురుషుల సింగిల్స్ మ్యాచ్ ఒకటి గెలవడంతో ఆ జట్టు తిరుగులేని 4-0 ఆధిక్యతను సంపాదించింది. ఈ విజయంతో ఢిల్లీ డాషర్ సెమీస్‌కు చేరిన నాల్గవ జట్టుగా నిలిచింది. ఇప్పటికే అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్, బెంగళూరు బ్లాస్టర్స్, హైదరాబాద్ హంటర్స్ సెమీఫైనల్స్‌కు చేరి ఉన్నాయి. బుధవారం నుంచి 14వ తేదీవరకు గచ్చిబౌలి స్టేడియంలో చివరి దశ లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. గురువారం జరిగే ఆఖరి మ్యాచ్‌తో లీగ్ మ్యాచ్‌లన్నీ పూర్తి కానున్నాయి. 12, 13 తేదీల్లో సెమీఫైనల్స్.. 14న ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది.

నేటి మ్యాచ్...
హైదరాబాద్ హంటర్స్
x
బెంగళూరు బ్లాస్టర్స్

మిక్స్‌డ్ డబుల్స్ :
వి.ఇవనోవ్/పొన్నప్ప (ఢిల్లీ) 13-15, 11-15తో ఎం.లీ/ఎస్‌బి ఛియాల్(నార్త్) చేతిలో ఓటమి

పురుషుల సింగిల్స్ :
విన్సెంట్ (ఢిల్లీ) 15-13, 10-15, 15-12 అజయ్ జయరామ్(నార్త్)పై గెలుపు

పురుషుల సింగిల్స్ (నార్త్ ట్రంప్) :
టి.హుయి (ఢిల్లీ) 15-10, 8-15, 15-11 టి.వుయ్ (నార్త్)పై గెలుపు

మహిళల సింగిల్స్ (ఢిల్లీ ట్రంప్) :
ఎస్‌జె.హుయాన్ (ఢిల్లీ) 13-15, 15-11, 15-13 ఎం.లీ (నార్త్)పై గెలుపు

పురుషుల డబుల్స్ :
వి.ఇవనోవ్/ఐ.సజనోవ్ (ఢిల్లీ) 15-9, 10-15, 9-15 ఛియోల్/జంగిల (నార్త్)పై ఓటమి

బ్రాడ్‌మన్ రికార్డు బద్దలు కొట్టిన అఫ్ఘాన్ క్రికెటర్

న్యూఢిల్లీ: ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో వెయ్యి పరుగులు చేసిన వారిలో అత్యధిక సగటు ఆస్ట్రేలియా దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్‌దే. ఇప్పుడా రికార్డు అఫ్ఘానిస్థాన్ దేశానికి చెందిన కుర్రాడు బహీర్ షా (18) బ్రద్దలు కొట్టాడు. బ్రాడ్‌మన్ సగటు 95.14 కాగా... షా 121.77 సగటుతో అగ్రస్థానంలో నిలిచాడు. అతడు తన తొలి ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లోనే 256 పరుగులతో అజేయంగా నిలిచాడు. అరంగేట్రంలోనే అత్యధిక పరుగులు చేసిన రెండో వ్యక్తిగా అవతరించాడు. అంతేకాదు పాకిస్థాన్ దిగ్గజం జావెద్ మియాందాద్ తర్వాత ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లో త్రిశతకం సాధించిన అత్యంత పిన్న వయస్కుడు. బహీర్ నాలుగు ఫస్ట్‌క్లాస్ మ్యాచుల్లో ఆరు ఇన్నింగ్స్‌లు ఆడి 831 పరుగులు చేశాడు. ఈ మధ్యనే వ్యక్తిగతంగా వెయ్యి పరుగులు సాధించడంతో డాన్ బ్రాడ్‌మన్ సగటును దాటేసినందుకు బహీర్ ఉప్పొంగిపోతున్నాడు. త్వరలో న్యూజిలాండ్‌లో జరిగే అండర్-19 ప్రపంచకప్ కోసం బహీర్ అఫ్ఘాన్ జట్టు తరపున ఆడుతున్నాడు.

వెయ్యి పరుగులు చేసిన వారిలో అత్యధిక సగటు ఉన్న క్రికెటర్లు

- బహీర్ షా (అఫ్ఘాన్) - 121.77
- బ్రాడ్‌మన్ (ఆసీస్) - 95.14
- విజయ్ మర్చంట్ (భారత్)- 71.64
- జార్జ్ హెడ్లే (వెస్టిండీస్) - 69.86



స్కీయింగ్‌లో భారత్‌కు తొలి పతకం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ వేదికపై భారత్ మరోసారి సత్తా చాటింది. టర్కీలోని ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డీ స్కీ(ఎఫ్ఐఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన స్కీయింగ్‌లో భారత్‌కు తొలి పతకాన్ని అందించి అంచల్ ఠాకూర్ చరిత్ర సృష్టించింది. హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలికి చెందిన 21 ఏళ్ల ఠాకూర్ ఎఫ్ఐఎస్ ఆధ్వర్యంలో ఆల్‌పైన్ ఎజ్డర్ 3200 కప్ టోర్నీలో భారతదేశం తరపున పాల్గొంది. టోర్నీలో భాగంగా స్లాలోమ్ రేస్ కేటగిరీలో పాల్గొన్న ఆంచల్ కాంస్య పతకం కైవసం చేసుకుంది. స్కీయింగ్‌లో భారత్ పతకం సాధించడం ఇదే తొలిసారి.

అంధుల ప్రపంచకప్
టీమిండియా ఘన విజయం


దీపక్ మలిక్ (179)

న్యూఢిల్లీ: యూఏఈలో జరుగుతున్న అంధుల వన్డే ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం సాధించింది. బుధవారం లంకతో జరిగిన తొలి మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. హరియాణా కుర్రాడు దీపక్ మలిక్ 103 బంతుల్లో 179 పరుగులతో అజేయంగా నిలిచి ఆకట్టుకున్నాడు. టాస్ గెలిచిన భారత్ తొలుత శ్రీలంకను బ్యాటింగ్‌కు దించింది. ఆ జట్టు 40 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 357 పరుగులు చేసింది. శ్రీలంక జట్టులో సురంగ సంపత్ 68, కేప డిసిల్వా 64 పరుగులు చేశారు. 15 ఓవర్లకు లంకేయులు ఒక వికెట్ నష్టపోయి 121 పరుగులతో ఉండటం గమనార్హం. లక్ష్య ఛేదనకు దిగిన టీమిండియా 32 ఓవర్లకే నాలుగు వికెట్లు చేజార్చుకుని విజయం సాధించింది. దీపక్ అజేయంగా నిలిచి అద్భుతమైన షాట్లు ఆడాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. మరో బ్యాట్స్‌మన్ ప్రకాశ్ జయరామయ్య 76 పరుగులు చేశాడు. సారథి అజయ్ రెడ్డి 9 పరుగులు చేశాడు.


జడేజా

రిజర్వ్ బెంచ్‌కు అవకాశం


పార్థీవ్ పటేల్

టీమిండియా జట్టు కూర్పునకు కసరత్తు

సఫారీలపై పైచేయి సాధించాలంటే ఎటాకింగ్ ఆట ఒక్కటే మార్గం. తొలి టెస్ట్‌లో 72 పరుగులతో ఓడిన భారత జట్టు రిజర్వ్ బెంచ్‌కే పరిమితమైన కెఎల్. రాహుల్, రహానేలు శనివారం నుండి ప్రారంభమయ్యే రెండో టెస్ట్‌లో చోటు లభించడం ఖాయంగా కనబడుతోంది. వీరికి తోడు ఆల్‌రౌండర్ రవీంద్రు జడేజా, వికెట్ కీపర్, ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ పార్థీవ్ పటేల్ కూడా భారత జట్టుకు అందుబాటులో ఉన్నారు. తొలి టెస్ట్‌ను టీమిండియా కేవలం బ్యాటింగ్ తడబాటు కారణంగానే ఓటమిపాలైంది. సెంచూరియన్‌లో ప్రారంభమయ్యే రెండో టెస్ట్‌లో బ్యాట్స్‌మన్లు రాణిస్తే సఫారీలకు కష్టాలు తప్పవు...

(ప్రజాశక్తి-స్పోర్ట్స్ డెస్క్)


రహానే


కెఎల్ రాహుల్

రాహుల్, రహానేలను తొలి టెస్ట్ జట్టులోకి తీసుకోకపోవడంపై సౌరవ్ గంగూలీ, మాజీ క్రికెటర్లు ఇప్పటికే ధ్వజమెత్తారు. ఆల్‌రౌండర్ రవీంద్రు జడేజాతోపాటు పార్థీవ్ పటేల్ కూడా అందుబాటులో ఉన్నాడు. దీంతో 13వ తేదీనుండి ప్రారంభం కానున్న రెండో టెస్ట్‌లో వీరిలో ఎవరికి తుది జట్టులో స్థానం లభించనుందనేది సందేహాస్పదంగా ఉంది. రహానే స్వదేశీ సిరీస్‌లలో కంటే విదేశీ సిరీస్‌లలో రాణిస్తాడనే నానుడి ఉంది. కెఎల్ రాహుల్ ఎటాకింగ్ గేమ్, బౌన్సీ పిచ్‌లపై రాణించిన సందర్భాలున్నాయి. వ్యక్తిగతంగా ఇప్పటి వరకు 21 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 1,428 పరుగులు సాధించాడు. 199 పరుగుల అత్యధిక స్కోర్‌తో పాటు ఐదు సెంచరీలు, 10 అర్ధసెంచరీలు సాధించాడు. రాహుల్‌ను సెంచూరియన్ పార్క్‌లో ప్రారంభమయ్యే రెండో టెస్ట్‌కోసం నెట్‌ప్రాక్టీస్‌లో శ్రమిస్తున్నాడు.

రహానే ఇప్పటివరకు 43 టెస్టులు ఆడి 2,826 పరుగులు సాధించాడు. ఇందులో 9 సెంచరీలు 12 అర్ధ సెంచరీలున్నాయి. రహానే స్వదేశీ మైదానంలో కంటే విదేశాల్లోనే రాణిస్తాడనడంలో ఎటువంటి సందేహం లేదు. అత్యధిక పరుగులు 188 సాధించడమే గాక 44.15 యావరేజ్‌తో సీనియర్ బ్యాట్స్‌మన్‌గా జట్టుకు సేవలందిస్తున్నాడు. రవీంద్రు జడేజా ఇటీవల జరిగిన రంజీట్రోఫీలో రాణించాడు. పార్థీవ్ పటేల్ కూడా రిజర్వ్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. పార్థీవ్ పటేల్ వికెట్ కీపర్‌గానే కాకుండా ఓపెనింగ్ బ్యాట్స్‌మన్‌గా రాణించిన సందర్భాలు ఉన్నాయి. రిజర్వ్ బెంచ్‌లో పరిమితమైన సీనియర్ బ్యాట్స్‌మన్లను, ఆల్‌రౌండర్ల సేవలతో పాటు టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్లు రాణిస్తేనే దక్షిణాఫ్రికా పర్యటనలో భారత జట్టు మెరుగైన ప్రదర్శన చేసే అవకాశముంది.

ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తొలిటెస్ట్‌లో భారత జట్టు 92 పరుగులకు ఏడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న దశలో క్రీజ్‌లోకి వచ్చి 95 బంతుల్లో 93 పరుగులతో అద్భుతంగా రాణించాడు. పాండ్యా మాదిరిగా టాప్‌ఆర్డర్, మిడిలార్డర్ బ్యాట్స్‌మన్లు రాణిస్తేనే సిరీస్‌లో నిలిచే అవకాశముంది. దక్షిణాఫ్రికా బౌన్సీ పిచ్‌లపై క్రీజ్‌లో కుదురుకుంటే భారీస్కోర్ సాధించడం ఏమంత కష్టం కాదు.

దక్షిణాఫ్రికా జట్టులో డివిలియర్స్ క్రీజ్‌లో దిగేసరికి ఆ జట్టు 12 పరుగులకు మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో ఉంది. నాలుగవ వికెట్‌కు డుప్లెసిస్‌తో కలిసి 114 పరుగులు భాగస్వామ్యం ఆ జట్టుకు చాలా ఉపయుక్తంగా నిలిచింది. డుప్లెసిస్ కంటే డివిలియర్స్ గురించే ఎక్కువగా ప్రస్తావించుకోవాల్సి ఉంది. అతడు కేవలం 84 బంతుల్లో 65 పరుగులు చేశాడు. వన్డే తరహాలో బ్యాటింగ్ చేయడంతో బౌలర్లు కొంత నిరుత్సాహానికి గురయ్యారు.

తొలి టెస్ట్‌లో విజయం సాధించిన ఆ జట్టుకు నలుగురు పేసర్లు రాణించడంతోనే సాధ్యపడిందని దక్షిణాఫ్రికా కోచ్ ఒటిస్ గిబ్సన్ తెలిపాడు. అదే తరహాలో రెండో టెస్ట్‌లో పేస్‌కు పదునుపెట్టి గాయపడిన స్టెయిన్ స్థానంలో మరో పేస్ బౌలర్‌ను తుది జట్టులో తీసుకునే అవకాశముందని తెలిపాడు.

బీసీసీఐ పంపిస్తానంటే.. మేనేజ్‌మెంట్ వద్దంది...

వన్డేల్లో చోటు లభించని మురళీ విజయ్, రహానె, పుజారాలను ముందుగానే దక్షిణాఫ్రికా పంపిద్దామనుకుంది బీసీసీఐ అనుకుంది. ఇదే ప్రతిపాదనను టీమ్ మేనేజ్‌మెంట్ వద్ద ప్రస్తావించగా వారు కుదరని చెప్పారు.

కొందరు ఆటగాళ్ల ముందుగానే అక్కడికి వెళ్తే ప్రాక్టీస్‌తో పాటు అక్కడి వాతావరణ పరిస్థితులకు వారు అలవాటు పడతారని బీసీసీఐ సూచించింది. కానీ టీమ్ మేనేజ్‌మెంట్ కాదనడంతో చేసేది లేక బీసీసీఐ వెనక్కి తగ్గింది. గతంలో భారత్ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు సచిన్, వీవీఎస్ లక్ష్మణ్, రాహుల్ ద్రవిడ్‌లు ముందుగానే వెళ్లేవారు. వీరి కోసం బీసీసీఐ ప్రత్యేకంగా ప్రాక్టీస్ గేమ్స్ కూడా సిద్ధం చేసేది అని ఓ బీసీసీఐ అధికారి తెలిపారు.

దక్షిణాఫ్రికా పర్యటనకు మిథాలీ సారథ్యం



న్యూఢిల్లీ: ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనున్న భారత మహిళ జట్టు సభ్యుల వివరాలను బీసీసీఐ బుధవారం ప్రకటించింది. ఐసీసీ ప్రపంచకప్ క్వాలిఫయర్ తర్వాత దక్షిణాఫ్రికా మహిళ జట్టుతో ఫిబ్రవరిలో మరోసారి భారత్ తలపడనుంది. ఈ సిరీస్‌లో కెప్టెన్‌గా మిథాలీరాజ్, వైస్-కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్ వ్యవహరించనున్నారు. దక్షిణాఫ్రికాతో భారత్ మూడు వన్డేలు, ఐదు టీ-20లు ఆడనుంది. 16 మంది సభ్యుల జట్టులో యువ క్రీడాకారిణి జెమిమా రోడ్‌రిగ్యూస్ తొలిసారి స్థానం దక్కించుకుంది. **జట్టు వివరాలు :** మిథాలీ రాజ్(కెప్టెన్), హర్మన్‌ప్రీత్ కౌర్(వైస్-కెప్టెన్), సుష్మా వర్మ(కీపర్), ఎక్తా బిస్త్, స్మృ మంధన, పూనమ్ యాదవ్, పునమ్ రౌత్, రాజేశ్వరి గైక్వాడ్, జెమిమా రోడ్‌రిగ్యూస్, గుల్షన్ గోస్వామి, దీప్తి శర్మ, శిఖ పాండే, మోనా మెశ్రామ్, పూజా వస్త్రాకర్, వేదా కృష్ణమూర్తి, భాటియా (కీపర్).

కార్డుకు రూ.15 యూజర్ ఛార్జీ చెల్లించాలి

- రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాధవరావు
- 12,13 తేదీల్లో సమావేశాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ - పోస్ ద్వారా పంపిణీ చేసే ప్రతి రేషన్ కార్డుకూ రూ. 15 యూజర్ ఛార్జీ చెల్లించాలని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దివి లీలా మాధవరావు ప్రభుత్వాన్ని కోరారు. అన్ని చోట్లా విలేజ్ మాల్స్ ప్రారంభించి, డీలర్లకు ముద్ర బ్యాంక్ ద్వారా రూ. 2 లక్షల రుణమివ్వాలని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్ డీలర్ల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 12న విశాఖపట్నంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశామని, అదే రోజు సాయంత్రం తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలో కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 13న అంబాజీపేటతోపాటు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో కార్యవర్గ సమావేశం ఉంటుందన్నారు. సమావేశాల్లో ప్రధానంగా సబ్సిడీపై ప్రభుత్వం పంపిణీ చేసే పంచదార, కందిపప్పు, ఇతర సరుకులపై డీలర్లకు పదిశాతం కమీషన్, హెల్త్‌కార్డులు, చంద్రన్న బీమా సౌకర్యం తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. సంక్రాంతి, క్రిస్మస్ కానుకల్లో కొన్ని సరుకులలో వచ్చిన తరుగును పరిగణనలోకి తీసుకొనేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఫిబ్రవరి 16 తర్వాత జాతీయ నాయకులతో రాష్ట్ర వ్యాప్త డీలర్ల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు.

జగన్ @ 800 కిలోమీటర్లు

బాబు పాలనలో చెరకు రైతులకు కన్నీళ్లే

ప్రజాశక్తి-వెదురుకుప్పం

జగన్ చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలంలో 58వ రోజైన బుధవారం 800 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. జగన్ కోసం జనం రోడ్డుపై బారులు తీరి ఆయన్ని చూసేందుకు, తమ సమస్యలు తెలియజేసేందుకు తండోపతండాలుగా తరలివచ్చారు. మొదటగా వెదురుకుప్పం మండలంలోని జక్కదన గ్రామంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రజా సంకల్పయాత్రను ప్రారంభించారు. గంటవారిపల్లికి చేరుకుని మినరల్‌వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆ గ్రామంలో గోవర్ధన్ అనే విద్యార్థి ఇడుపులపాయలో ట్రిబుల్ ఐటిని పూర్తిచేసినా ఉద్యోగం రాలేదని జగన్‌కు విన్నవించుకున్నాడు.

గుండుపల్లి వద్ద చెరకు రైతును కలిసి బెల్లం తయారీకి సంబంధించిన వివరాలను, సమస్యలను జగన్ అడిగి తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ ఒక ఎకరా చెరకును గానుగలో ఆడించాలంటే కూలీల ఖర్చులతో సహా రూ.70 వేలు అవుతుందని, ఈ చెరకు పంట సంవత్సరానికి ఒక సారి చేయడం ద్వారా ఈ బెల్లానికి ప్రస్తుతం మార్కెట్లో ధర లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. బెల్లం తయారీ వల్ల తమకు నష్టం వస్తుందే గానీ లాభం లేదని మొరపెట్టుకున్నాడు. ప్రస్తుతం కూలీల డిమాండ్ ఎక్కువగా ఉండటంతో కూలీలకు దినసరి కూలీని చెల్లించుకోలేని పరిస్థితి ఎదురవుతోందన్నారు. కె.భాస్కర్‌రెడ్డి అనే రైతు తన చేతికి గాయం అయితే



ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయడానికి వైద్యులు నిరాకరించడంతో తన సొంత ఖర్చులతో వైద్యం చేసుకున్నానని విలపించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే ప్రజలందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. వట్లవారిపల్లెకు చేరుకుని స్థానిక మహిళలతో డ్వాక్రా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నలవెంగనపల్లి దగ్గర స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన వైఎస్‌రాజశేఖర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాష్యంవారి కండ్రిగ వద్ద జెయిన్ ఫ్యాక్టరీ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ జగన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. గుండుపల్లిలోనే రాత్రికి బస చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు మిథున్‌రెడ్డి, విజయ్‌సాయి రెడ్డి, ఎంఎల్ఎలు నారాయణస్వామి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపి జ్ఞానేందర్ రెడ్డి, రాష్ట్ర వైసిపి అధికార ప్రతినిధి పద్మజా రెడ్డి పాల్గొన్నారు.

బిసిలకు జగన్ భరోసా
బిసి సెల్ అధ్యక్షులు జంగం కృష్ణమూర్తి

జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రజాసంకల్పయాత్రతో బిసిలకు భరోసా లభిస్తుందని వైసిపి బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షులు జంగం కృష్ణమూర్తి అన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన బిసి సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బిసిల సర్వతోముఖాభివృద్ధికి వైసిపి అనేక పథకాలను రూపొందిస్తోందన్నారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకానికి సిఎం చంద్రబాబు తూట్లు పొడిచారని విమర్శించారు. తెలంగాణాలో ఆంధ్రా విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్ చేయకపోవడంతో వారంతా రోడ్డున పడ్డారని, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిసి అధ్యయన కమిటీ ద్వారా పేదల సమస్యలను తెలుసుకుని మేధావుల సలహాతో అనేక పథకాలను రూపొందిస్తున్నట్లు వివరించారు. ప్రజాసంకల్పయాత్ర తరువాత నిర్వహించే బిసి డిక్లరేషన్ కార్యక్రమంతో వెనుకబడిన తరగతుల ప్రజల జీవి తాల్లో మార్పు వస్తుందని జంగం తెలిపారు. చేతి వృత్తులు, కూలీ చేసే వారికి 45 ఏళ్ల తరువాత శక్తి సన్నగి ల్లిపోతుంద న్నారు. జగన్ అందుకే 45 ఏళ్ల ఉన్నవారికి పింఛను ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో చంద్రబాబు ప్రకటించే ఉత్తుత్తి పథకాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. బిసి మంత్రులకు, ప్రజాప్రతినిధులకే ముఖ్యమంత్రి ప్రాధాన్యత ఇవ్వడంలేద న్నారు. బిసి ఓట్లతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం మోసపూరిత వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన సమయం వచ్చిందన్నారు. సమావేశంలో మాజీ మంత్రి కొలుసు పార్థసారథి, సామినేని ఉదయభాను, జోగిరమేష్‌తోపాటు బిసి నేతలు పాల్గొన్నారు.


హిందూపురంలో గృహ నిర్మాణ పథకానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తున్న సినీనటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ

సొంతింటి కలను నెరవేరుస్తాం
సినీనటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ

ప్రజాశక్తి- హిందూపురం టౌన్

హిందూపురం నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహాలు నిర్మించి పేదల సొంతింటి కలను నెరవేరుస్తామని సినీనటుడు, హిందూపురం శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణ అన్నారు. బుధవారం హిందూపురం రూరల్ మండలం కొటిపి సమీపంలో 118 ఎకరాల్లో 13531 ఇళ్ల నిర్మాణాలను రూ.160.51 కోట్లతో చేపట్టనున్నారు. ఈ గృహ నిర్మాణ పథకానికి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ తన తండ్రి నందమూరి తారకరామారావు ఆశయాలను నెరవేర్చడమే లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. రాష్ట్రంలోని ఒక్కొక్క నియోజకవర్గానికి 6వేల ఇళ్ల చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తే ఒక హిందూపురం పట్టణం, రూరల్ మండలానికి అదనంగా 11 వేలు ఇళ్లను మంజూరు చేయించామని తెలిపారు. ప్రస్తుతం కొటిపి సమీపంలో చేపట్టిన గృహ నిర్మాణ పథకాన్ని ఆరు మాసాల్లో పూర్తిచేసి అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హిందూపురం ఎంపీ నిమ్మలక్రిష్టప్ప, మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మి, బిసిఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ రంగనాయకులు జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ గౌస్‌మోదీన్, తదితరులు పాల్గొన్నారు.

దళితులు, గిరిజనులు
పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- నగర ఎస్సీ,ఎస్టీ యువతకు అవగాహన కల్పించాలి
- విజయవాడ మేయర్ కోనేరు శ్రీధర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల్ని సద్వినియోగం చేసుకొని దళితులు, గిరిజనులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని విజయవాడ నగర మేయర్ కోనేరు శ్రీధర్ అన్నారు. విజయవాడలోని ఒక ప్రైవేటు హోటల్‌లో బుధవారం ఎన్ఎస్ఐసి, ఎమ్ఎస్ఎమ్ఇ ఆధ్వర్యంలో జాతీయ షెడ్యూల్డ్ కులాలు, తెగల హబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి అవకాశాన్ని అందరూ అందిపుచ్చుకోవాలన్నారు. పారిశ్రామికవేత్తలుగా ఎస్సీ, ఎస్టీలు అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఒక కుటుంబంలో ఒకరు మాత్రమే అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. విజయవాడలో ఉన్న ఎస్సీ, ఎస్టీ యువతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నగరంలో సుమారు 15 ఇంజనీరింగ్ కళాశాలలున్నాయని, వీటిల్లో వేలాది మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుతున్నారని, పారిశ్రామిక రంగం గురించి వీరికి ప్రత్యేక అవగాహన కల్పించాలని కోరారు. విజయవాడలో సుమారు 10 లక్షల మంది జనాభా ఉంటే అందులో దాదాపు మూడు లక్షల మంది ఎస్సీ, ఎస్టీలున్నారని, వీరిలో కనీసం 40 వేల మందికి అవకాశం కల్పించినా రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములవుతారన్నారు. అన్ని ఐటిడిఏలు, విశ్వవిద్యాలయాల్లో అవగాహనా కార్యక్రమాల్ని చేపట్టాలని ప్రణాళికలు రూపొందించామని, విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం కూడా త్వరలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని సౌత్‌జోన్ డిక్కీ అధ్యక్షులు ఎన్.రవికుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎస్ఐఎ అధ్యక్షులు టి పార్థసారథి , డిఐఎ జాతీయ అధ్యక్షులు ఎం సుదర్శన్, ఎమ్ఎస్ఎమ్ఇ డిడి ఎం కాలేబు, ఎస్‌బిఐ డిజిఎం దీప్‌చంద్‌తో పాటు 13 జిల్లాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

తగ్గని పందెం రాయుళ్లు

- జోరుగా కోడి పందేలకు ఏర్పాట్లు
- పోలీసులపై విమర్శల వెల్లువ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కోడి పందేలు వేయడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసినా పందెం రాయుళ్లు మాత్రం ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. చాప కింద నీరులా తమ పని తాము చేసుకుపోతున్నారు. నిర్వాహకులంతా కోడి పందేల బరులు తయారు చేయడంలో నిమగ్నమయ్యారు. ఉభయ గోదావరి జిల్లాల్లో కొందరు నేతల ఆధ్వర్యంలోనే కోడి పందేలకు ఏర్పాట్లు జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి.

కృష్ణా, గుంటూరుతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ ఇదే రీతిలో సంక్రాంతి జూదానికి ఏర్పాట్లు ఊపందుకున్నాయి. కోడి పందేల విషయంలో ఈ ఏడాది హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేయడంతో 1960 జంతు రక్షణ చట్టం, 1974 గేమింగ్ చట్టాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం మండలాల వారీగా కమిటీలు ఏర్పాటు చేసింది. తహశీల్దార్‌తో పాటు పోలీస్, రెవిన్యూ, పశు సంవర్ధకశాఖ సిబ్బంది, ఎన్‌జిఒ సభ్యులుండే ఈ కమిటీలు గ్రామస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించడంతో పాటు కోడి పందేలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలి. అవసరమైతే పాత నేరస్థుల్ని బైండోవర్ చేయాలని కూడా ఆదేశాలున్నాయి. దీంతో పాటు ఎప్పటికప్పుడు సమాచారాన్ని జిల్లా కలెక్టర్లతో పాటు ఎస్పీలకు అందజేయాల్సి ఉంటుంది.

వారం రోజులైనా...

అయితే జూద క్రీడల నిరోధానికి కమిటీలేర్పడి వారం రోజులు పూర్తయినా కోడి పందేల నిర్వహణకు జిల్లాల్లో చేస్తున్న ఏర్పాట్లను అడ్డుకోవడంలో విఫలమయ్యాయనే ఆరోపణలొస్తున్నాయి. కోడి పందేలతో పాటు ఇతర జూదాల నిరోధానికి తీసుకున్న చర్యలు, ఏర్పాటు చేసిన అవగాహన సమావేశాల సమాచారాన్ని ఇంత వరకు కమిటీలు బహిర్గతపరచక పోవడం గమనార్హం. అధికారపార్టీ ఒత్తిళ్లతో పాటు స్థానిక నేతలు నయానో భయానో బెదిరించడంతో కొందరు కమిటీ సభ్యులు తమకెందుకులే అన్న ధోరణితో ఉన్నట్లు తెలుస్తోంది.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68